SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 04
September - 2024, Price Rs.20/-.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

సెప్టెంబర్ 2024
వెల రూ. 20/-
పుటలు - 56



**శ్రీపద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు**

(16-09-2024 నుండి 18-09-2024 వరకు)



# తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

(2024, అక్టోబరు 04 నుండి 12 వరకు)

**04-10-2024 శుక్రవారం**

పగలు - తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం

రాత్రి - పెద్దశేషవాహనం

**05-10-2024 శనివారం**

పగలు - చిన్నశేషవాహనం

రాత్రి - హంసవాహనం

**06-10-2024 ఆదివారం**

పగలు - సింహవాహనం

రాత్రి - ముత్యపుపందిరివాహనం

**07-10-2024 సోమవారం**

పగలు - కల్పవృక్షవాహనం

రాత్రి - సర్వభూపాలవాహనం

**08-10-2024 మంగళవారం**

పగలు - పల్లకీలో మోహినీ అవతారోత్సవం

రాత్రి - గరుడవాహనం

**09-10-2024 బుధవారం**

పగలు - హనుమద్వాహనం

సాయంత్రం - వసంతోత్సవం, స్వర్ణరథరంగ డోలోత్సవం

రాత్రి - గజవాహనం

**10-10-2024 గురువారం**

పగలు - సూర్యప్రభవాహనం

రాత్రి - చంద్రప్రభవాహనం

**11-10-2024 శుక్రవారం**

పగలు - రథోత్సవం

రాత్రి - అశ్వవాహనం

**12-10-2024 శనివారం**

పగలు - పల్లకీ ఉత్సవం, తీర్థవారీ అవభృథం, చక్రస్నానం

రాత్రి - తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-20వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అయమ్=ఇది(ఈ ఆత్మ); కదాచిత్= ఏ కాలమునందైనను; న, జాయతే= జన్మింపదు, వా=మఱియు, న, మ్రియతే= మరణింపదు; వా= అట్లే, భూత్వా, భూతః భవితా, న= ఉత్పన్నమై, అస్తిత్వమును పొందునదియు కాదు (ఏలనన); అయమ్= ఇది (ఈ ఆత్మ); అజః= జన్మలేనిది; నిత్యః=నిత్యమైనది; శాశ్వతః= శాశ్వతమైనది; పురాణః=సనాతనమైనది; శరీరే= శరీరము; హన్యమానే=చంపబడుచున్నను; న, హన్యతే=(ఇది) చంపబడదు.

**భావం:** ఈ ఆత్మ ఏ కాలమునందును పుట్టదు, గిట్టదు. పుట్టి ఉండునది కాదు. ఇది భావ వికారములు లేనిది (ఉత్పత్తి, అస్తిత్వము, వృద్ధి, విపరిణామము, అపక్షయము, వినాశము అను ఆఱును భావవికారములు). ఇది జన్మలేనిది. నిత్యము, శాశ్వతము, పురాతనము. శరీరము చంపబడినను ఇది చావదు.

## భావించి తెలుసుకుంటే భాగ్యఫలము..

భావించి తెలుసుకొంటే భాగ్యఫలము
ఆవలీవలిఫలము లంగజజనకుఁడే

దానములలో ఫలము తపములలో ఫలము
మోనములలో ఫలము ముకుందుఁడే
జ్ఞానములలో ఫలము జపములలో ఫలము
నానాఫలములును నారాయణుఁడే

వినుతులలో ఫలము వేదములలో ఫలము
మనసులోని ఫలము మాధవుఁడే
దినములలో ఫలము తీర్థయాత్రల ఫలము
ఘనపుణ్యముల ఫలము కరుణాకరుఁడే

సతతయోగ ఫలము చదువులలో ఫలము
అతిశయోన్నత ఫలము యచ్యుతుఁడే
యతులలోని ఫలము జితకామిత ఫలము
క్షితి మోక్షము ఫలము శ్రీవేంకటేశుఁడే

(అధ్యాత్మ సంకీర్తన సంపుటం-4; సంకీర్తన-291)





"సర్వవిధములైన దానములు, తపస్సులు, మౌనవ్రతములు, జ్ఞానములు, జపములు, వేదాధ్యయనము, స్తోత్రములు, మానసిక ధ్యానములు, పుణ్యవాసరోపవాసములు, తీర్థయాత్రలు, పుణ్యకర్మములు, యత్యాశ్రమము, కామజేతృత్వము, ఎడతెగని యోగము, భాగవతాది గ్రంథపఠనము- వీటి యన్నింటియొక్క ఫలము మాధవుడే; నందనుతుడే; మధురిపుడే; అచ్యుతుడే; ముచికుందవరదుడే; శేషాద్రివాసుడు శ్రీనివాసుడే." అని అన్నమాచార్యులవారి పలుకులు.

*వ్యాఖ్యాత - కీ.శే. విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు*



## 'సప్తగిరి' సకాలంలో చేరాలంటే...

01) పాఠకులు తాము 'సప్తగిరి' చందాదారులుగా చేరినప్పుడు ఇచ్చిన చందా నెంబరును మరొక్కమారు పరిశీలించుకోగలరు.

02) ఎందుకంటే.. 'సప్తగిరి' పత్రిక ఒకవేళ అందనివారు, ఆ చందా నెంబరు కార్యాలయానికి చేరవేసి వివరాలు పొందవచ్చు.

03) 'సప్తగిరి'పత్రిక సకాలంలో చేరకపోయినా, చిరునామాలో మార్పులు ఉన్నా ఈ-మెయిల్ (chiefeditortpt@gmail.com) ఐడిని సంప్రదించాలి.

04) ఈ-మెయిల్ సౌకర్యంలేని వారు **0877-2264543, 0877- 2264359** నెంబర్లకు ఫోన్ చేసి, చందా నెంబరు చెప్పి సమస్య పరిష్కరించుకోవచ్చు.

05) నేరుగా సంప్రదించదలచినవారు ప్రధాన సంపాదక కార్యాలయ పనివేళల్లో "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ భవనం, తిరుపతి-517 507" చిరునామాలో సంప్రదించవచ్చు.

## 'సప్తగిరి' చందాదారులుగా చేరాలంటే...

01) చందాదారులుగా చేరేవారు తమ చిరునామా, పిన్‌కోడ్, సెల్‌ఫోన్ నెంబరును, మీకు కావలసిన పత్రిక భాషను స్పష్టంగా రాసి పంపాలి.

02) 'సప్తగిరి' పత్రిక సంవత్సర చందా రూ.240/-.

03) 'సప్తగిరి' పత్రిక జీవిత చందా (12 సంవత్సరాలు మాత్రమే) రూ.2400/-

04) 'సప్తగిరి' పత్రిక ఇతర దేశాలకు సంవత్సర చందా రూ.1030/-

05) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు డి.డి./ ఈ.ఎం.ఓ./ ఐ.పి.ఓ./ ఆన్‌లైన్ (ttdevasthanams.ap.gov.in) ద్వారా నమోదు చేసుకోవచ్చు.

06) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు ఏ జాతీయబ్యాంకులోనైన "**చీఫ్ ఎడిటర్, సప్తగిరి మ్యాగజైన్, టి.టి.డి., తిరుపతి**" పేర డి.డి. తీసి పోస్టు ద్వారా "**ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, తిరుపతి-517 507**" ఈ చిరునామాకు పంపవచ్చు.






తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 సెప్టెంబరు, 2024 సంచిక : 04



వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన
సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి
తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని
మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| నమోస్తు గణాధిపా! | శ్రీ జంధ్యాల శరత్ బాబు | 07 |
| తిరుమలలో తొలిపూజ 'శ్రీవరాహస్వామికే..!' | శ్రీ లక్ష్మి నరసింహ | 09 |
| శ్రీవేంకటాచలమాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| ధీనామవిత్ర్యవతు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 12 |
| బలరామవైభవం | డా॥ వేదార్థం మధుసూదనశర్మ | 13 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 15 |
| సందేహాలు-సమాధానాలు | డా॥ రేవూరు అనంతపద్మనాభరావు | 16 |
| వామనవైభవం | శ్రీమతి కె.విజయలక్ష్మి | 17 |
| మహర్షులకు నమస్సుమాలు | శ్రీమతి మేడేపల్లి అన్నపూర్ణ | 18 |
| పోలాల అమావాస్య | శ్రీ ఐ.హర్షవర్ధన్ | 20 |
| కోరిన వరాలిచ్చే వ్రతం | శ్రీమతి పి.స్వరూప | 22 |
| నిజమైన మానవత్వం | ఆచార్య ఏ.సచ్చిదానంద మూర్తి | 24 |
| తిరుత్తెట్రియమ్బలమ్ (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవం (వర్ణపుటలు) | డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 27 |
| శ్రీనారాపురవేంకటేశ్వరస్వామి ఆలయం, జమ్మలమడుగు | శ్రీ సిఎస్సార్ ఇటుగుళ్లపాటి | 31 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 33 |
| సంఖ్యాపద్ధతి మరియు సంకేతములు | ఆచార్య వి.రమేష్ బాబు | 34 |
| అభీష్టసిద్ధిప్రదాయకం | శ్రీమతి సుధా మాధురీ కార్తిక్ | 36 |
| శ్రీవారి కృపావిశేషం | శ్రీమతి రూపనగుడి అనూరాధ | 38 |
| వేదశైలం | డా॥ ఈ.ఎ.శింగరాచార్యులు | 39 |
| శ్రీతులసి | శ్రీ జె.చంద్రశేఖరశర్మ | 42 |
| చిరంజీవులు | ఉషశ్రీ | 44 |
| గోధుమలతో ఆరోగ్యపరిరక్షణ | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 45 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన - కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ | 46 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 47 |
| శ్రీవారిసాక్ష్యం (చిత్రకథ) | కథ : డా॥ మన్నవ గంగాధరప్రసాద్<br>చిత్రాలు : శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| బాలవినోదం | | 50 |
| మూర్ఖుడికి తెలియజెప్పలేము | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 52 |
| దాతకు ఇవ్వగలిగే శక్తి లేకున్నా ప్రయత్నంతో ఇవ్వగలడు | డా॥తిరుమల శ్రీనివాసాచార్య | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీపద్మావతి అమ్మవారి పవిత్రోత్సవాలు, తిరుచానూరు
వెనుకచిత్రం : శ్రీగోవిందరాజస్వామివారి పవిత్రోత్సవాలు, తిరుపతి



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# భాద్రపదం పిత్నృప్రీతికర మాసం

*"మాతృదేవో భవ! పితృదేవో భవ"*

భగవంతుడి కన్నా జన్మనిచ్చిన తల్లిదండ్రులకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి, వారిని త్రిమూర్తి స్వరూపంగా అర్చించే సమున్నత సంస్కృతికి మన హైందవధర్మం పెద్దపీట వేస్తుంది. అంటే కన్న వారిని కాదన్న వారిని పరమేశ్వరుడు కూడా ఇష్టపడడు.

వినాయకునికి గణాధ్యక్ష పదవినిచ్చి, అట్లే విఘ్నేశాధిపత్యం కూడా ఇచ్చి, లోకపూజ్యుణ్ణి చేసింది కూడా తల్లిదండ్రులైన పార్వతీపరమేశ్వరులకు ఆయన చేసిన ప్రదక్షిణల పుణ్యఫలితమే. అందుకోసమే పితృదేవతలను అర్చించి, వారికి ఉత్తమగతులు కలిగేటట్లు మనిషిని ధర్మదీక్షాబద్ధుణ్ణి చేసేందుకు కొన్ని నియమాలను మన శాస్త్రాలు విధించాయి.

చాంద్రమానం ప్రకారం పౌర్ణమిరోజున చంద్రుడు పూర్వాభాద్ర లేదా ఉత్తరాభాద్రనక్షత్రాల సమీపంలో సంచరిస్తే ఆ మాసాన్ని **'భాద్రపదమాసం'**గా వ్యవహరిస్తారు.

ఈ మాసంలోనే శ్రీమహావిష్ణువు దశావతారాల్లో **వరాహ-వామనావతారాలు** కూడా వచ్చాయి. సువర్ణగౌరీవ్రతం, ఋషిపంచమీవ్రతం, అనంతపద్మనాభవ్రతం వంటి వ్రతాలు కూడా ఈ నెలలోనే వస్తాయి. ఆయా వ్రతాలు, పండుగలు జరుపుకోవడం సముచితం.

కానీ, భాద్రపద బహుళ పక్షమంతా పితృదేవతలకు ప్రీతికరమైతే, శుక్లపక్షం (పాడ్యమి నుండి పౌర్ణమి వరకు) ఎన్నో వ్రతాలు ఆచరించడానికి అత్యంత శుభకాలం. ప్రతిపూజలో తొలిపూజలు అందుకునే **"వినాయకచవితి"** పండుగ ఈ పక్షంలోనే వస్తుంది.

ప్రథమదేవుడు, ప్రధానదేవుడు **గణపతి.** ఏ కార్యానికైనా-అది భౌతికరంగం కావచ్చు, ఆధ్యాత్మికసాధనా కావచ్చు- వాటి అవరోధాలను తొలగించే సిద్ధినీ, బుద్ధి (సమృద్ధి)నీ ప్రసాదించే దివ్యశక్తినే 'గణపతి'గా ఉపాసించడం వేదసంప్రదాయం. విఘ్ననాశనమే ఆరంభం. అందుకే ఈయనను 'విఘ్నసంహారకుని'గా ఆరాధిస్తున్నాం. గజవదనం 'ఓం'కారానికి ప్రతీక. అన్ని శబ్దాలకీ ఆది 'ఓంకారం'. అందుకే తొలిదైవం గజవదనుడు. వేదాల ప్రకారంగా మంత్రగణాలకి, జీవగణాలకి అధిపతి అయిన పరమాత్మయే గణపతి. వారిని అర్చించి, వారి ఆశీస్సులు అందుకోవడం మన కర్తవ్యం.

ఒక్కొక్క మాసంలో ఒక్కో దేవతకు ప్రాధాన్యతను ఇచ్చే మన ఆచారనియమాలు భాద్రపద మాసంలో పితృదేవతలకు అధిక ప్రాధాన్యతనిచ్చాయి. పితృదేవతలకు మంత్రపూర్వకంగా శ్రాద్ధ కర్మలు నిర్వహించి, వారికి ఉత్తమ లోకాలు ప్రాప్తించేలా విధులు నిర్వహించాలని ఈ నియమాలు నిర్దేశిస్తున్నాయి.

భాద్రపదమాసంలో బహుళపక్షాన్ని అంటే పౌర్ణమి తరువాత వచ్చే పాడ్యమినుండి అమావాస్య వరకు ఉండే పదిహేను రోజుల కాలాన్ని **'పితృపక్షం'** లేదా **'మహాలయపక్షం'** అని అంటారు. ఈ కాలం పితృదేవతలకు అత్యంత ప్రీతికరమైంది. ఈ రోజుల్లో అన్ని వర్ణాల వారూ గతించిన తమ పితృదేవతలను తలచుకొంటూ శ్రాద్ధవిధులు తప్పక నిర్వహించాలి. ఈ కాలంలో శుభకార్యాలు చేయడం సముచితం కాదు. కాబట్టి మన సంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని కాపాడుకొంటూ ముందుకు సాగుదాం. లోకాలను కాపాడుదాం.

**లోకాః సమస్తాః సుఖినో భవంతు.**



# నమోస్తు గణాధిపా!

- శ్రీ జంధ్యాల శరత్ బాబు, 99483 45013

వినాయకుడు గణనాథుడైనా, విఘ్ననివారకుడైనా ఆయనే! **'ఓం గం గణపతయే నమః'** అంటాం. ఆదిదంపతుల ప్రథమపుత్రుడిగా, గణసేనావాహిని అధినేతగా ఆ స్వామిని కొలుస్తాం అందరం. 'ఆదౌ పూజ్యో *గణాధిపః*' అని నోరారా కీర్తిస్తాం. ఎంతటి కార్యసిద్ధి అయినా తన ధ్యానం, ఆరాధనతో ప్రాప్తిస్తుంది. పరమానంద స్వరూప పరమాత్మ. అత్యంత మహామహిమాన్విత. ఓంకారరూపుడు, ప్రణవస్వరూపుడు. అంతటి ముఖదర్శనమే మనందరికీ శుభ, జ్ఞాన, మోక్షప్రదం. నిఖిలప్రాణినాథుడైన తనను పూజిస్తే వృద్ధి, సమృద్ధి.

మహాగణాధిపతి-'కొలుచు వారలకు కొంగు *బంగారమ్ము*' అని పెద్దలమాట. ఇక విఘ్నం అంటే 'అంత రాయం'. ఎటువంటి అవాంతరాలనైనా తొలగించి, అడ్డంకులన్నింటినీ నివారించి, భక్తకోటిని పరిరక్షించే స్వామి కనుకనే ప్రతీ ఒక్కరికీ అండదండ. ఆ విఘ్నేశ్వరుని గురించి *గణేశ, ముద్గల*, *బ్రహ్మ, బ్రహ్మాండ*పురాణాలతో పాటు మరెన్నో కావ్యాలు సోదాహరణంగా విపులీకరిస్తున్నాయి.

*గణాధ్యక్షా, విఘ్నరాజా, సుప్రదీపా, మహాబలా, మంగళస్వరా, ప్రథమా, ప్రమథా, విశ్వ నేత్రా, ఆశ్రితవత్సలా, భవాత్మజాయా, అగ్రగణ్యాయా, సర్వాయా, సర్వసిద్ధిప్రదాయా, గణాధీశాయా*, అభీష్టవర దాయా అంటూ అర్చిస్తుంది భక్త ప్రపంచం. జగదాధా రునిగా, అపరాజితునిగా, కాంతిమతిగా, ధృతిమతిగా శ్లాఘిస్తుంది. నిఖిలావనికీ ప్రేమపాత్రుడైన ఆయనను వేదాలు, ఉపనిషత్తులకు తోడు అనేకానేక ప్రబంధాలు, శతకాలు ఎంతగా స్తుతించాయో చెప్పనలవి కాదు. '*ఆదరమొప్ప మ్రొక్కిదుదు- నద్రి సుతా....... సమద మూషిక సాదికి సుప్రసాదికిన్*' అంటూ మహాద్భుతవర్ణన సాగించింది సహజకవి మది. ఈ విధంగా పలుకు పలుకునా తేనెలందుకున్న వినాయక స్వామి అందరివాడు, సాటిలేని మేటి రేడు.

ఎవరు ఎప్పుడు ఏ పని ఆరంభించినా గణాధ్యక్ష అర్చనతోనే. 'నీ మూర్తికే మొదటి ప్రణామం' అంటారందరూ. 'నీవు కొలువున్న మా మనసే నిరతమూ ఆనందధామమని' నివేదిస్తుంటారు. ఊరూ వాడా వీథివీథినా రోజుల తరబడి పండగ సందడి. ఆసనం మీద ప్రతిమను ఉంచి, పాలవెల్లికి రూపుదిద్ది, పత్రితో సుందరంగా అలంకరించి, నలువైపులా పండ్లు అమర్చి, పిండివంటలెన్నింటినో సిద్ధపరచి, సమధిక ఉత్సాహంతో పరిపూర్ణ భక్తిప్రపత్తులతో పూజ నిర్వర్తిస్తారు. సకుటుంబంగా, క్షేమ స్థైర్య విజయ ఆయురారోగ్య ఐశ్వర్య అభివృద్ధి సాధకంగా ఆరాధనలు జరుపుతారు. ధర్మ-అర్థ-కామ-మోక్ష చతుర్విధ ఫలపురుషార్థసిద్ధికి సంబంధించి '*సకల కార్యేషు సర్వదా దిగ్విజయ సిద్ధ్యర్థం*' అంటూ పూజాదికాలు కొనసాగిస్తారు. '*ఏకదంతాయ, శూర్పకర్ణాయ, ఆఖువాహనాయ నమః*' అని చేతులు రెండింటినీ జోడిస్తారు. సమర్చనలో వినియోగించే *మాచీ, బృహతీ, బిల్వ, దూర్వాయుగ్మ, దత్తూర, బదరీ, తులసీ, చూత, కరవీరాది* పత్రి సముదాయం ఉమ్మడిగా, విడిగానూ ఆరోగ్యప్రదాయకాలు.

**సెప్టెంబరు 7న**
**వినాయక చవితి**
**సందర్భంగా...**

వినాయక చవితి/ చతుర్థి మహోత్సవ శుభారంభం, నిమజ్జన సందర్భం– రెండూ ఎంతో వైభవోపేతంగా ఏర్పాటవు తాయి. చతుర్థితిథిని అనుసరించే పర్వదిన నిర్ధారణ తేదీ నిర్ణయమవుతుంది. ప్రత్యేకించి యువజనబృందాలతో నిర్వహణ అంగరంగ వైభవాన్ని తలపిస్తుంది. విలక్షణరీతిన మట్టితో చేసిన గణనాథుని ఆరాధనం దివ్యసందేశాన్ని అందచేస్తోంది. ఆ విధమైన విగ్రహరూపనిర్మాణం పంచమహాభూతాల సమ్మిళితం. నేల, నింగి, అగ్ని, జల, వాయుతత్త్వాలకు ఒక్కో అధిష్ఠాన దేవత రూపాలు, విధానాలు అసంఖ్యాకంగా ఉన్నా; ఒకే పరమాత్మ అనేది మట్టిరూపుతోనే ప్రస్ఫుటమవుతుంది. అసలు 'గణపతి' అనగానే మది మదినా నవోత్తేజ పరికల్పన. ఆబాలగోపాలానికీ మహదానంద సదానుభవం. వ్యాపిత తత్త్వం భూమికే ఉంది. అదే ప్రకృతి సుస్వరూపగుణసంపన్నం. మృత్తిక పరబ్రహ్మ సమన్వితం. అందువల్లనే వినాయకుని మట్టితో చేసి అర్చించడం, సర్వ సకల సమస్త జీవసమత్వానికీ ఏకైక ప్రతీకగా పూజించడం అందుకే.

స్వామి ఎదురుగా కుదురుగా కూర్చుని ప్రార్థించాలి. మనసునంతటినీ సంపూర్తిగా కేంద్రీకరించాలి అందరూ. 'గణపతి దేవుడు మాకు కదలక ఎదలో కలడండీ, అతడే ఓంకృతి నిజమండీ' అని అంటారు. అట్లే 'ఏకదంతా గణనాథా శివగౌరి తనయా శరణు గణేశా' అని కీర్తిస్తారు. 'ఓ భక్త మందారా! ఓ సుందరాకారా! ఓ భాగ్యగంభీరా! ఓ దేవ చూడామణీ! లోకరక్షామణీ!' అని ధ్వనిస్తుంది భక్తలోక మనోమందిరం. 'కుడుములర్పించు పిల్లభక్తులకు నెల్ల ఇడుము లందించి కలుములందించు చేయి' అని స్తోత్రావళి సమర్పిం చింది. ఇవన్నీ స్వామి కరుణాకటాక్షవీక్షణ సాధకాలే.

గణేశచతుర్థిలో పర్వదినమహోత్సవ ఉత్సాహంతోపాటు సంప్రదాయ, సాంస్కృతిక, ఐక్యత అంశాలు లెక్కకు మిక్కిలి ఉన్నాయి. ఇళ్లు, వీధులు, ఊళ్లు ఊళ్లన్నీ భక్తితన్మయత్వంలో మమేకమై, ఆధ్యాత్మిక నిండుదనాన్ని ఎంతగానో సంతరించు కుంటాయి. రూపప్రతిష్ఠాపన, పద్యాలూ పాటలూ శ్లోకాలూ భజనలూ, ఆనందతన్మయ చైతన్యచిన్మయ వాతావరణంలో నృత్యగీతికనూ నవోల్లాసాన్ని సృజిస్తాయి. అన్ని అంతరాలకూ అతీతంగా ప్రజలందరూ పాల్గొనే కార్యక్రమాల పరంపరతో సమైక్యతాస్ఫూర్తి వెలుగులీనుతుంది. సామాజిక అనుబంధం పరివ్యాప్తమై, నిమజ్జనం వరకు కొనసాగి, అంతటా దీప్తిమంతత వెల్లివిరుస్తుంది. అష్టకంలో ఉన్నట్లు... '*ఏకదంతం మహాకాయం తప్తకాంచనసన్నిభమ్/ లంబోదరం విశాలాక్షం వందేహం గణనాయకమ్. గజవక్త్రం సురశ్రేష్ఠం కర్ణచామరభూషితమ్/ పాశాంకుశధరం దేవం వందేహం*' ఇలా మహోత్తుంగ భక్తజనతరంగం వినాయకస్వామిని అభిషేకిస్తుంది. తిరుపతి ప్రాంతంలోని కాణిపాకం వరసిద్ధివినాయకుని ఆలయ ప్రాంగణం ఎంతెంతో శోభాయమానమవుతుంది. ఇక్కడ ఏర్పాటయ్యే వార్షిక బ్రహ్మోత్సవం నేత్రానందదాయకం. సత్య ప్రమాణాల దైవం ఆయన.

పూజించిన వినాయకవిగ్రహాల నిమజ్జనం భారత దేశవ్యాప్తంగా ఘనాతిఘనంగా జరుగుతుంది. ముందుగా సభక్తికంగా అర్చించి, పూలూ పండ్లూ, మోదక లడ్డూలూ, నూతన వస్త్రవిశేషాలను స్వామి ముందు ఉంచుతారు. హారతి అనంతరం ప్రసాద నైవేద్యాన్ని అందరికీ పంచుతారు. నమస్సుమాలు సమర్పించి; ఉత్సవవేళ ఏవైనా పొరపాట్లు తెలియక దొర్లి ఉంటే, మన్నించాలని వేడుకుంటారు. మండపాల నుంచి విగ్రహాలను కదిలించే ముందు మంత్రపఠనాలతో పాటు '*జై బోలో గణేశ మహరాజ్‌కీ*', '*గణపతి బప్పా మోరియా*' నినాద ధ్వనులు అన్నింటా, అంతటా మారుమోగు తాయి. *బప్పా మోరియా* అనేది అనంత ప్రేమభక్తి తత్త్వాలకు నిదర్శనం. తండ్రీ... దైవమా.... అని నిండు మనసుతో ఆరాధించే పదబంధం. జలనిమజ్జనమనేది అభిషేకసూచకం. ఇందులో ధార్మికతకు తోడు తాత్త్విక, భౌతిక విశిష్టతలు ఇమిడి ఉండటం మహత్తర అంశం. '*ఆకాశస్యాధిపో విష్ణుః, అగ్నిశ్చైవ మహేశ్వరః/ వాయోసూర్యః క్షితిరీశః జలరూపో వినాయకః*' అని పురాణోక్తి.

'నేలతో కూడిన ప్రకృతిని మనం ఎంత పరిరక్షించు కుంటే, అంత ఉత్తమ ఫలితం మనకు ప్రాప్తిస్తుంది' అన్నది వినాయకచవితి ఘంటాపథంగా చాటి చెప్తుంది. పత్రి ఔషధ గుణాలు, పాలవెల్లి అలంకరణ విలక్షణతలు, ఉండ్రాళ్లు కుడుములవంటి నైవేద్యాల సమర్పణలు– భక్తులు ఎవరికి వారికే అనుభవైక వేద్యాలు. **పండగ అంటే వినాయకచవితే!** ఇంతకు మించిన సందడి మరేదీ ఉండదంతే!

సెప్టెంబరు 5, వరాహజయంతి సందర్భంగా...



## తిరుమలలో తొలిపూజ

# 'శ్రీవరాహస్వామికే..!'

- శ్రీ లక్ష్మీ నరసింహ, ఐ.

సృష్టి స్థితి లయకారకులైన త్రిమూర్తుల్లో స్థితికారకుడైన శ్రీమహావిష్ణువు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం దశావతారాలు ఎత్తాడు. అట్టి దశావతారాల్లో మూడవ అవతారం **శ్రీవరాహ అవతారం.** భాద్రపదమాసంలో శుక్లపక్ష తదియ– **వరాహ జయంతి.**

పూర్వం ఒకసారి సనకసనందనాది మహర్షులు శ్రీమహావిష్ణువు దర్శనార్థం వైకుంఠానికి చేరుకున్నారు. వైకుంఠంలో ద్వారపాలకులైన జయ, విజయులు శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్లనీయకుండా వారిని అడ్డుకున్నారు. దీనితో కోపోద్రిక్తులైన మహర్షులు “మీరు వైకుంఠానికి, శ్రీమన్నారాయణుడికి దూరమవుగాక!” అని శపించారు. అప్పుడు జయవిజయులు శ్రీమహావిష్ణువును శరణు కోరారు.

ఆ సమయంలో శ్రీమహావిష్ణువు “మహర్షుల శాపానికి తిరుగులేదు. అనుభవించవలసిందే. అయితే మీరు నా భక్తులు, కనుక మీకు వరం ప్రసాదిస్తాను. మీరు నా భక్తులుగా ఏడు జన్మలు కానీ లేదా శత్రువులుగా మూడుజన్మలు గానీ భూలోకంలో జన్మించిన తర్వాత వైకుంఠానికి చేరుకుంటారు” అని వరం ప్రసాదించాడు.

విష్ణుమూర్తి మాటలను విన్న జయ, విజయులు–

“మహానుభావా! మేము మిమ్మల్ని విడిచి ఏడు జన్మలు ఉండలేము. మూడుజన్మలు శత్రువులుగానే జన్మిస్తాము” అని పలికారు.

దీని ప్రకారం జయ, విజయులు మొదటి జన్మలో కృతయుగంలో హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగాను, రెండో జన్మలో త్రేతాయుగంలో రావణ కుంభకర్ణులుగానూ, ఇక మూడవ జన్మలో ద్వాపరయుగంలో శిశుపాల, దంతవక్త్రులు గాను జన్మించారు. వీరందరూ శ్రీహరికి శత్రువులు.

కృతయుగంలో హిరణ్యాక్షుడు ఒకసారి బలగర్వితుడై భూమిని చాపలా చుట్టుకుని తీసుకుపోయి సముద్రంలో దాక్కున్నాడు. దీనితో భూదేవి తీవ్రబాధకు లోనై, తన బాధను విష్ణుమూర్తితో చెప్పుకుంది. భూదేవి మొర ఆలకించిన శ్రీమహావిష్ణువు వరాహరూపాన్ని ధరించి, సముద్రంలోకి వెళ్ళాడు. హిరణ్యాక్షుడు వరాహమూర్తిని ఎదుర్కొన్నాడు. ఇద్దరికీ పెద్ద యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో హిరణ్యాక్షుడు మృతి చెందగా, వరాహమూర్తి సముద్రంలో పడి ఉన్న భూమిని తన బలీయమైన కోరలతోపైకి ఎత్తి యథాస్థలంలో నిలిపాడు. అనంతరం భూదేవి శ్రీవరాహమూర్తిని వివాహం చేసుకున్నట్లు పురాణకథనం.

### తిరుమలలో శ్రీవరాహ స్వామి

ఈ విధంగా అవతరించిన శ్రీవరాహస్వామి **“ఆది వరాహస్వామి”**గా తిరుమల క్షేత్రంలో కొలువుదీరి తొలి పూజలను, నైవేద్యాలను అందుకుంటూ ఉన్నాడు. వరాహస్వామి వారు కొలువుదీరిన ఆలయం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రక్కన ఉన్న పుష్కరిణికి వాయువ్యమూలంలో ఉంది. తూర్పు ముఖంగా ఆలయం ఉన్నా, భక్తులు ఈ ఆలయంలోనికి ఉత్తరాభి ముఖంగా ఉన్న ద్వారం గుండా ప్రవేశిస్తారు. ఆలయం ముఖ మండపం, అర్థమండపం, అంతరాళమండపం, గర్భాలయా

**వరాహజయంతినాడు క్రింద పేర్కొన్న వరాహస్వామి వారి స్తోత్రాన్ని పారాయణం చేయడంవల్ల కూడా విశేషఫలాలు కలుగుతాయి.**

నమస్తే దేవదేవేశ వరాహవదనాఽచ్యుత ।
క్షీరసాగరసంకాశ వజ్రశృంగ మహాభుజ ॥

ఉద్ధృతాస్మి త్వయా దేవ కల్పాదౌ సాగరరాంభసః ।
సహస్రబాహునా విష్ణో ధారయామి జగంత్యహమ్ ॥

అనేకదివ్యాభరణయజ్ఞసూత్రవిరాజిత ।
అరుణారుణాంబరధర దివ్యరత్నవిభూషిత ॥

ఉద్యద్భానుప్రతీకాశపాదపద్మ నమో నమః ।
బాలచంద్రాభదంష్ట్రాగ్ర మహాబలపరాక్రమ ॥

దివ్యచందనలిప్తాంగ తప్తకాంచనకుండల ।
ఇంద్రనీలమణిద్యోతిహేమాంగదవిభూషిత ॥

వజ్రదంష్ట్రాగ్రనిర్భిన్న హిరణ్యాక్షమహాబల ।
పుండరీకాభితామ్రాక్ష సామస్వనమనోహర ॥

శ్రుతిసీమంతభూషాత్మన్ సర్వాత్మన్ చారువిక్రమ ।
చతురాననశంభుభ్యాం వందితాఽఽయతలోచన ॥

సర్వవిద్యామయాకార శబ్దాతీత నమో నమః।
ఆనందవిగ్రహాఽనంత కాలకాల నమో నమః ॥

ఇతి శ్రీస్కందపురాణే వేంకటాచలమాహాత్మ్యే
భూదేవీ కృత శ్రీఆదివరాహ స్తోత్రమ్.

లను కలిగిఉంది. అర్ధమండపం నుంచి అంతరాలయంలోనికి ప్రవేశించే ద్వారానికి ఇరువైపులా ద్వారపాలకులైన జయ విజయులు కొలువుదీరి నిత్యం స్వామివారిని సేవిస్తూ దర్శనమిస్తారు. ప్రధాన గర్భాలయంలో శ్రీఆదివరాహస్వామివారు కొలువుదీరి ఉన్నారు. శంఖు, చక్రములను ఇరుచేతులలో ధరించి ఎడమతొడపై భూదేవి సహితముగా స్వామివారు దివ్యంగా దర్శనమిస్తారు. మూలవిరాట్టుకు ముందువైపున వరాహస్వామి ఉత్సవ పంచలోహవిగ్రహంతో పాటూ శ్రీవేంకటేశ్వరస్వామి పంచలోహవిగ్రహంను సాలగ్రామాలను దర్శించుకోవచ్చు. అంతేకాకుండా మూలవిరాట్టు వద్ద చతురస్రాకారంలో ఉన్న రాగిఫలకయంత్రం ఒకటి దర్శనమిస్తుంది. ఇది శ్రీ వేంకటేశ్వరస్వామివారు తొలిపూజ, తొలినైవేద్యం వరాహస్వామికి చెందునట్లుగా రాసి ఇచ్చిన దానపత్రం అని చెప్తారు.

పూర్వం శ్రీవేంకటేశ్వరస్వామి వారు ఇచ్చిన మాట ప్రకారమే ఈనాటికీ మొదటగా పూజలు, నైవేద్యాలు వరాహస్వామి వారికే నిర్వహించబడుతూ ఉన్నాయి. శ్రీవరాహస్వామి ఆలయంలో మూడుపూటలా పూజలు జరుగుతాయి. ప్రతి శుక్రవారం తెల్లవారుఝామున శ్రీవరాహస్వామివారికి అభిషేకం జరుగుతుంది. ప్రత్యేక ధ్వజస్తంభం లేనందువల్ల ప్రత్యేకంగా ఉత్సవాలు నిర్వహించరు. అయితే శ్రీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా చివరిరోజు శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవేంకటేశ్వరస్వామివారు, చక్రత్తాళ్వారుస్వామి వరాహస్వామివారి ఆలయానికి వేంచేస్తారు. ఆలయ ముఖ మండపంలో వీరికి స్నపనతిరుమంజనం జరుగుతుంది. అనంతరం పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు. ముక్కోటి ఏకాదశి, రథసప్తమి పర్వదినాల్లో కూడా శ్రీచక్రత్తాళ్వారు వరాహస్వామి వారి ఆలయానికి విచ్చేయగా అభిషేకం, చక్రస్నానాలు జరుగుతాయి.

తిరుమల చేరుకున్న భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనంకంటే ముందు శ్రీవరాహస్వామివారిని దర్శించుకోవాలన్నది నియమం.

శ్రీమహావిష్ణువు వరాహఅవతారం ధరించి వరాహమూర్తిగా ఆవిర్భవించిన రోజే- వరాహజయంతి. వరాహజయంతి రోజు శ్రీవరాహస్వామిని శక్తిమేరకు పూజించడం, భూదేవి సమేత వరాహస్వామి వారి స్తోత్రాన్ని పారాయణం చేయడం, వైష్ణవాలయాల్లోకి వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం, విష్ణుసహస్రనామపారాయణ చేయడం వంటి విధులు పాటించడం వల్ల సత్ఫలితాలు కలుగుతాయి.

**వరాహగాయత్రీ మంత్రం**

ఓం ధనుర్ధరాయ విద్మహే
వక్రదంష్ట్రాయ ధీమహి।
తన్నో వరాహ ప్రచోదయాత్॥



# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



**గత సంచిక తరువాయి..**

ఆ ప్రాంతంలోని ప్రజలు సంతోషంతో సుదర్శన రాజు దగ్గరికి వచ్చి-

'చక్రరాజా! పాపుల్ని, చోరుల్ని నిర్మూలనం చేశారు. సాధువులని సంరక్షించారు. మీ వీరవిహారాన్ని పదివేల నాలుకలు కలవాడు కూడా వర్ణించలేడు. అయినా, మాదొక విన్నపం. దయతో శేషాద్రికి పశ్చిమోత్తర దిశలో క్రూరులైన చోరులను కూడా సంహరించండి. అప్పుడే అరణ్యవాసులకు పీడ విరగడవుతుందన్నారు.'

'విమలాత్మ! ఈ భూభాగానికి పాలకుడనేవాడు లేనే లేడు. అందుకే చోరుల విశృంఖలవిహారం. ఆ కారణం చేతనే సాధువులకు అంతులేని కష్టాలు.

మేము బ్రాహ్మణులం. మా పాలిటికి దేవుళ్లు మీరే. సకలపాపాత్ములను సంహరించి మా అందరిని రక్షించగల ఒక సమర్థుడైన పాలకుని నియమించండి' అన్నారు.

వారి ప్రార్థనలు విన్న సుదర్శన మహారాజు ఆ ప్రదేశ పాలకునిగా ఒకరిని ఎంపిక చేసి నియమించి విధులను కూడా చెప్పాడు. ధార్మికదృష్టితో పాలించమని సలహాలిచ్చాడు.

ఆ పై విప్రులతో 'సర్వలోకసంక్షేమం కోరేవారలారా! మీరు యథాప్రకారం యాగాలు కొనసాగించండి. నిర్భయంగా జీవించండి' అనడంతో వారు సుదర్శనుని దీవించారు.

సుదర్శనరాజు చోరులను నిర్మూలించడం కోసం పశ్చిమంవైపు గంధర్వ బలంతో కదిలాడు. యుద్ధభేరీ మోగిస్తూ వనదుర్గాలలో దాగిన చోరులను వధించ సాగాడు. అప్పుడు చోరవీరులు తమ ప్రభువైన వనకర్త దగ్గరికి పరుగిడుతూ వెళ్లారు.

"అధిపా! మనవి. మన ప్రాంతానికి ఎవరో సైన్యంతో వచ్చారు. వారెవరో తెలియదు. అయినా వారు పరాక్రమవంతులుగా కనిపిస్తున్నారు. అంతేకాదు సమర రహస్యాలుబాగా తెలిసినవారుగా ఉన్నారు. ఆ సైన్యం వనదుర్గాలలో దాగిన మన సైన్యాన్ని కకావికలు చేసింది. వారి ధాటికి మనచోరవీరులు నిలువలేకపోయినారు.

రాజా! మీరే ప్రతిక్రియ చేయగల సమర్థులు. మీ తండ్రిగారు శివుని మెప్పించి ఎవరివల్లగాని మరణంలేని వరం పొందినవారు. తన చోరసైన్యంతో కొండ కోనలలో సాధువులను హింసించినవారు. అంతే కాదు, బాటసారులపై తమ పరాక్రమం చూపించి బాటసారుల ధనం అపహరించినవారు. అతని బలం సామాన్యమైనది కాదు. కాలకింకరులలాంటి కిరాతక బలం. మీరు రిపుఘ్నుని లాంటివారు." అని విన్నవించారు. చోరచారుల వల్ల అన్నీ విని- వనకర్త తమ దుర్గంకేసి వస్తున్న సుదర్శనసైన్యాన్ని సమూలంగా నాశనం చేయాలని, సమరానికి అవసరమైన అనేక ఆయుధాలతో వెంటనే కదిలాడు. సుదర్శన రాజు సైన్యాన్ని సర్వనాశం చేయాలని శక్తియుక్తులతో పోరాడినాడు.

అయినా, చక్రరాజభటులు వనకర్త సైన్యాన్ని సునాయాసంగా ఓడించినారు. ఆ సైన్యంలో చాలభాగం నశించింది. సమర భూమిలో రక్తం ఏరులై పారింది. ఈ దృశ్యాన్ని చూచిన వనకర్త తోకతొక్కిన త్రాచులా క్రోధావేశంతో తన సైన్యాధిపతియైన జ్వాలాపాతుని చూచి-

"సైన్యాధ్యక్షా! చూశావా! అసహాయ శూరులైన మన సైన్యాన్ని ఎక్కడినుండో వచ్చినవాడు నాశం చేశాడు. ఇంక వారిని ఉపేక్షించడం ఏ మాత్రమూ సరికాదు. సకలాయుధాలతో నీవు సర్వశక్తులను ఒడ్డి పోరాడి ఎదుటివారి సైన్యాన్ని చీకాకు పరచు. ఇదే నా ఆన" అన్నాడు.

*(ఇంకా ఉంది)*

ఉపనిషద్వాక్యం

# "ధీనామవిత్ర్యవతు"

**'బుద్ధులను రక్షించుదేవి (మనలను) రక్షించుగాక!' (ఋగ్వేదం)**

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

సరస్వతీ సూక్తంలోని మంత్రమిది.

వాక్–బుద్ధి–జ్ఞానాలకు అధిష్ఠాత్రి అయిన శక్తి సరస్వతీ దేవి. ఈ తల్లి వలననే బుద్ధిశక్తులు పనిచేస్తాయి. ప్రేరణ, ఆలోచన, స్ఫురణ, నిర్ణయం... ఇవన్నీ బుద్ధిపనులు. వీటి వలననే జీవితగమనం నిర్దేశింపబడుతుంది. అందుకే బుద్ధి తిన్నగా ఉంటే అన్నీ తిన్నగా ఉంటాయంటారు.

**ధారణ, ప్రతిభ, మేధ, ప్రజ్ఞ, స్మృతి, కల్పన, విద్య....** మొదలైన బౌద్ధికశక్తుల విశిష్టత మనకు తెలిసినదే.

ఈ బుద్ధిని రక్షించే ఈశ్వరచైతన్యాన్ని మనం సరస్వతీ దేవిగా ఆరాధిస్తున్నాం. విద్యల తల్లి కృప సర్వజీవులకు అవసరం. బుద్ధులను పాలించే ఆ తల్లినే **'ధియో యో నః ప్రచోదయాత్'** అని వేదమాతగా అంజలించి, **'బుద్ధి యో నః ప్రచోదయాత్'** అని ప్రస్తుతించారు ఋషులు.

మంచి ఆలోచన, విషయాన్ని చక్కగా అవగాహన చేసుకోగలగడం, సత్కర్మలకు తగిన ప్రేరణ, సంకల్పం, ఆచరణ కనువైన విజ్ఞానం ఇవన్నీ బుద్ధికి ఉండవలసిన సులక్షణాలు. వీటిని కలిగించేది భారతీదేవి అనుగ్రహమే!

ఈ జగదంబిక కృపవల్లనే మహర్షులు, వ్యాస వాల్మీకి కాళిదాసాదులు, త్యాగరాజాది వాగ్గేయకారులు వారు తరించి, మనలను తరింపజేశారు.

విశ్వమంతా శబ్దబ్రహ్మగా వ్యాపించిన ఈ జగదంబిక అన్నప్రదాయినిగా, అన్నశక్తిసంభరితురాలుగా వేదసూక్తాలలో సాక్షాత్కరిస్తోంది.

**'వాజినీవతీ'**– అని వేదం సరస్వతిని నుతించింది.

'అన్నములు కల తల్లి' – **'వాజేభిః'** – ఆ అన్నములతో (ఐశ్వర్యములతో) మనలను రక్షించాలని కీర్తిస్తూ... ఐశ్వర్యార్థనకు, వినియోగానికి కావలసిన జ్ఞానం బుద్ధ్యాధారం కనుక ఆ బుద్ధిని జగదంబ రక్షించాలని వేదం సంభావించింది.

శబ్దబ్రహ్మస్వరూపిణి అయిన ఈ తల్లికృప లేకుంటే జగతి స్తబ్ధమై, జడీభూతమై ఉంటుంది.

విశ్వరచన చేసే విశ్వేశ్వరుని విజ్ఞానమంతా ఒక రూపుకడితే ఆమెయే **'సరస్వతి'**.

ప్రకాశమయమైన జ్ఞానాకృతి కనుక **'భారతి'**. అక్షర రూపిణిగా స్వరస్వరూపిణిగా ఆరాధింపబడే నాదమయి ఈ తల్లి. ప్రసరించే, ప్రవహించే లక్షణం గలది కనుక 'సరస్వతి'. చైతన్యలక్షణమే ప్రసరణ. ఇదే చైతన్యలహరి.

వేదవిజ్ఞానం ప్రకారం ఒకే పరాశక్తి (జగదంబిక) తన పలుశక్తులను ప్రకటించేటప్పుడు పలువిధాల ఆకృతులను ధరించింది. సరస్వతిగా, లక్ష్మిగా, దుర్గగా, అన్నపూర్ణగా, శాకాంబరిగా ఈ చైతన్యరూపిణిని ఋషులు ప్రస్తుతించారు. మనలోని ప్రాణశక్తియే సరస్వతి అని శ్రుతివాక్యం.

**'ప్రాణశక్తిః సరస్వతీ'.** మనలోని అంతఃస్రవంతిగా ఉన్న చైతన్యమే ఈ తల్లి స్వరూపం.

సరస్వతీ ఆరాధనకు ప్రాధాన్యమిచ్చిన దేశం మనది.

భారతి– భారత– భారతీయత.... ఇవన్నీ జ్ఞాన ప్రాముఖ్యాన్ని చెప్పే శబ్దాలు. శారదాదేవికృప వలన ఆసురీ శక్తుల బుద్ధులు స్తంభించబడి, లోకక్షేమాన్ని ఆశించే ధార్మికుల బుద్ధులు వికసించి, లోకహితాలోచనలు ప్రేరేపింపబడాలని ఆ జగదంబ అనుగ్రహించు గాక!

## 2024, అక్టోబరు నెల ఉత్సవాలు, పర్వదినాలు

- **02** మహాత్మాగాంధిజయంతి, మహాలయఅమావాస్య
- **04-12** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవం
- **04-12** తిరుచానూరు, శ్రీపద్మావతిఅమ్మవారి నవరాత్రిఉత్సవం
- **08** తిరుమల శ్రీవారి గరుడసేవ
- **09** సరస్వతిపూజ
- **11** దుర్గాష్టమి
- **12** విజయదశమి
- **31** నరకచతుర్దశి, దీపావళిపండుగ, ధనలక్ష్మిపూజ.



# బలరామ వైభవం

- డా|| వేదార్థం మధుసూదన శర్మ, 9063887585

**సెప్టెంబర్ 5న బలరామజయంతి సందర్భంగా...**

**బలరాముడు- రోహిణీ, వసుదేవుల** కుమారుడు. **శ్రీకృష్ణుడికి** సోదరుడు. ఇతడిని ముక్కోటి దేవతల్లో ఒకరిగా గుర్తిస్తారు. ఇతనికి **హలధరుడు, హలాయుధుడు, బలదేవుడు, బలభద్రుడు** మరియు **సంకర్షణుడు** అనే పేర్లు కూడా ఉన్నాయి. 'హలం' అంటే నాగలి. నాగలిని ధరిస్తాడు కాబట్టి **హలధరుడు** అని పేరు. అవసరమైనప్పుడు హలాన్ని ఆయుధంగా వినియోగిస్తాడు కాబట్టి **హలాయుధుడు** అయ్యాడు. బలవంతులందరిలో గొప్పవాడు కాబట్టి **బలదేవుడు** కూడా అయ్యాడు. **రామ** శబ్దానికి **సుందరం** అని అర్థం కూడా ఉంది, కాబట్టి అతడు **బలరాముడు** అని పిలువబడ్డాడు. శత్రువులను సంహరించువాడు ఆయన కాబట్టి **సంకర్షణుడు** అయ్యాడు.

శ్రీమహావిష్ణువు ధర్మసంరక్షణకోసం ఎత్తిన **దశావతారాలలో ఎనిమిదవ అవతారం బలరామ అవతారం**. భాగవత పురాణంలో, అలాగే మహాభారతంలో **శ్రీకృష్ణునికి** ఎంత ప్రాధాన్యత ఉందో, **బలరాముడికి** కూడా అంతే ప్రాధాన్యత ఉంది. వీరిద్దరిది విడదీయరాని అనుబంధం. **"అమ్మా! తమ్ముడు మన్ను తినేనే"** అంటూ పలికిన పలుకులు బలరాముడివి.

## బలరాముని జన్మ విశేషాలు

పూర్వం దేవతలను బాధిస్తున్న కంసుణ్ణి వధించాలని, అతని బాధ నుండి తమను కాపాడమని దేవతలు విష్ణుమూర్తిని ప్రార్థించారు. అప్పుడు తాను బలరామకృష్ణులుగా జన్మించి, ఆ కార్యం చేపడుతానని విష్ణుమూర్తి వారికి మాట ఇస్తాడు. చెప్పినట్లుగానే దేవకీగర్భంలోకి ప్రవేశిస్తాడు. అయితే ఆ శిశువుల జన్మవల్ల తన ప్రాణాలకు ముప్పు వస్తుందని తెలుసుకున్న కంసుడు, దేవకీగర్భంలో ఉన్న ఆరుగురు కుమారులను చంపేస్తాడు. అయితే ఈ విషయాన్ని పసిగట్టిన శ్రీమహావిష్ణువు దేవకీగర్భాన పెరుగుతున్న శిశువులను, వారు పుట్టబోయే లోపుగా, గర్భమార్పిడి ద్వారా, దేవకీగర్భంనుండి గోకులంలో ఉన్న రోహిణిగర్భంలోకి మారుస్తాడు. అలా రోహిణి గర్భాన జన్మించిన ఏడవ సంతానం 'బలరాముడు' అని పిలవబడ్డాడు.

బలరాముడిది శేష నాగ అవతారం. ఈ భూమండలం అంతా ఆదిశేషునిపైనే ఆధారపడి ఉన్నదని అందరూ భావిస్తారు. అందుకే ఆదిశేషుడు సమస్త విశ్వాన్ని సమతుల్యంగా ఉంచి, కాపాడుతాడని అందరూ విశ్వసిస్తారు. విష్ణుమూర్తి కూడా ఈ ఆదిశేషుణ్ణి పాన్పుగా చేసుకొని శయనిస్తాడు. ఈ ఆదిశేషుడు రామావతారంలో లక్ష్మణుడిగా, కృష్ణావతారంలో బలరాముడిగా జన్మించాడని పురాణాలు పేర్కొన్నాయి.

బలరాముడు ప్రకృతి ప్రేమికుడు. పరమానంద స్వరూపుడు. ఇతడు గొప్ప యుద్ధవీరుడు. గదావిద్యలో ఆరితేరినవాడు. ఇతన్ని గురువుగా భావించి భీముడు, దుర్యోధనుడు మొదలైనవారు ఆ విద్యను అభ్యసించారు. ఇతనికి ప్రకృతికి అవినాభావ సంబంధం ఉంది. ఇతని అడుగడుగులో ప్రకృతి ఛాయలు కనిపిస్తాయి. ఇతడు ప్రకృతిలా ప్రశాంతంగా ఉంటాడు. ఒక్కోసారి వైపరీత్యాన్ని సృష్టిస్తాడు. అంతలోనే ఆప్యాయతతో అక్కున చేర్చుకుంటాడు. ఇతనికి ఇవ్వడమే గాని ఆశించడం తెలియదు. అతడు ఎంత దయామయుడో, అంత కోపం కలవాడు. దీనికి ఉదాహరణ ఈ సంఘటన- అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ చిన్ననాటి నుండి ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన సుభద్రను వివాహం ఆడడం కోసం, యతివేషములో బలరాముడి దగ్గరకు వెళ్ళాడు. ఆ సందర్భంలో శ్రీకృష్ణుడు అర్జునునికి సహకరించాడు. కానీ ఒక్కసారిగా అర్జునుడు సుభద్రను అపహరించడం బలరాముడికి నచ్చలేదు. తీవ్రంగా

కోపగించుకున్నాడు. ఆ తర్వాత శ్రీకృష్ణుడు అతన్ని శాంతపరుస్తాడు. మరొక సందర్భంలో తనకు కోపం వచ్చి యమునానది దిశనే మార్చేస్తాడు. ఇంకో సందర్భంలో హస్తినాపురాన్ని తన హలాయుధంతో యమునానదిలో కలుపుటకు ఉద్యుక్తుడు అవుతాడు.

సాందీపుడు అనే గురువు దగ్గర బలరామకృష్ణులు విద్యాభ్యాసం చేశారు. ఆయన ఎప్పుడూ నీలిరంగు వస్త్రాలనే ధరించేవాడు. ఆయన రథంపై జెండా తాటిచెట్టు గుర్తు కల్గి ఉంటుంది.



ఒకసారి నారద-కణ్వ-విశ్వామిత్ర మహర్షులు కలిసి ద్వారకా నగరానికి వెళ్లారు. అప్పుడు వారిని హేళన చేయడానికి కొందరు ఆతతాయిలు ఒక మగవాడికి చీరను కట్టి, అతనికి గర్భం ఉన్నట్లుగా, పెద్ద కడుపును ఏర్పాటు చేస్తారు. ఆ మహర్షులకు అతన్ని చూపిస్తూ, ఈమెకు పుట్టేది ఏ శిశువు చెప్పండి అని అడుగుతారు. విషయాన్ని అర్థం చేసుకున్న మహర్షులు ముగ్గురు, తమను అవమానిస్తున్నారని గ్రహించి, కోపముతో త్వరలో ఒక రోకలి జన్మించి యాదవవంశాన్ని నాశనం చేస్తుందని శపిస్తారు. ఆ శాపం తర్వాత మహాభారతయుద్ధం జరగడం, ఆ యుద్ధ సమయంలో తీర్థయాత్రలకు వెళ్లిన బలరాముడు కౌరవులు, పాండవులు ఇద్దరూ తనకు కావలసినవారే అని, తాను ఏ పక్షానికి సహాయం చేయకుండా తటస్థంగా ఉన్నాడు. ఆ తర్వాత కొంతకాలానికి మహర్షుల శాపం వలన, యాదవులలోనే ఒకరిని మరొకరు చంపుకోవడం జరుగుతుంది. ఆ విధంగా యాదవవంశము నాశనం అయిపోతుంది. ఇదంతా చూసిన బలరాముడు, వైరాగ్యముతో ఒక అరణ్యానికి వెళ్లి, ఒక చెట్టు కింద కూర్చుని ధ్యానంలోకి వెళ్ళిపోతాడు. అలా ఆయన ధ్యానములో ఉండగానే, అతని నోటి నుంచి ఒక తెల్లనిసర్పం బయటకు వచ్చి, పడమటి సముద్రంలోకి కలిసిపోతుంది. ఆ విశేషమే బలరాముడు ఆదిశేషుని అంశ అని చెప్పుటకు నిదర్శనం. ఆ తర్వాత అతని శరీరంనుండి ఆత్మవేరు అయిపోయి, అతడు నిర్యాణం పొందుతాడు.

సోదరుడు శ్రీకృష్ణునితో బలరాముడు వెన్నంటే ఉండి, అనేకమంది రాక్షసులను సంహరించడంలో సహాయం చేశాడు. ద్రౌపది వివాహ సమయంలో, ధర్మరాజు ఇంద్రప్రస్థ రాజధాని ప్రవేశ సమయంలో కూడ శ్రీకృష్ణుడికి బలరాముడు తోడుగా ఉన్నాడు.

## బలరామజయంతి

భగవంతుణ్ణి ప్రార్థించడానికి చాలామార్గాలు ఉన్నాయి. మనము రోజూ అతన్ని ప్రార్థించుటకు వీలుకాకపోతే, కనీసం వారి జయంతిరోజు కానీ, వివిధ పర్వదినాల వంటి సందర్భాలలో ప్రత్యేకమైన పూజలు చేయడం మంచిది. **'బలరామజయంతి'** బలరాముని పుట్టిన రోజు. ఇది ఆదిశేషుడి పట్ల కృతజ్ఞతలు తెలిపే రోజు. అదే సమయంలో ఈ పండుగను ప్రకృతితో సన్నిహితంగా జరుపుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే భగవంతుడైన బలరాముడు ప్రకృతిని ఆరాధించేవాడు. బలరామ జయంతి వర్షాకాలంలో వస్తుంది. రైతులు పొలాన్ని దున్నడానికి నాగలిని ఉపయోగిస్తారు. నాగలిపై ఆధారపడిన రైతులు ఈ పర్వదినం రోజున నాగలిని, వ్యవసాయభూమిని పూజించాలి. తమ పంటలను కాపాడమని, మంచిపంటలను పండించమని బలరాముణ్ణి ప్రార్థించాలి. వ్యవసాయ పొలం లేనివారైతే ఇంట్లో ఒక మొక్కను నాటి, దానిని పూజించడం ద్వారా వారిని ప్రసన్నం చేసుకోవచ్చు. వేపమొక్క గాని, లేదా ఏదైనా పండ్ల మొక్కలను గాని నాటి, వాటిలో దేనినైనా బలరాముడికి సమర్పించడం ద్వారా ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చు.

ఈ పర్వదినం రోజున తెల్లవారుజామునే నిద్రలేచి, బ్రాహ్మీముహూర్తంలో బలరాముణ్ణి పూజించాలి. పంచామృతాలతో శ్రీకృష్ణుడు, బలరాముల విగ్రహాలను అభిషేకించి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించాలి. వీలైన తీపి పదార్థాలతో నైవేద్యాన్ని సమర్పించాలి. ఆ తర్వాత దాన్ని ప్రసాదంగా స్వీకరించాలి. అందరికీ పంచాలి. ఈ సందర్భంగా ఒక పేద రైతుకు నాగలిని దానం చేస్తే మంచిది. *"ఓం హలధరాయ సంకర్షణాయ నమః"* అనే మంత్రాన్ని 108సార్లు పఠించి, బలరాముడిని ప్రార్థిస్తే, అతని అనుగ్రహానికి పాత్రులుకావచ్చు.

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:

కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

అని వైఖానసశాస్త్రమున ఆనందసంహితయందు ఈ ప్రమాణమును సంగ్రహించినవారు సంహితాంతర వచనములను కొని యొనర్చిన వ్యాఖ్యానమునందు-

పంచాయుధానాం భక్తానాం సేనానీ శేషయోరపి
వైనతేయస్య సేనేశ భక్తానాం చ పృథక్పృథక్,
చండాదీనాం చ భక్తానాం కుముదాదిగణస్య చ
సర్వేషాం భక్తితః కుర్యాత్ హోమాంకురవివర్జితమ్.
అర్చనం విష్ణుభక్తానాం హరిపాదార్పితైస్సుమైః
తులసీదళసమ్మిశ్రైః సుగంధై స్సుమనోహరైః,
తత్తన్మూర్తిపరైర్మంత్రై ర్విష్ణుభక్తవిశేషణైః
తద్విష్ణోరితి మంత్రేణ సంయుతై రంతతశ్శుభైః
త్రిసంధ్యం భగవద్భుక్త ద్వాదశాన్నం నివేదయేత్
ఏతన్ముఖేన భగవాన్ ప్రీతో భూత్వా జనార్దనః
దదాతి సకలా న్భోగాన్ భక్తానాం భక్తవత్సలః.

(హరిభక్తిగల పంచాయుధములకును, అనంత, గరుడ, విష్వక్సేనులకును, సేనాధిపతి భక్తులకును, చండాదిభక్తులకును, కుముదాదిగణమునకును-వేర్వేరుగ అందరికిని హోమము, అంకురార్పణము లేకుండ, తులసీదళములతో చేరినవియు, సువాసనగలవియు, మనోహరములును శ్రీహరి పాదములం దర్పింపబడినవియు అగు కుసుమములతోడను, ఆయా మూర్తి విషయములగు విష్ణుభక్త విశేషణములతోడను, చివరి 'తద్విష్ణోః' అనెడి మంత్రముతో కూడినవియు మంగళకరములు నగు మంత్రములతోడను, భక్తియుక్తముగా అర్చన చేయవలెను. ముప్పొటలందును భగవన్నివేదితములైన పన్నెండు విధము లైన అన్నములను నివేదన చేయవలెను ఇట్లు చేయుటవలన భక్తవత్సలుడైన జనార్దనుడు సంప్రీతుడై భక్తులకు సకలభోగము లను ఒనగూర్చును)

అని విస్తారముగా జెప్పిన యర్థక్రమముగా భక్తాగ్రేసరు లగు అనంత-గరుడ-విష్వక్సేన-సుదర్శనాదులను యాగశాల యందు విజయము చేయించి, తీర్థము ప్రసాదించునట్లుగా కట్టడిచేసియుండుటచేత ప్రపన్నజనులకు ఆ యా కాలము లందు తీర్థస్నాన మపరిహార్యమై స్నానము చేయవలసినదిగా ఏర్పడినదని పెద్దలు సెలవిచ్చుచున్నారు.

భగవద్రామానుజుల దివ్యసంకల్పముచేత గోవిందరాజ స్వామి తిరుమల యడివారమునందు ప్రతిష్ఠితులైన తరువాత 'తిరువేంకటనాడు'కు ప్రభువైన కట్టియం యాదవరాజు భగవద్రా మానుజుల శ్రీపాదముల నాశ్రయించి, గోవిందరాజస్వామి కైంకర్యమును శ్రీరామానుజాచార్యుల ఆజ్ఞమేరకు నెరవేర్చుచూ, సకలోత్సవములను కొండాడుటకును, సకలభోగోపేతమైన అతి మనోహరమైన ఒక శ్రీమహామణిమండపమును నిర్మింపజేసి, దాని సమీపమున శ్రీనమ్మాళ్వారులకు గర్భాలయము కట్టించి, అధ్యయనోత్సవముకొరకై నమ్మాళ్వారుల ఉత్సవ విగ్రహము మాత్రము విజయము చేయించి మహాప్రతిష్ఠ చేయించెను.

*(ఇంకా ఉంది)*

# సందేహాలు సమాధానాలు

-డా॥ రేవూరు అనంతపద్మనాభరావు, 98665 86805

**ప్ర)రామాయణంలో వాలి యుద్ధం చేసేటప్పుడు, ఎదుటివాని బలంలో సగం బలం వాలికి వస్తుందంటారు? వివరించండి?**

**- జె.శివబాపిశెట్టి, కైకలూరు.**

**జ)** రామాయణంలో కిష్కింధాకాండలో ప్రధానపాత్రలు వాలిసుగ్రీవులు, హనుమ. వాలి దేవేంద్రుని అంశతో జన్మించాడు. సుగ్రీవుడు సూర్యుని అంశతో జన్మించాడు. దేవేంద్రుడు వాలికి ఒక బంగారుహారం బహూకరించాడు. ఆ మాలను ప్రసాదిస్తూ ఇంద్రుడిలా అనుగ్రహించాడు "ఓ వాలీ! ఈ మాలను ధరిస్తే, నిన్ను ఎదరించి, నీతో యుద్ధం చేయడానికి వచ్చిన వీరుడు ఎంతటివాడైనా వాని బలమంతా నీకు చేరుతుంది." ఈ విధమైన వరబల సంపన్నుడు వాలి.

**ప్ర) 'రామబాణం' కంటే 'రామనామం' గొప్పదంటారు. ఎందువల్ల?**

**- వేలూరి రామ్మోహన్, నూజివీడు.**

**జ)** 'రామబాణం' తీవ్రత రామాయణంలో అనేకమార్లు కనిపిస్తుంది. రాముడు తొలిసారిగా బాణప్రయోగం చేసింది విశ్వామిత్రుని ఆజ్ఞతో-తాటకమీద. అది మొదలు సుబాహువధ, వాలివధక్రమంగా జరిగాయి. రామరావణయుద్ధంలో కుంభకర్ణాదుల వధ సరేసరి. 'రామనామం' అత్యంత పవిత్రం. హనుమదాదులు రామనామ నిరంతర జపతత్పరులు. దుష్టసంహారానికి రామబాణంశ్రేష్ఠం. భక్తజనపోషణకు, ముక్తిమార్గానికీ రామనామం ప్రశస్తం. రామనామస్మరణతో వాల్మీకి ఒక మహర్షియై శ్రీమద్రామాయణరచనతో 'ఆదికవి'గా ప్రశస్తికెక్కాడు. రామనామ స్మరణతో హనుమ సముద్రలంఘనము, సీతాన్వేషణము చేశాడు. భక్తరామదాసు, త్యాగయ్య- ఇలా ఎందరో రామనామ స్మరణతో జీవన్ముక్తులైన విషయం ప్రఖ్యాతం.

**ప్ర) శ్రీకాళహస్తీశ్వరుని దర్శించినంత మాత్రము చేత 'ముక్తి' కలుగుతుందంటారు. నిజమేనా?**

**- ఎం.వెంకటేశ్వరరావు, పామర్రు.**

**జ)** 'పంచభూత'స్థలాలలో శ్రీకాళహస్తీశ్వరాలయం ఒకటి. ఇక్కడ వాయులింగం మోక్షప్రదం. కైలాసంగాను, దక్షిణకాశీగాను ప్రసిద్ధం. 'గ్రహణ' సమయాలలో అన్ని దేవాలయాలు మూసివేస్తారు గాని, శ్రీకాళహస్తిలో మూయరు. ఇక్కడ రాహు-కేతు పూజ ప్రత్యేకం. భక్తకన్నప్ప ముక్తిని పొందిన ప్రదేశమిది. శైవగ్రంథాలలో ఈ ఆలయప్రశస్తి వర్ణింపబడింది. శ్రీ(సాలెపురుగు), కాళ(సర్పము), హస్తి(ఏనుగు) శివుని అనుగ్రహంచే ముక్తి పొందిన ప్రదేశమిది. అందువల్ల భక్తితో స్వామిని ఆరాధిస్తే ముక్తిమార్గం లభిస్తుంది.

**ప్ర)'కష్టసుఖాలు-లాభనష్టాలు' జీవితంలో శాశ్వతం కాదంటారు పెద్దలు. ఎందువలన?-ఎం.రామమూర్తి, భీమవరం.**

**జ)** మానవజీవితం కష్టసుఖాలమయం. ద్వంద్వాతీతంగా ప్రవర్తించే శక్తి సాధకులకే సాధ్యం. అందుకే 'కష్టసుఖాలు కావడికుండలు' అన్నారు పెద్దలు. కావడికుండలు సమానంగా ఉంటేనే జీవనగమనం సాఫీగా సాగుతుంది. దేవతలకు కూడా కష్టసుఖాలు సామాన్యం. కాలచక్రంలో కష్టసుఖాలు-క్రింద, మీద కావడం సహజం. ఇక లాభనష్టాలు దైనందిన జీవితంలో కేవలం వ్యాపారంలోనేగాక మానవప్రవర్తనలోనూ సర్వసాధారణం. జీవితమే శాశ్వతం కాదు. ఇక మిగతావాటి విషయంలో ఆ ప్రస్తావన రాదు. రాకూడదు.

**ప్ర) 'ఓం'కారము నిత్యమూ సాధన చేస్తే ఆరోగ్యం బాగుంటుందంటారు. నిజమేనా? -శకుంతల, కొవ్వూరు.**

**జ)** 'ఓం'కారమే భగవంతుని చిరునామా అన్నారు మహర్షులు. 'ఓం'కారం జపించడం ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందుతారు. వాస్తవికత అయిన బ్రహ్మాన్ని సూచించే ఆదిమ ధ్వని 'ఓం'కారం. బ్రహ్మాన్ని పొందేందుకు ప్రత్యక్షమార్గం. ధర్మశాస్త్రాలననుసరించి ఓంకార నాదానుసంధానం ద్వారా మానసిక ప్రశాంతత సిద్ధిస్తుంది. రూపరహిత పరబ్రహ్మమే 'ఓం'కారం. దాని సాధనద్వారా మానసిక, శారీరక ఆరోగ్యాలు తప్పక సిద్ధిస్తాయి.

**ప్ర) ఏ మంత్రమైనా 108 సార్లు తప్పకుండా పఠించాలా? లేదా 21 సార్లు చదివితే చాలా?**

**-కే.రమేశ్, రాజమండ్రి.**

**జ)** 108 సంఖ్య కలిపితే '9' వస్తుంది. సంఖ్యాశాస్త్రంలో '9'కి ప్రాధాన్యం ఉంది. నవగ్రహాలు మానవశరీరంపై ప్రభావం చూపుతాయి. అష్టోత్తరశతనామాలలో మన ఇష్టదైవాన్ని పూజిస్తాము. వాటి పఠనం ఆరోగ్యప్రదాయకం.

**21సంఖ్యకు ప్రాదాన్యం:** ఐదు క్రియల అవయవాలు, ఐదుగ్రహణ అవయవాలు, ఐదు ముఖ్యమైన గాలులు, ఐదుకోశాలు- మొత్తం 20. ఇరవై ఒకటవది 'ఓం'కారం. 'ఓం'కారం పఠనంవల్ల ఆరోగ్యం కుదుటపడుతుంది. సానుకూలదృక్పథం (పాజిటివ్ ఇంపాక్ట్) ఏర్పడి మనస్సు- శరీరం సమతుల్యతతో ఉంటాయి. తద్వారా ఆరోగ్యం మెరుగవుతుంది. ఎన్ని సార్లు పఠించామనే దానిపై ధ్యాసవదలి భక్తిశ్రద్ధలపై దృష్టి పెట్టాలి.

సెప్టెంబరు 15న వామన జయంతి సందర్భంగా...

# వామన వైభవం

- శ్రీమతి కె. విజయలక్ష్మి, 7013185538

భాద్రపదమాసంలో శుక్లపక్షద్వాదశి జయంతి **"వామన జయంతి"**. దానికే **'వామనద్వాదశి'** అని పేరు. అంటే శ్రీమన్నారాయణుడు వామనావతారాన్ని ధరించిన పవిత్రమైన రోజు. దశావతారాల్లో వామనావతారం ఐదవది.

వామనావతారం వెనుక ఆసక్తికరమైన గాథ ఉంది. ప్రహ్లాదుడి మనుమడు- 'బలిచక్రవర్తి'. దానధర్మాలు చేయడంలో తనకు తానే సాటి అని అనిపించుకున్నా... తరతరాలుగా వస్తూ ఉన్న రాక్షసలక్షణం బలిచక్రవర్తిలో కూడా చేరింది. రాక్షసత్వం విజృంభించడంతో బలిచక్రవర్తి ముల్లోకాలపైన దండయాత్ర చేసి వాటిని స్వాధీనం చేసుకున్నాడు. అంతటితో ఆగక స్వర్గలోకంపై దాడిచేసి ఇంద్రుణ్ణి తరిమివేసి దానిని ఆక్రమించుకున్నాడు. దీనితో దేవతలందరూ శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. బలిచక్రవర్తి నుంచి తమను రక్షించమని వేడుకున్నారు. శ్రీమన్నారాయణుడు అందుకు అంగీకరించాడు.

తర్వాత శ్రీమహావిష్ణువు అదితి, కశ్యపమహర్షి దంపతులకు కుమారుడుగా, 'వామనుడు'గా జన్మించాడు. మిక్కిలి పొట్టివాడు అయిన వామనుడు ఉపనయనానంతరం భిక్షాటనకు బయలుదేరి బలిచక్రవర్తి వద్దకు చేరాడు. వామనుడిని చూసిన బలిచక్రవర్తి- "బాలకా! భిక్షాటనకు వచ్చిన నీవు ఏం కావాలో కోరుకో... నీకు కావలసింది ఇస్తాను" అన్నాడు. అందుకు- "నేను నర్మదానదీ తీరంలో యజ్ఞం చేసేందుకు నిర్ణయించుకున్నాను. అందుకు నాకు మూడుఅడుగుల స్థలం అవసరం. కనుక మూడుఅడుగుల స్థలాన్ని నాకు దానం చేయండి" అని అడిగాడు వామనుడు.

బలిచక్రవర్తి అందుకు సిద్ధపడ్డాడు. అయితే, అదే సమయంలో రాక్షసగురువైన శుక్రాచార్యులు అక్కడికి చేరుకుని... శ్రీమన్నారాయణుడే వామనరూపంలో ఉన్నాడని గ్రహించి... అదే విషయాన్ని బలికి వివరించి... స్థలం దానం ఇవ్వడం ప్రమాదమని హెచ్చరించాడు.



కానీ, ఆడినమాట తప్పనని బలిచక్రవర్తి వామనుడికి దానం ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. దానాన్ని స్వీకరించేందుకు వామనుడు దోసిలిని పట్టాడు. దానమిచ్చేందుకు వామనుడు దోసిలి లోకి నీరు పోసేందుకు బలిచక్రవర్తి పాత్రను చేతిలోనికి తీసుకున్నాడు. ఎలాగైనా దానాన్ని అడ్డుకుని బలిచక్రవర్తిని కాపాడాలనుకున్న శుక్రాచార్యుడు కీటకముగా మారి నీటిధార వచ్చే రంధ్రానికి అడ్డుపడ్డాడు. దీనిని గమనించిన వామనుడు దర్భపుల్లతీసుకుని రంధ్రంలో పొడిచాడు. ఫలితంగా శుక్రాచార్యుడి కన్ను ఒకటి గుడ్డిగా మారింది.

బలిచక్రవర్తి దానం చేస్తూ ఉండగా... వామనుడు విశ్వరూపాన్ని ధరించి ఒక పాదంతో భూమిని, మరొక పాదంతో ఆకాశాన్ని ఆక్రమించి మూడో అడుగుకు స్థలం చూపించమని అడిగాడు. మాటతప్పని బలిచక్రవర్తి మూడో అడుగుకోసం తన తలను చూపించాడు. వామనుడు బలిచక్రవర్తి శిరస్సుపై పాదం పెట్టి అతనిని పాతాళానికి తొక్కివేశాడు. ఈ విధంగా దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం వామనావతారం ధరించిన శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తిని అంతమొందించి దేవతలతోపాటూ సకలలోకవాసులనూ రక్షించాడు.

## వామన జయంతి ఆచరణ

వామనజయంతినాడు తెల్లవారుఝామునే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని, తలస్నానంచేసి వామనరూపంలోని శ్రీమహావిష్ణువును పూజించేందుకు సంకల్పించినట్లు, శ్రీమహావిష్ణువుకు నమస్కరించాలి. పూజామందిరంలో శిఖ, సూత్రం, యజ్ఞోపవీతం కమండలాలను ధరించి ఉన్న చిత్రపటం ఏర్పాటు చేసుకోవాలి. ఇవేవి దొరక్కపోతే పసుపు, గోధుమపిండిలతో విగ్రహాన్ని తయారు చేసుకోవడం కూడా చేయవచ్చు. ఈ విధంగా ఏర్పాటు చేసుకుని, ముందుగా వినాయకుణ్ణి పూజించి వామనుణ్ణి షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించి, శక్తిమేరకు నైవేద్యం సమర్పించాలి.

తర్వాత -

"దేవేశ్వరాయ దేవాయ దేవ సంభూత కారణే।
ప్రభవే సర్వదేవానాం వామనాయ నమో నమః॥"

-అనే శ్లోకాన్ని పఠించి నమస్కరించాలి.

అనంతరం -

"నమస్తే పద్మనాభాయ నమస్తే జలశాయినే
తుభ్యమర్ఘ్యం ప్రయచ్ఛామి బాల వామన రూపిణే।
నమశ్శార్ఙ్గ ధనుర్బాణపాణయే వామనాయ చ
యజ్ఞభుక్ ఫలదాత్రే చ వామనాయ నమో నమః॥"

-అనే శ్లోకాన్ని పఠించి అర్ఘ్యం ఇవ్వాలి.

ఈ విధంగా పూజ ముగించిన అనంతరం బ్రాహ్మణుడికి దక్షిణ తాంబూలాలతోపాటూ పెరుగును దానం ఇవ్వాలి.

ఇలా వామనజయంతిని జరుపుకొనడం వల్ల సకల భయాలు, బ్రహ్మహత్యాది దోషాలు నశించి పుణ్యఫలాలు లభిస్తాయి.

ఓం తత్సత్।

సెప్టెంబరు 8న
ఋషిపంచమి సందర్భంగా...



# మహర్షులకు నమస్సుమాలు

- శ్రీమతి మేడేపల్లి అన్నపూర్ణ, 99483 45013

తపస్వి, తపోధనుడు, యతి, సాధువు, ముని... ఇవన్నీ ఋషికి పర్యాయాలు. అన్నీ తెలిసి ఉండటం, స్థిరచిత్తంతో వ్యవహరించడం విశేష, విలక్షణ అంశాలు. ప్రత్యేకించి 'సత్య వాక్కు'. అదే ఆచరణ కలిగి ఉండటమన్నవి అంతర్లీన అర్థతాత్పర్యాలు. సంయమనం, పరిపూర్ణ భక్తితత్త్వమున్న వారే ఋషి వర్యులుగా పరిగణింపబడి, అగ్రగణ్యతలందుకున్నారు. 'పంచమి' అనేది ప్రధానంగా తిథి సంబంధితం. పక్షం రోజుల్లో ఐదోది. నాగ, మాఘశుద్ధ (వసంత), లక్ష్మి, వివాహ పంచమి గురించి తెలిసిన మనం అన్నింటికంటే ప్రథమంగా 'ఋషిపంచమి' గురించే మరింత తెలుసుకోవాల్సి ఉంటుంది. పంచమి అంటేనే అత్యంత పవిత్రతకు ప్రతీక. పర్వదినోత్సవానికి పతాక, సకల శుభకార్యాలకీ అనువు. వినాయకచవితి మరురోజునే అరుదెంచే ఈ పంచమినాడు *'కశ్యపోఽత్రి భరద్వాజః విశ్వామిత్రోఽథ గౌతమః। వశిష్ఠో జమదగ్నిశ్చ సప్తైతే ఋషయః స్మృతాః'* అని మనసారా తలచుకుని నమస్సులర్పిస్తాం మనమంతా!

సప్తర్షుల సమగ్ర అక్షరదర్శనం శతపథ బ్రాహ్మణం, బృహదారణ్యక ఉపనిషత్తులో ఉంది. వారందరూ సంప్రదాయ సంస్కృతులకు సదా సర్వదా పరిరక్షకులు. గగన కాంతిమూర్తులూ, జ్యోతిస్వరూపులూ వారే. కీలకంగా వైవస్వత మన్వంతరాన ప్రస్తావన ప్రకారం- ఏడుగురు ఋషిసత్తములూ వేదమంత్రకర్తలు, అపార శక్తి సంపన్నులు, సర్వ ధర్మ మర్మజ్ఞులు. వాయుపురాణం రీత్యా- నిత్యకర్మల అనుష్ఠానపరులు, అధ్యయన అధ్యాపన తత్త్వవేత్తలు. 'ఓం అదితి సహిత కశ్యపాయ' అంటాం ముందుగా. *'కశ్యపస్సర్వ లోకాఢ్యః సర్వశాస్త్రార్థ కోవిదః ఆత్మయోగబలేనైవ సృష్టి స్థిత్యంత కారకః'.* కశ్యప మహర్షి లోక కర్త. అగ్రగామిత్వం పొందిన ఘనత తనది. నిరుపమ గుణశాలి.

అత్రిముని ధర్మపరాయణుడు. *'అగ్నిహోత్రరతం శాంతం.... శాంత మర్చయేదత్రిమవ్యయమ్'* అని ధ్యాన శ్లోక విశదీకరణ. అనసూయా సహితులైన ఆయనకు నమోవాకాలు అర్పిస్తుంది నిఖిలమంతా. అత్రి సంబంధిత సమాచారమంతా ఋగ్వేదంలోనే కాక రామాయణ, మహాభారతాల్లోనూ వ్యక్తమవుతుంది. అత్రిమండల శ్లోకాదులు కవితాత్మకాలు కూడా.

భరద్వాజుడు సుశీలా సహితుడు. *'జటిలం తపసా సిద్ధం..... నిత్యం భరద్వాజం నతోఽస్మ్యహమ్.'* తాను తపోదీక్ష సాగించిన ఆశ్రమ ప్రాంతమే భారద్వాజ తీర్థం. చిత్రకూటానికి పయనమైన సీతారామలక్ష్మణులకు మార్గదర్శకుడు. వేదాంశాల అధ్యయనానికి జీవితాన్ని అంకితం చేసిన తపోమూర్తి. వివిధ శాస్త్రాలను మథించిన శక్తిశాలి. లోకహితం కోసం సత్కర్మలెన్నింటినో చేపట్టిన క్రియాశీలి. పాండిత్య సంపద, ధ్యాన నిమగ్నత వల్ల చిరయశస్సు సాధించిన మునిపుంగవుడు.

రామచంద్రుడి గురువర్యుడు విశ్వామిత్రుడు. తపః ఫల మంతటినీ ప్రసాదించిన కర్తవ్య నిరతుడు. రాజర్షి, బ్రహ్మర్షి. గాయత్రీ మంత్ర సృజన చరితుడు. సమస్త విశ్వమంతటికీ మిత్రుడు, హితుడు. తపం ఆచరించడంలో మరెవ్వరూ సాటి కాలేనంత మేటి. *'కృష్ణాజినధరం దేవం సదండ పరిధానకమ్...*



సప్తర్షులు సంప్రదాయ-సంస్కృతులకు సదాసర్వదా పరిరక్షకులు

**విశ్వామిత్రం సనాతనమ్'** అని ప్రసక్తి. **కుముద్వతీ** సహితుడైన ఆయన ప్రస్తావన రామాయణ, భారత, భాగవతాల్లో ప్రస్ఫుటమవుతుంది. ముఖ్యంగా బాలకాండలో విశేషాంశాలనేకం దర్శనమిస్తాయి.

**గౌతమమహర్షి**– ***'యోగాఢ్యః సర్వభూతానాం... గౌతమస్సర్వ పావనః'*** అంటుంది శ్లోకరచనం. తను మంత్రద్రష్ట. అనేకానేక ఋషుల పరిపోషకుడు, సంరక్షకుడు. ధర్మసూత్రాలకు ఆద్యుడు, బాధ్యుడు. ఆశ్రమరీతులను, సంస్కార అంశాలను, రాజధర్మాలతో పాటు శిక్షాస్మృతులను సైతం రూపుదిద్దిన దీక్షాదక్షుడు. ఆహార నియమాదులు, ధర్మశాస్త్ర సంబంధిత ఇతర కోణాలూ తనదైన అపార పటిమతో రూపు ధరించాయి. సూక్తులెన్నింటినో ప్రవచించి ప్రాచుర్యానికి తెచ్చిన సుస్థిర సంకల్పుడు గౌతముడు.

**వశిష్ఠుడు** అనగానే ***'శివధ్యానరతం శాంతం... వశిష్ఠం పూజయేత్సదా'*** అనేది మన మదిలో మెదిలి తీరుతుంది. **అరుంధతీ** సహితుడాయన. అనంత తపోముద్ర తన సొంతం. నదీతీరాన ఆశ్రమస్థాపనతో ఎందరెందరికో విద్యాప్రదానం చేసిన బోధక గురువర్యుడు. 'బ్రహ్మర్షి'గా విఖ్యాతుడు. అసమాన ప్రకాశవంతుడు. ప్రతికూలతలెన్నింటినో అధిగమించగలిగిన ధీరుడు. జ్ఞానమార్గ ప్రదాయకుడు. పురాణంతో పాటే సిద్ధకల్పం, తంత్ర రచనలనేకం ఆ మేధలోనే రూపుదిద్దుకుని విస్తారంగా వ్యాపించాయి.

***'అక్షసూత్రధరం దేవం ఋషీనామధిపం ప్రభుమ్।'*** అనగానే మరుక్షణమే మనోనేత్రం ముందర ప్రత్యక్షమవుతాడు **జమదగ్ని** మునిసత్తముడు. **రేణుకా** సహితుడిగా ప్రఖ్యాతుడు. బ్రహ్మవైవర్త పురాణం, అదే విధంగా భాగవతంలో ప్రస్తావనలున్నాయి. పరమప్రశాంత చిత్తుడు, అరిషడ్వర్గాల మీద విజయుడిగా పేరు గడించిన మునిముఖ్యుడు ఆయన. వేదశాస్త్రాదులలో పట్టు సాధించిన మేధోనిధి. అగ్నిని సేవించిన ధీశాలిగా, పట్టిన పట్టు వీడని కార్యనిర్వహణాదక్షుడిగా గోచరిస్తాడు జమదగ్ని.

**తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునే సమయంలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ప్రవేశించిన సమయం నుండే 'గోవింద'నామోచ్చారణ చేయడం ప్రతి భక్తుని కర్తవ్యం.**

ఆచారసంప్రదాయ సమన్వితమైన ఋషిపంచమినాడు సప్తమహర్షులనూ ఆరాధిస్తాం. ఉపవాసాలు ఆచరించి, పూజలు నిర్వర్తించి, ప్రార్థనలు సాగించి వారిపట్ల భక్తిప్రపత్తులను సకుటుంబంగా వ్యక్తపరుస్తాం. పువ్వులు, తమలపాకులు, దీప కర్పూరాలతో సమర్చనలు జరుపుతాం అందరం. ఉపవాసం అనేది భక్తి జ్ఞానయోగాలకు సమీపాన ఉండటం. పూజలో సపర్య, శుశ్రూష, ఉపాసన నిండి ఉంటాయి. అదే మాదిరి, ఆ మునివర్యులందరికీ పేరుపేరునా గౌరవ అభివందనాలు సమర్పించడం ముఖ్యం. మరీ ప్రధాన అంశం–శ్రీమద్రామాయణాన్ని మనసారా చదవడం, వినడం చేయడం ద్వారా ఆ మహనీయులందరినీ హృదయపూర్వకంగా తలచుకుని గౌరవించుకోవడం బ్రహ్మవిద్య అభ్యసనం వంటిదే ఆ ప్రక్రియ అంతా!

సప్తమహర్షులనూ తలచినదే తడవుగా ఆ వికాస కిరణాలు మనపైన అదృశ్యంగా ప్రసరించి, అలౌకిక అనుభూతిని ఎంతైనా విస్తరింపచేస్తాయి. ప్రతీ ఒక్కరూ బ్రాహ్మీ ముహూర్తాన నిద్ర లేచి, అటు తర్వాత ఆ మాననీయులను స్మరిస్తే చాలు– మనసును లగ్నంచేసి పూజించుకుంటే మనోవికసనం వేగవంతమే అవుతుంది. ఆ ధన్యజీవనుల ఆశీస్సుమాలే సకలభాగ్యసౌభాగ్యాలనీ స్త్రీ పురుషులకు నిండారా ప్రసాదిస్తాయి. లోకమంతటినీ దీప్తిమంతం చేసిన, చేస్తున్న ఆ ఋషివర్యుల దీవెనలే సంపూర్ణ రక్ష. సప్తఋషులకూ దంపతులు నమస్కరించుకుంటే, ప్రకాశ వికాసాలు ఎంతెంతో సమకూరుతాయి.

ఋణాలు అనేకం ఉన్నాయి. ఋషిఋణం తీర్చుకోవడమన్నది ప్రథమ, ప్రధాన ధర్మం. దైవం, తల్లిదండ్రులకు మనమందరం ఋణపడి ఉన్నట్లే, సప్తమహర్షులకు కూడా. మనం నేర్చుకుని, సద్విద్యను ఇతరులకూ నేర్పించడమే ఋణం తీర్చుకోవడమన్న మాట. ధ్యానం, సాధన, ఆరాధనలతోనే మానవజీవితం చరితార్థమవుతుందని ప్రబోధిస్తుంది **'ఋషి పంచమి'.** సదాచరణ మనలోనే, మనతోనే!

సెప్టెంబర్ 3, పోలాల అమావాస్య సందర్భంగా...

# పోలాల అమావాస్య

- శ్రీ ఐ.హర్షవర్ధన్

పోలేరమ్మ అమ్మవారు గ్రామదేవత. దాదాపు ప్రతి ఊరి పొలిమేర్లలో అమ్మవారు కొలువుదీరి పూజలందుకుంటూ ఉంటుంది. పోలేరమ్మ సంతానం లేని వారికి సంతానం ప్రసాదిస్తుందనీ, సంతానం కలిగిన వారికి కడుపు చలువ చేస్తుందని విశ్వాసం. అటువంటి దేవతను పూజిస్తూ వ్రతం చేసే పర్వదినం- కేవలం వ్రతాన్ని ఆచరించడం వల్ల తమ పిల్లలకు అపమృత్యుభయం తొలగిపోయి ఆయురారోగ్యాలు వృద్ధి చెందేలా చేసే పుణ్యదినమే- **"పోలాల అమావాస్య!"**

శ్రావణ మాసంలోని కృష్ణ పక్ష అమావాస్య "పోలాల అమావాస్య". దీనికే **'పోలా అమావాస్య', 'పోలాలమావాస్య', 'పోలాంబవ్రతం'** వంటి పేర్లు కూడా ఉన్నాయి.

పోలాల అమావాస్య ఆచరణ వెనుక ఆసక్తి కరమైన గాథ ప్రచారంలో ఉంది. పూర్వం ఒక గ్రామంలో బ్రాహ్మణ దంపతులు నివసిస్తూ ఉండే వారు. వారికి ఏడుగురు కుమారులు కలిగారు. యుక్తవయస్సు రాగానే వారందరికీ వివాహాలు చేశారు. వారికి సంతానం కూడా కలిగింది. గ్రామంలో విడి విడిగా నివసించసాగారు. తమ సంతానం బాగా ఉండాలంటే 'పోలాంబ' అమ్మవారిని శ్రావణమాసంలో అమావాస్యనాడు పూజిస్తూ వ్రతం చేయాలని విన్న ఆ ఏడుమంది శ్రావణమాసం కోసం ఎదురు చూడసాగారు. శ్రావణమాసం వచ్చింది. అనేక వ్రతాలు ఆచరించారు. చివరి రోజు అయిన అమావాస్యనాడు పోలాంబవ్రతం ఆచరించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే వ్రతంరోజు ఉదయాన్నే ఏడవ కోడలి కుమారుడు మరణించాడు. అందువల్ల వ్రతం చేయలేక పోయారు. మరుసటి సంవత్సరం వ్రతం చేసేందుకు ప్రయత్నం చేశారు. కానీ మళ్ళీ ఆ సంవత్సరమూ ఏడవ కోడలి మరో బిడ్డ మరణించింది. దీనితో వ్రతం చేయలేకపోయారు. ఈ విధంగా ప్రతి సంవత్సరం వ్రతం చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవడం... ఆ రోజు ఉదయం ఏడవ కోడలిబిడ్డ మరణించడం, వ్రతం చేయలేక పోవడం... ఈ విధంగా ఏడు సంవత్సరాలు జరిగింది. మిగతా ఆరుమంది కోడళ్ళు ఏడవ కోడలి వల్ల వ్రతం చెడిపోతూ ఉంది అని తిట్టుకోసాగారు. ఆమెకు ఎక్కడలేని దుఃఖం కలుగుతూ ఉండేది. మరుసటి సంవత్సరం అంటే



ఎనిమిదవ సంవత్సరం వ్రతానికి అవసరమైన ఏర్పాట్లు అన్నీ చేసుకున్నారు. అయితే ఆ రోజు ఉదయమే ఏడో కోడలి బిడ్డ చనిపోయింది. ఈ విషయం తెలిస్తే అందరూ నిందిస్తారని, వ్రతం తన వల్ల ప్రతి సంవత్సరం చెడిపోతూ ఉందని కోప్పడ తారని భయపడ్డ ఆమె తన బిడ్డ మరణించిన విషయాన్ని బయటకు చెప్పకుండా... చనిపోయిన బిడ్డ శరీరాన్ని ఇంటిలో ఉంచి తోడికోడళ్ళతో కలిసి వ్రతంలో పాల్గొంది. అందరూ ఆనందంలో వ్రతం చేస్తూ ఉన్నా... తాను మాత్రం యాంత్రి కంగా వ్రతంలో పాల్గొంది. రాత్రి వరకూ అలాగే గడిచింది. చీకటి పడి గ్రామం సద్దుమణిగిన అనంతరం చనిపోయిన బిడ్డను భుజాన వేసుకుని గ్రామ పొలిమేరలో ఉన్న పోలేరమ్మ గుడివద్దకు చేరుకుని, గుడిముందు తన బిడ్డ మృతదేహాన్ని ఉంచి, తన పరిస్థితిని తలుచుకుని దుఃఖించసాగింది.

ఇట్టిస్థితిలో పోలేరమ్మ అమ్మవారు గ్రామసంచారం ముగించుకుని అక్కడికి చేరుకుని ఆమెను చూసి, ఆ సమయంలో ఏడుస్తూ తన వద్ద కూర్చునడానికి కారణం అడిగింది. దీనితో ఆమె గత ఎనిమిది సంవత్సరాలుగా జరుగుతున్నదంతా వివ రించింది. వీటన్నింటిని విన్న పోలేరమ్మ అమ్మవారు కరుణించి ఆమెకు అక్షతలు ఇచ్చి, పిల్లలను కప్పిపెట్టిన చోట వాటిని చల్లి పిల్లలను వారి వారి పేర్లతో పిలువమని చెప్పింది. ఏడవ కోడలు అదేవిధంగా చేసింది. ఫలితంగా చనిపోయిన పిల్ల లందరూ నిద్రనుంచి లేచి వచ్చినట్లుగా లేచి వచ్చారు. వారం దరినీ తీసుకుని పోలేరమ్మ అమ్మవారికి నమస్కరించి ఇంటికి చేరుకుంది. మరునాడు ఉదయం గ్రామంలోని వారందరకూ ఈ విషయం వివరించింది. అందరూ సంతోషించారు. అంతే కాకుండా అప్పటినుంచీ అందరూ ప్రతి సంవత్సరం వ్రతం చేయడం ప్రారంభించినట్లు లోకంలో కథనం.

## వ్రతవిధానం

వ్రతం రోజు తెల్లవారుఝామునే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని తలస్నానం చేసి, ఇంటిని శుభ్రపరచుకుని, మహిళలు తమ పిల్లలను వెంటబెట్టుకుని పోలేరమ్మ ఆలయానికి వెళ్ళి పూజలు చేసి ఇంటికి చేరుకుని వ్రతం చేయవలెను. పసుపుతో పోలేరమ్మను చేసుకుని పూజచేయదలచిన చోట ఏర్పాటు చేసుకున్న పీఠంపై బియ్యంపోసి దానిపైన ఏర్పాటు చేసుకోవాలి. ముందుగా వినాయకుడిని పూజించి తర్వాత, అమ్మవారిని షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించాలి. సాధారణంగా గౌరీదేవిని పూజచేస్తారు. పూజ ముగించిన తర్వాత పసుపు రాసిన దారానికి పసుపు కొమ్మును కట్టి 'తోరము' తయారు చేసుకుని పూలతో పూజించాలి. తోరమును ఒక దానిని అమ్మవారికి సమర్పించాలి. మిగతా తోరములను పిల్లల మెడలో వేయాలి. తర్వాత 'పెరుగన్నము' నైవేద్యంగా సమర్పించడంతో పాటూ ఆ రోజు దానినే ఆహారంగా స్వీకరించాలి. తిరిగి సాయంత్రం, మరునాడు పూజచేసి వ్రతం ముగించాలి.

ఈ విధంగా వ్రతం ఆచరించడం వల్ల సంతానం లేని వారికి సంతానం కలుగుతుంది. సంతానానికి అపమృత్యు భయం తొలగిపోయి ఆయురారోగ్యాలు వర్ధిల్లుతాయని శాస్త్ర వచనం.

ముఖచిత్ర వివరణ

## శ్రీపద్మావతీ అమ్మవారి పవిత్రోత్సవాలు

**వైదిక సంప్రదాయం ప్రకారం కొన్ని సందర్భాల్లో స్త్రీలకు క్షేత్రదర్శనం, ఆలయప్రవేశం నిషిద్ధం. కానీ యాత్రికులు, భక్తులు తమకు తెలియకుండా భగవంతుని దర్శించుకోవడానికివచ్చిన తర్వాత అశౌచం ఏర్పడితే, ఆశౌచంలోనే దర్శించుకోవడం జరుగుతుంది. ఈ విధంగా ఒక్క భక్తునివల్లనో, యాత్రికుని వల్లనో కాక విధి నిర్వహణలో ఉండే ఉద్యోగులవల్ల కూడా దోషాలు సంభవించవచ్చు. సేవల్లో లోపాలూ కలుగవచ్చు. ఇలాంటి దోషాలవల్ల ఆలయపవిత్రత కొంత తగ్గవచ్చు. తగ్గుతుంది కూడా. ఇలా జరిగిన తప్పిదనాల, దోషాల పరిహారణార్థం ఆగమశాస్త్రప్రకారం నిర్వహించే కార్యక్రమమే "పవిత్రోత్సవం". ఈ పవిత్రోత్సవాలు కేవలం ఆలయశుద్ధి, పుణ్యాహవాచనం లాంటి కార్యక్రమాలు మాత్రం కావు. సంప్రోక్షణంకంటే భిన్నమైన పవిత్రోత్సవం ప్రత్యేక క్రియకలాపంతో కూడినట్టి కార్యక్రమం. ప్రతి సంవత్సరం భాద్రపదమాసం పౌర్ణమి నాటికి పూర్తి అయ్యేటట్లుగా తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి పవిత్రోత్సవాలు ఈ సంవత్సరం సెప్టెంబర్ 16 నుండి 18 వరకు జరుగుతుంది. భక్తులందరూ ఈ విశేష కార్యక్రమాన్ని తిలకించి అమ్మవారి కృపకు పాత్రులుకండి.**



సెప్టెంబర్ 17న అనంతపద్మనాభవ్రతం సందర్భంగా...

# కోరిన వరాలిచ్చే వ్రతం

- శ్రీమతి పి.స్వరూప, 85005 45097

పరమాత్మ కాలస్వరూపుడు. ఆద్యంతాలు లేనివాడు. తనను భక్తితో అర్చించే వారికి అనంతమైన వరాలు ప్రసాదించే భక్తవరదుడు. అంతటి దయామయుడైన పరమాత్మను 'అనంతపద్మనాభ' స్వరూపంలో అర్చిస్తూ ఆచరించే వ్రతమే "అనంత పద్మనాభవ్రతం". కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా ఈ వ్రతం ప్రసిద్ధి పొందింది.

పన్నగశాయి పరమాద్భుత రూపం అనంతపద్మనాభుడు. సృష్టి, స్థితి, లయ తత్త్వాలకు ప్రతిబింబంగా కనిపించే పద్మనాభుడి దివ్యమంగళరూపం ఎంతసేపు చూసినా తనివి తీరదు. కావేరి తీరంలో పద్మనాభుడిగా, తెలుగునాట రంగనాథుడిగా భక్తుల పూజలు అందుకుంటున్నాడు స్వామి. ఆయన సేవలో తరించే అవకాశం కల్పిస్తున్నది 'అనంతపద్మనాభవ్రతం'.

భాద్రపదశుద్ధచతుర్దశినాడు ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. కష్టాలు తీరిపోవాలని, కోరికలు నెరవేరాలని కోరుతూ దీనిని నిర్వహిస్తారు. పద్మనాభుడి అర్చనలో సర్పరాజమైన అనంతుణ్ణి ఆరాధించడం ఈ వ్రతం ప్రత్యేకత.

## వ్రతవిధానం

అనంతపద్మనాభవ్రతానికి సంబంధించిన విధివిధానాలు భవిష్యోత్తర పురాణంలో కనిపిస్తాయి. ముందుగా ఓ మండపాన్ని ఏర్పాటుచేసుకుని, అందులో 14 పడగలు కలిగిన అనంతుడి ప్రతిమను ఉంచాలి. పూజ ప్రారంభంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, మంటపారాధన చెయ్యాలి. ఆ తర్వాత 'యమునా పూజ' (వ్రతంలో ఉంచటం కోసం సిద్ధం చేసుకొన్న కలశంలో పవిత్రజలాలను ఉంచాలి. ఆ నీటిలో




కొద్దిగా పాలు, ఒక పోకచెక్క, ఓ వెండి నాణెం వెయ్యాలి. కలశంలోని నీటిలోకి యమునానదిని ఆవాహన చేసి, శాస్త్ర విధానంగా అర్చనలు నిర్వహించాలి) చెయ్యాలి. పిండితోగానీ, దర్భలతోగానీ ఏడుపడగల సర్పాన్ని తయారు చేసి, అష్ట దళపద్మమంటపంపై గానీ, కలశంపై గానీ అనంతస్వామిని ప్రతిష్ఠించి షోడశోపచార పూజలు చేయాలి. బెల్లంతో చేసిన 28 అరిసెలను నివేదన చెయ్యాలి. వ్రతకథ చదువుకుని, అనంతపద్మనాభస్వామికి నమస్కరించి, అక్షతలు తలపై చల్లు కోవాలి. వ్రతంలో భాగంగా 14 ముడులు కలిగిన ఎర్రని తోరాలను స్వామి దగ్గర ఉంచి, వ్రతపరిసమాప్తి తర్వాత వాటిని దంపతులు తమ చేతులకు ధరించాలి.

ఒకసారి వ్రతదీక్షను స్వీకరించిన దంప తులు ఏటా తప్పకుండా ఆచరించాల్సి ఉంటుంది. కుదరని పక్షంలో ఎవరైనా వ్రతంలో ఉంచిన తోరాలనైనా తప్పని సరిగా ధరించాలి. పౌర్ణమితో కూడుకున్న చతుర్దశి అయితే అనంతవ్రతానికి మరింత శ్రేష్ఠమని శాస్త్రగ్రంథాలు చెబుతున్నాయి.

## అనంతమైన ఫలితాలు

అనంతపద్మనాభ రూపంలో ఉన్న విష్ణు మూర్తిని పూజించడం వల్ల తమ బాధలు తొలగిపోతాయి. 'అనంత' అనే పదానికి 'అంతము కానిది- అంతం లేనిది' అని అర్థం. దీని ప్రకారం అనంతవ్రతం ఆచరించడం వల్ల అంతులేని ఆనందం లభిస్తాయని తెలుస్తోంది.

సనాతనకాలం నుంచి ఈ వ్రతం మన దేశంలో ఆచరణలో ఉన్నట్లు పురాణ, ఇతిహాసాల ద్వారా తెలుస్తోంది. వనవాసం సమయంలో కష్టాలు అనుభవిస్తున్న

ధర్మరాజు వాటి నుంచి గట్టెక్కేందుకు ఏదైనా వ్రతం ఉంటే చెప్పమని శ్రీకృష్ణుణ్ణి అడుగుతాడు. అప్పుడు కృష్ణుడు అనంతపద్మనాభవ్రతాన్ని భాద్రపదశుక్లచతుర్దశినాడు చేయమని చెబుతాడు.

అనంతుడన్నా, అనంతపద్మనాభస్వామి అన్నా సాక్షాత్తూ కాలమే అనీ, యుగ, సంవత్సర, మాస తదితర కాలం అంతా తన స్వరూపమేనని కృష్ణుడు స్వయంగా వివరిస్తాడు. అనంత పద్మనాభుడంటే కాలస్వరూపుడైన వైకుంఠవాసుడి అవతారమైన శ్రీకృష్ణుడు పాలకడలిలో శేషశయ్య మీద పవళించి ఉండి, నాభి నుంచి ఉద్భవించిన పద్మంలో బ్రహ్మదేవుడు కూర్చొని లక్ష్మీదేవి పాదాలొత్తుతున్న ఆ దివ్యస్వరూపమే అనంతపద్మనాభుడు. ఈ వ్రతమహిమతో కృతయుగంలో సుశీల కౌండిన్య దంపతులు సకలసంపదలు, సుఖసంతోషాలతో జీవించినట్లు పురాణాలు చెబుతున్నాయి.

## ఇదీ అంతరార్థం

వ్రతంలో భూభారాన్ని వహిస్తున్న అనంతుణ్ణి, ఆ ఆది శేషుడిని శయ్యగా చేసుకొని పవళించి ఉన్న శ్రీమహావిష్ణువును పూజించటం కనిపిస్తుంది. వ్రతసంబంధమైన పూజను గమనిస్తే అనంతపద్మనాభ అవతారం కళ్ల ముందు మెదలాడుతుంది. వ్రతాచరణ కోసం పిండితో ఏడు పడగల పామును చిత్రిస్తారు. దర్భలతో పాము బొమ్మను చేసి, దాన్ని మూతపెట్టిన కలశం మీద ఉంచి పూజిస్తారు. ఈ మొత్తంలోనూ శేషశయనుడి రూప భావన కనిపిస్తుంది.

అనంతపద్మనాభస్వామి పూజలో పద్నాలుగు సంఖ్యకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తుంది. పద్నాలుగు లోకాలను ఏలే ఆ స్వామి పూజ అనే భావన కలిగేందుకు ఆనాడు పూజించే సర్పాకృతికి పద్నాలుగులో సగమైన ఏడు సంఖ్యలో పడగలను పెట్టడం, పద్నాలుగుకు రెండింతలైన ఇరవై ఎనిమిది సంఖ్యలో గోధుమ పిండితో పిండి వంటలు చేసి పద్నాలుగేళ్ల కొకసారి వ్రతానికి సంబంధించిన ఉద్యాపన చేయటం కనిపిస్తుంది. ఈ వ్రతంలో ప్రధానాంశమైన చేతికి ధరించే ఎర్రటి తోరానికి 14 ముడులుంటాయి. మరి కొందరు నైవేద్యానికి 14 రకాల పండ్లు, పిండి వంటలు, పూజ కోసం పత్రిని వాడుతుంటారు. ఇదంతా పద్నాలుగు లోకాలను ఏలే కాలస్వరూపుడైన ఆ దివ్య మంగళస్వరూపుణ్ణి తలచుకోవటం కోసమే.

వ్రతానికి సంబంధించి కథను పరిశీలిస్తే అంతా సత్యం, ధర్మం మీద ఆధారపడి ఉన్నట్లు కనిపిస్తుంది. సత్యధర్మాలను అనుసరించేవారు దైవకృపకు పాత్రులవుతారని, వాటిని విస్మరించినవారు జన్మజన్మలకూ కష్టాలు అనుభవిస్తూనే ఉండాల్సి వస్తుందన్న హెచ్చరిక కనిపిస్తుంది. తనను తినబోయిన పులికి ఓ ఆవు కాసేపు ఆగమని, ఇంటికి వెళ్లి తన లేగదూడకు పాలిచ్చి వస్తానని చెప్పి ఆడిన మాటను నిలబెట్టుకొని పులి దగ్గరకు వెళ్లి సత్యవ్రతాచరణను చాటిన కథను ఈ వ్రత సందర్భంగా చెప్పుకొంటుంటారు. ఆనాడు ఆ ఆవు తన ప్రాణాల కన్నా సత్యమే మిన్న అని భావించింది. తన లేగ దూడకు కడుపునిండా పాలుపట్టి ధర్మాన్ని బోధించింది. అలాంటి ధర్మజీవనవిధానాన్ని ఈ వ్రత సందర్భంగా తలచుకుంటారు.

## తిరుమలలో అనంత వ్రతం

ఏటా తిరుమలలో భాద్రపదశుద్ధచతుర్దశి రోజున అనంతపద్మనాభవ్రతాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకకార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ రోజున శ్రీవారి ఆలయంలో ఉదయం పూజలు చేసిన తరువాత శ్రీసుదర్శన చక్రత్తాళ్వారులను ఆలయం నుండి ఊరేగింపుగా తీసుకెళ్ళి శ్రీవరాహస్వామి ఆలయం చెంత ఉన్న స్వామి పుష్కరిణిలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేస్తారు. అనంతరం చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

శ్రీమహావిష్ణువు అనంతకోటి రూపాలలో ఒకటి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. అదేవిధంగా శయనమూర్తిగా శ్రీఅనంత పద్మనాభస్వామికి అంతే వైశిష్ట్యం ఉన్నది. ఏటా ఈ పర్వదినాన దేశవ్యాప్తంగా ఉన్న 108 శ్రీవైష్ణవ దివ్యక్షేత్రాలలో అనంత పద్మనాభవ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తిరుమల 108 శ్రీవైష్ణవ దివ్యదేశాలలో ప్రధానమైనది కావడంతో ఈ రోజు అనంతపద్మనాభవ్రతాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలలో చివరి రోజున, వైకుంఠ ద్వాదశి, రథసప్తమి, అనంత పద్మనాభవ్రతం పర్వదినాలలో మాత్రమే చక్రత్తాళ్వారులకు చక్రస్నానం నిర్వహిస్తారు.

మానవత్వం

# నిజమైన మానవత్వం

-ఆచార్య ఏ.సచ్చిదానంద మూర్తి,98480 86858

'మానవప్రేమే మానవ ఆదర్శం'

"మానవత్వం" గురించి చాలామంది చాలా చెబుతుంటారు. అసలు 'మానవత్వం ఉండాలి' అని ప్రత్యేకంగా చెప్పడంలోని అంతరార్థం ఏముంటుంది? మనుషులన్నాక 'మానవత్వం ఉండి తీరాలి కదా!', 'మానవత్వం లేకుండా ఇంత పని చేశారు' అనే మాటలు మనం వింటుంటాం. కనికరం, మానవత్వం, ఇలాంటి మాటలు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఏముంది? అంటే ఈ ప్రపంచంలోకి మనుషులు, వివిధ రకాల జంతువులు వచ్చాక చివరగా మనిషి రంగప్రవేశం చేశాడనేది కొంతమంది చెబుతుంటారు. ఇది నిజం అనుకొంటే- పశువులకు మనిషికి తేడా కొట్టవచ్చినట్టు కనబడుతుంది. పశువు తిండి, నిద్ర, మైథునం ఇట్లాంటి నిత్యకృత్యాలు ప్రకృతిని అనుసరించి చేస్తూ ఉంటాయి. సూర్యోదయం కాబోతుండగానే క్రిమి కీటకాదులతో సహా జంతువులన్నీ మేల్కొంటాయి. మనిషి



మాత్రం మేల్కొనాలన్న సిద్ధాంతాన్ని ఏమీ పెట్టుకోలేదు. మిగతా విషయాలు కూడా జంతువుకు, మనిషికీ తేడా కనిపిస్తుంది. జంతువు ఆకలి వేసినప్పుడు తింటే, మనిషి మాత్రం తినడం కోసమే కష్టపడి సంపాదిస్తాడు. కేవలం తన కడుపు నిండితే చాలు అనుకోడు. తాను తినడమే కాక తనవారికోసం తరతరాలకు తరగని ఆస్తులను కూడగట్టుతాడు. కనుక మనిషికి తిండి విషయంలోనే జంతువుకు పోలిక సరిపడదు.

అట్లాంటి మనిషి కనుకనే మానవత్వం గురించి వేరుగా చెప్పాల్సి వస్తోంది. మొదట్లో అంటే జ్ఞానం కావాల్సినంత సముపార్జించనపుడు మనిషి కూడా పశువులాగే పనులు చేస్తుంటాడు. ఇతరుల కష్టనష్టాలను అంచనా వేయగలడు. తనకు కావాల్సిన దానిని పట్టుపట్టి తీసేసుకుంటాడు. మృగంలా ప్రవర్తిస్తున్నాడు అంటుంటారు కదా. దీనివల్లనే. మనిషి ఎప్పుడైతే తాను వేరు, శరీరం వేరు అన్న జ్ఞానాన్ని ఆర్జిస్తాడో అపుడు తనను తాను అదుపులో పెట్టుకుంటాడు. తన కోరికలను కూడా అదుపులో పెట్టుకుంటాడు. ఏది చేయవచ్చు? ఏది చేయకూడదు? అన్న ఆలోచనలను కలిగి ఉంటాడు. అపుడు మానవత్వం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం ఉండదు. ఎప్పుడైతే శరీరం వేరు. ఈ శరీరం నశించేదే. 'కేవలం మరుజన్మకు పుణ్యపాపాలే తోడు ఉంటాయి' అన్న కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతాడో, అపుడే పాపభీతి మొదలవుతుంది. అపుడు ఇతరులకు కలిగే కష్టాన్ని, నష్టాన్ని గురించి తెలుసుకొంటాడు. అపుడు అతడిలో మానవత్వపు ఛాయ పొడచూపుతుంది.

కనుక మనిషి-తాను ఎవరు? అన్న జ్ఞానాన్ని ముందు సంపాదించడం మొదలు పెట్టాలి. ఈ సంపాదన కోసం ఆధ్యాత్మిక మార్గంలో వెళితే 'దైవం లేకపోతే చైతన్యం ఏదో ఒకటి మాత్రమే మనిషిని నడిపిస్తుంది' అన్న సత్యాన్ని సులభంగా తెలుసుకొంటాడు. అపుడు అతనిలోని మృగత్వ లక్షణాలు తొలుగుతాయి. మానవత్వం మొగ్గతొడుగుతుంది.

ప్రతి మనిషి తాను ఎవరో తెలుసుకొంటే 'నేను' అనే దానికి సమాధానం రాబట్టుకుంటే, ఎవరూ ఎవరినీ బాధించరు. ఎవరూ ఎవరినీ కష్టపెట్టరు. అపుడు సులభంగా అందరూ సంతోషంగా ఉండవచ్చు.

'సర్వేజనాస్సుఖినో భవన్తు'

108 దివ్యదేశాలు

# తిరుత్తెట్రియమ్బలమ్

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరునాంగూర్ దివ్యదేశములలో ఆరవ దివ్యదేశం 'తిరుత్తెట్రియమ్బలమ్'. ఈ దివ్యదేశం తమిళనాడులోని శీర్కాళికి తూర్పున 8 కి.మీల దూరంలో ఉన్నది. ఈ దివ్యదేశం యొక్క మూలమూర్తి *శెంగణ్మాల్ పెరుమాళ్, రంగనాథుడు, లక్ష్మీరంగ* అనే పేర్లతో ఆదిశేషుని మీద దక్షిణదిక్కున తలవంచి పళ్ళికొండ (శయన) భంగిమలో, నాలుగు భుజములతో వేంచేసి ఉంటారు. ఆ మూలమూర్తి యొక్క శిరోభాగంలో మహాలక్ష్మి, శ్రీదేవి; పాదముల దగ్గర భూదేవి అమ్మవార్లు వేంచేసి ఉంటారు. ఈ ఆలయప్రాకారంలో *శెంగమలవల్లి తాయార్* అనే నామంతో ప్రత్యేకమైన సన్నిధిలో అమ్మవారు వేంచేసి అనుగ్రహిస్తున్నారు. అలాగే చక్రత్తాళ్వార్, గోపాలకృష్ణుడు అలాగే కొంతమంది ఆళ్వారులు వీరి సన్నిధిలు కూడా వెలసియుంది. శ్రుతిమయ విమానం, వేద విమానం అని విమానం యొక్క పేర్లు. సూర్య పుష్కరిణి, శేషతీర్థం అనే నామములతో ఈ స్థలంలో పుష్కరిణి వెలసి ఉన్నది.

## స్థలపురాణం

అమ్బలమ్ అనే శబ్దానికి 'రంగం' లేక 'మేడ' అని అర్థము. ఈ శబ్దం శైవులు ఎక్కువ శాతంలో పరమశివుడు నాట్యమాడే ఆ మేడకు అమ్బలమ్ అని చెబుతుంటారు. అందు చేత తిరుచిత్రమ్బలమ్, పొన్నమ్బలమ్ అని పరమశివుని స్థలాలు ఉంటాయి. అలా ఉన్నప్పుడు అర్చామూర్తిగా, దేవదేవుడు శయన భంగిమలో తిరుత్తెట్రియమ్బలమ్ అనే ఈ దివ్యదేశంలో ఎలా 'అంబలం' అనే పేరులో వేంచేసి ఉన్నాడు అనేటటువంటి సందేహం, ఆశ్చర్యం కూడా మనకు కలుగుతుంది.

దాని కొరకు నిగమాంతమహా దేశికులు (వేదాంత దేశికులు) దశావతార స్తోత్రంలో మొట్టమొదటి శ్లోకంలోనే 'రంగే ధామని లబ్ధ నిర్భర రసైః అధ్యక్షితో భావుకైః' అని ఈలోకాన్ని నాట్యరంగంగా చేసుకుని శ్రీమహావిష్ణువు సమస్త కార్యములను నిర్వర్తిస్తున్నాడని అర్థం. పరమశివునికి మాత్రమే కాదు, శ్రీమహావిష్ణువుకూ ఇది అన్వయిస్తుంది. అలాగే 'త్తెట్రి' అంటే ఒక 'తిన్న' అని అర్థం. 'త్తెట్రిఅమ్బలమ్' అంటే ఎత్తుగా మేడగా ఉన్నటువంటి ఒక ప్రదేశం. అలాగే ఈ దివ్యదేశంలో కనిపిస్తున్నందువల్ల దీనికి తిరుత్తెట్రియమ్బలమ్ అనే పేరు కలిగిందట.

ముందు ఒక కాలంలో భూమాదేవిని అపహరించి నటువంటి హిరణ్యాక్షుని నుండి రక్షించడానికై మహావిష్ణువు





'తిరుత్తెట్రియమ్బల' దివ్యదేశ మూలమూర్తి 'శెంగణ్మాల్ పెరుమాళ్'



అలాగే రాక్షసుడైన హిరణ్యాక్షుడితో యుద్ధం చేసి, ఆ అలసట పోగొట్టుకోవడానికై తన యొక్క శిరస్సునందు మహాలక్ష్మిని, అలాగే పాదములయందు భూమాదేవిని పెట్టుకుని ఈ అమ్బలంలో శయనమూర్తిగా, అర్చామూర్తిగా, ఆనాటి నుండి ఈనాటి వరకు సేవను ప్రసాదిస్తున్నాడు. శ్రీరంగం రంగనాథుని వలె, ఆ శయన తిరుక్కోలంలో ఉన్నా కూడా, రంగనాథుని కన్నా రెండు హస్తములు ఎక్కువగా ధరించి నాలుగు భుజములలో ఈ తిరుత్తెట్రి అమ్బలంలో స్వామి వేంచేసి ఉండడం ఒక ప్రత్యేకత. అమ్మవారికి మరియు ఆది శేషుడికి ప్రత్యక్షం. పాంచరాత్ర ఆగమోక్తంగా ఈ రంగనాథుడు సకలవిధముల కైంకర్యాన్ని అందుకొంటున్నాడు. తిరుమంగై ఆళ్వారులు వీరిని మంగళాశాసనం చేశారు. ఎవరైతే శెంగమల వల్లి నాయికా సమేతుడైన రంగనాథుణ్ణి దర్శించుకుంటారో, వాళ్ళకి సమస్తమైనటువంటి కష్టములు తొలగి, సమస్త ఐశ్వర్యములు సిద్ధించును.

వరాహావతారాన్ని స్వీకరించడానికి ఉద్యుక్తుడవ్వగా, ఆ సమయంలో శ్రీదేవి మరియు ఆదిశేషుడు భగవంతునియందు 'మిమ్మల్ని విడిచిపెట్టి మేము ఉండలేము' అని చెప్పగా, భగవంతుడు మీరిరువురు కూడా తిరునాంగూర్ దివ్యదేశములలో మోదుగవనానికి సమీపంలో తపస్సు చేయండి. నేను నా అవతార ఉద్దేశ్యాన్ని అంటే భూమాదేవిని రక్షించి, ఆ తరువాత ఆ మోదుగవనానికి వచ్చి మిమ్మల్ని అనుగ్రహిస్తాను అని చెప్పగా, శ్రీదేవి మరియు ఆదిశేషుడు అలాగే అని అంగీకరించి వాళ్ళు ఆ పలాసవనానికి వెళ్ళగా, పరమశివుడు కూడా వాళ్ళతో పాటు చేరి, ముగ్గురూ భగవంతుని గురించి తపస్సు చేశారు. దేవదేవుడు వారికి సంకల్పించిన విధంగానే హిరణ్యాక్షుణ్ణి సంహరించి, ఈ మోదుగవనానికి వచ్చి ఈ ముగ్గురిని కూడా అనుగ్రహించడం జరిగినది.

**రక్తాబ్జాక్ష సమాహ్వయో హరిరసౌ రక్తాంబుజా నాయికా**
**తీర్థం సూర్యనిషేవితం శృతిమయం తద్వ్యోమయానం మహత్।**
**ఉద్యత్ సూర్యముఖశ్చ రక్తకమలా సాక్షాత్కృతః సర్వదా**
**మహ్యే చైవ తథా భుజంగశయనో రక్తాంబరో రాజతే॥**

## విశేషాంశములు

| | | |
|---|---|---|
| **దివ్యదేశం పేరు** | : | **తిరుత్తెట్రియమ్బలం** |
| **ప్రదేశం** | : | **తమిళనాడు-నాగపట్నం-తిరునాంగూర్** |
| **ప్రధానదైవం** | : | **శెంగణ్మాల్** |
| **ప్రధానదేవత** | : | **శెంగమలవల్లి** |
| **దిశ** | : | **తూర్పు ముఖము** |
| **పుష్కరిణి** | : | **సూర్యపుష్కరిణి, శేషతీర్థం** |
| **విమానం** | : | **శృతిమయ విమానం, వేదవిమానం** |
| **ఆగమం** | : | **పాంచరాత్రాగమం** |
| **ప్రత్యక్షం** | : | **అనంతుడు/ ఆదిశేషుడు** |
| **మంగళాశాసనం చేసిన ఆళ్వారు** | : | **తిరుమంగై ఆళ్వారు** |

# బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవం

## (04-10-2024 నుండి 12-10-2024 వరకు)

- డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు,
94919 46070

తెలుగువారి ఇలవేల్పు.. కలల పందిరి.... నిత్యకల్యాణ చక్రవర్తి అయిన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఏడాది పొడవునా ఎన్నో సేవలు, మరెన్నో ఉత్సవాలు... తిరుమల రాయడికి ఎన్ని సేవలు జరిగినా.. ఎన్ని ఉత్సవాలు జరిగినా వైభవమంతా "బ్రహ్మోత్సవం"లోనే... బ్రహ్మ స్వహస్తాలతో నిర్వహించినట్లుగా భావించే ఈ ఉత్సవాల్లో ప్రతి అడుగూ ప్రత్యేకమే! ప్రతి సేవా వైభవోపేతమే!!

నారాయణపర్వతంపై పుష్కరిణీ తీరంలో కన్యాభాద్రపదమాసంలో ఏకాదశీతిథినాడు సోమవారంరోజు శ్రవణానక్షత్రం సిద్ధయోగసమయంలో శ్రీనివాసుడు- వేంకటాద్రిపై అవతరించాడు అని పురాణాలలో చెప్పబడింది.

వైకుంఠం వదిలి లోకరక్షణకోసం వేంకటాద్రి పై కొలువుదీరిన శ్రీనివాసుణ్ణి వెదుకుతూ సృష్టికర్త బ్రహ్మదేవుడు, ఇతర దేవతలు వేంకటాద్రి చేరి స్వామిని దర్శించి ఆనందించారు. ఈ సమయంలో-

ధ్వజారోహణ పూర్వశ్చ కార్యస్తవ మహోత్సవః।
స చ త్వయా మహాభూమాన్ అంగీకార్యః శ్రియా సహ॥ (వరాహపురాణం)



"ఓ శ్రియఃపతీ! ధ్వజారోహణపూర్వకంగా నీకు మహోత్సవం జరపాలనుకొన్నాను. మహాప్రభూ! ఉత్సవాన్ని నీవు శ్రీదేవితో కూడి అనుగ్రహించాలి" అని బ్రహ్మదేవుడు శ్రీనివాసుణ్ణి ప్రార్థించాడు. స్వామి 'అట్లే జరపండి' అని అంగీకరించాడు. బ్రహ్మదేవుడు ఉత్సవం నిర్వహించాడు. అందువల్ల ఈ ఉత్సవం 'బ్రహ్మోత్సవం' అయింది. నాటినుంచి ఈ ఉత్సవాలను బ్రహ్మోత్సవాలుగా నిర్వహిస్తున్నారు. కాగా బ్రహ్మాండమంతా ఆనందించేలా జరిగే ఉత్సవాలు కనుక బ్రహ్మోత్సవాలు అన్నారు.

ఈ విధంగా మొదటిసారిగా తిరుమల శ్రీనివాసుడికి బ్రహ్మోత్సవాలను స్వయంగా సృష్టికర్త నిర్వహించగా... దేవతలు అందరూ హాజరయ్యారు. ఇలా పురాణకాలంనుంచే ఉత్స వాలు జరుగుతూ ఉన్నా... చారిత్రక కాలంలో కూడా ఎందరో పాలకులు స్వామివారికి ఇలాంటి ఉత్సవాలను జరిపించారు. తమ రాజ్యాభివృద్ధి, తమ విజయాలు వంటి వాటికి స్వామి వారికి కృతజ్ఞతగా పాలకులు ఈ ఉత్సవాలను జరిపించినట్లు చెప్ప వచ్చు. తిరుమల, తిరుపతిలలో లభించిన శాసనాలలో ఈ ఉత్సవవిశేషాలు పేర్కొనబడ్డాయి.

ఆంగ్లశకం 7 వ శతాబ్దానికి ముందు తిరుమలలో ధ్వజారోహణ, ధ్వజావరోహణ కార్యక్రమాలను మాత్రం నిర్వహించి మిగతా ఉత్సవాలన్నీ తిరుచానూరులో జరిపేవారు.



**సామవాయి**
వేయించిన రెండుశాసనాలు ప్రథమప్రాకారంలో విమాన వేంకటేశ్వరుని క్రింద ఉత్తరపుగోడపై చెక్కబడి ఉన్నాయి.
ఈ రెండుశాసనాలు ఉన్న ఉనికిని చూపే ఊహాచిత్రమిది.

614వ సంవత్సరంలో పల్లవరాణి సామవాయి 'మనవాళ పెరుమాళ్' అనే పేరుతో వెండి ఉత్సవమూర్తిని బహూకరించారు. ఈ రాణికే 'పేరుందేవి' అనికూడా పేరు. ఈ ఉత్సవమూర్తే శ్రీభోగ శ్రీనివాసమూర్తి. పెరటాశిమాసంలో జరిగే బ్రహ్మోత్సవాల ముందు ఈ ఉత్సవమూర్తిని తిరువీథులలో ఊరేగించే ఏర్పాట్లు రాణి చేసినట్లు కథనం. ఈ విగ్రహం తయారు చేయించి బహూకరించిన తర్వాతనే తిరుమలలో పూర్తిగా ఉత్సవాలు ప్రారంభమైనట్లు కూడా చెప్పబడుతూ ఉంది.

దక్షిణాంధ్ర మరియు కంచిని పరిపాలించిన నెల్లూరు చోడుల తెలుగు చోళరాజు త్రిభువనచక్రవర్తిగా ప్రసిద్ధి చెందిన విజయగొండ గోపాలుడు(1248-1263) 1254వ సంవత్సరం చైత్రమాసంలో ఉత్సవాలను నిర్వహింపచేశారు.



తిరువెంకటనాథ యాదవరాయలు(1321-1337) తన పరిపాలనా కాలంలో 1328వ సంవత్సరంలో ఆషాఢ మాసంలో 'ఆడితిరునాళ్ళు' అనే పేరుతో ఉత్సవాలను నిర్వహింప చేశారు. ఇల్లత్తూరునాడులోని పొంగల్లూరు గ్రామ ఆదాయంలో సగభాగం శ్రీస్వామివారికి సర్వమాన్యంగా దానం ఇచ్చారు. ఈ దానం "ఆణి" నెలలో జరిగే బ్రహ్మోత్సవానికి ఖర్చులకోసం చేశారు.

విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన సంగమవంశం పాలకుడు రెండవ హరిహరరాయలు (1379-1399) తన పాలనా కాలంలో 1388వ సంవత్సరం జనవరి 18వ తేదీన పూందోడు అనే గ్రామాన్ని స్వామివారికి సమర్పించి, ఆ గ్రామంనుంచి లభించే ఆదాయంతో ప్రతి సంవత్సరం మాశిమాసంలో బ్రహ్మోత్సవం జరిగే ఏర్పాటు చేశారు.

విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన సంగమ వంశం పాలకుడు రెండవ దేవరాయలు (1419-1444) తన పరిపాలనా కాలంలో 1429 వ సంవత్సరం డిసెంబర్ నెల 5వ తేదీన తిరుమలక్షేత్రానికి చేరుకొని శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ఆశ్వీయుజమాసంలో పునర్వసు నక్షత్రం మొదలు స్వాతి నక్షత్రంవరకు తొమ్మిది రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరిగే ఏర్పాటు చేశారు.




ఈ విధంగా వివిధ పాలకులు ఏర్పాటు చేయడం వల్ల విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన సాళువ వంశపాలకుడు సాళువనరసింహ రాయలు కాలానికి సంవత్సరంలో ఏడుసార్లు బ్రహ్మోత్సవాలు జరిగేవని చరిత్ర చెబుతోంది.

విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు (1509-1529) ఏడుసార్లు తిరుమల క్షేత్రాన్ని దర్శించారు. 1513వ సంవత్సరంలో మే నెల 2వతేదీన రెండవ సారి, అదే సంవత్సరం జూన్ నెల 13వ తేదీన మూడోసారి తిరుమల క్షేత్రాన్ని దర్శించారు. ఈ సమయంలో అనేక కానుకలు ఇవ్వడంతో పాటు, అనేక గ్రామాలను స్వామివారికి సమర్పించి తన తల్లిదండ్రుల ఆత్మోద్ధారణ కోసం ప్రతి సంవత్సరం తై మాసంలో ఉత్సవం జరిగే ఏర్పాటు చేసినట్లు చారిత్రక ఆధారాలు వెల్లడిస్తూ ఉన్నాయి.



శ్రీకృష్ణదేవరాయల తర్వాత అచ్యుతదేవరాయలు తిరుమల ఆలయంలోనే 1529వ సంవత్సరంలో విజయ నగర రాజ్య చక్రవర్తిగా పట్టాభిషేకం చేసుకున్నారు. అనంతరం ఆయన 1530వ సంవత్సరంలో అచ్యుతరాయ బ్రహ్మోత్సవం పేరిట బ్రహ్మోత్సవాన్ని కూడా జరిపించారు.

ఇలా 1583వ సంవత్సరం నాటికి సంవత్సరంలో దాదాపు ప్రతి నెలా బ్రహ్మోత్సవాలు జరుగుతూ ఉండేవి. కాగా కాలగర్భంలో రాజ్యాలు, రాజులు కలిసిపోవడం వల్ల ఉత్సవాలు కూడా నిలిచిపోయాయి. చివరకు బ్రహ్మదేవుడు ప్రారంభించిన బ్రహ్మోత్సవం మాత్రం నిలబడి వైభవంగా ప్రతి సంవత్సరం జరుగుతోంది. సాధారణంగా ఏ ఆలయంలో అయినా ఏదైనా మాసంలో ఒక తిథినాడు ఉత్సవాలు ప్రారంభించి నిర్వహిస్తారు. అయితే తిరుమలలో అలాకాదు. ముగింపును లెక్కలోకి తీసుకుని నిర్వహించడం విశేషం. కన్యామాసంలో అంటే సూర్యుడు కన్యా రాశిలో సంచరించే మాసం శ్రవణానక్షత్రం రోజు అవభృథం నిర్ణయించి అందుకు తొమ్మిదిరోజులముందు నుంచి ఉత్సవాలను జరుపుతారు. అవభృథం అంటే చక్ర స్నానం. సాధారణంగా కన్యామాసం ఆశ్వీయుజమాసంలో వస్తుంది. కనుక బ్రహ్మోత్సవాలు దసరాపండుగ సమయంలో జరుగుతాయి. అయితే చాంద్రమానం ప్రకారం మూడు సంవత్సరాలకు ఒకసారి అధికమాసం వస్తుంది. ఈ సమయంలో కన్యా మాసం భాద్రపదమాసంలోనే వస్తుంది. కనుక భాద్రపద మాసంలోనే బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. తిరిగి ఆశ్వీయుజమాసంలో దసరా సమయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. అంటే అధికమాసం వచ్చిన సమయంలో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. మొదటిసారి జరిగే వాటిని సాలకట్ల బ్రహ్మోత్సవాలు అనీ, దసరాలో జరిగే వాటిని నవరాత్రి బ్రహ్మోత్సవాలు అని వ్యవహరిస్తారు. ఈ విధంగా రెండు బ్రహ్మోత్సవాలు వచ్చిన సమయంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు యథావిధిగా జరుగుతాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. అలాగే సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవ రోజు జరిగే రథోత్సవంలో స్వామివారు చెక్కరథాన్ని అధిరోహించి ఊరేగుతారు. దసరా ఉత్సవాలలో స్వర్ణ రథాన్ని అధిరోహించి ఊరేగుతారు. అలాగే సాలకట్ల బ్రహ్మోత్సవాలలో రాత్రి వాహనసేవ అనంతరం ఆలయంలోని తిరుమలరాయ మండపంలో ప్రతిరోజూ బంగారు తిరుచ్చిలో స్వామి వారిని అధిరోహింప చేసే ఆస్థానం నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలలో రంగనాయక మండపంలో బంగారు శేషవాహనంపై అధిరోహింప చేసే ఆస్థానం నిర్వహిస్తారు.





బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందు వచ్చే మంగళవారం 'కోయిల్ఆళ్వార్ తిరుమంజనం' అంటే ఆలయశుద్ధి జరుగుతుంది. బ్రహ్మోత్సవాలకు ముందురోజు సాయంత్రం అంకురార్పణ కార్యక్రమం జరుగుతుంది. స్వామివారి సేనాధిపతి అయిన విష్వక్సేనులు ఉరేగింపుగా వసంతమండపం వెళ్లి పుట్టమట్టిని సేకరించి తీసుకువచ్చి ఆలయంలోని యాగశాలలో కొత్త పాలికలలో నవధాన్యాలను వేసి అంకురార్పణ చేస్తారు. బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణతో ప్రారంభం అవుతాయి. మొదటిరోజు సాయంత్రం ఆలయంలోని ధ్వజస్తంభంపై గరుడకేతనాన్ని ఎగురవేయడమే ధ్వజారోహణం. ఆరోజు రాత్రినుంచి వాహన సేవలు జరుగుతాయి.



ఈ బ్రహ్మోత్సవాలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తి అయిన శ్రీమలయప్ప స్వామి వాహనాలను అధిరోహించి తిరుమాడ వీథులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు. కాగా వివిధరూపాలను, అలంకారాలను ధరించే స్వామివారు కొన్ని వాహనాలలో ఒక్కరే... మరికొన్ని వాహనాలలో ఇరుదేవేరులతో అధిరోహించి ఊరేగుతారు. చిన్నశేషవాహనం, హంస వాహనం, సింహవాహనం, మోహినీఅవతారంలో పల్లకిలో, గరుడ, హనుమంత, గజ, సూర్యప్రభ, చంద్రప్రభ, అశ్వవాహనాలపై స్వామివారు ఒక్కరే ఊరేగుతారు.







పెద్దశేష, ముత్యాలపందిరి, కల్పవృక్ష, సర్వభూపాలవాహనాలతో పాటు, స్వర్ణరథోత్సవం, పెద్దరథోత్సవంలో ఇరుదేవేరులతో కలిసి స్వామివారు ఊరేగుతారు. చిన్నికృష్ణుడు, కాళీయమర్దనకృష్ణుడు, యోగముద్రరాముడు, రారాజు వంటి రూపాలను అలంకరించుకుని వాహనసేవల్లో పాల్గొనే స్వామివారు సరస్వతీదేవి రూపంలో హంసవాహనంపై, అలనాడు అమృతాన్ని పంచిన సంఘటన గుర్తుకు తెస్తూ మోహినీరూపంలో పల్లకిపై ఊరేగుతూ భక్తులకు కన్నుల పండుగ చేస్తారు.

బ్రహ్మోత్సవాలలో తొమ్మిదవ రోజు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ శ్రీవరాహస్వామి ఆలయం చేరుకుంటారు. స్వామి వారి ఆయుధమైన శ్రీచక్రత్తాళ్వార్ స్వామివారిని అనుసరిస్తారు. వరాహస్వామిఆలయంలో స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలోకి తీసుకు వెళ్ళి పుష్కరిణిలో ముంచి పవిత్ర స్నానం చేయిస్తారు. ఇదే చక్రస్నానం. ఇదే అవభృథం. ఆ రోజు సాయంత్రం బ్రహ్మోత్సవాల ప్రారంభంగా ధ్వజస్తంభంపై ఎగుర వేసిన గరుడకేతనాన్ని క్రిందికి దించుతారు, అంటే ధ్వజావరోహణం చేస్తారు. అంటే గరుడకేతనం ఎగురవేయడంతో సకల దేవతలకు ఆహ్వానంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై గరుడకేతనం దించడంతో వారికి వీడ్కోలు పలకడంతో ముగుస్తాయి.

ఈవిధంగా జరిగే బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవంతో జగమంతా పులకిస్తుంది.

*ఏడుకొండలవాడా గోవిందా! గోవిందా!! గోవిందా!!!*



# శ్రీనారాపురవేంకటేశ్వర స్వామి ఆలయం, జమ్మలమడుగు

- శ్రీ సిఎస్సార్ ఇటుగుళ్లపాటి

కలియుగ ప్రత్యక్ష దైవమైన **శ్రీవేంకటేశ్వరస్వామి శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామి** పేరుతో కొలువుదీరి జమ్మలమడుగులో అశేష భక్తుల ఆరాధనలు అందుకుంటున్నాడు.

కడప జిల్లాలో, కడప నగరానికి 75 కిలోమీటర్ల దూరంలో జమ్మలమడుగు ఉంది. పూర్వం ఈ ప్రాంతంలోనే నీటిమడుగులో జంబుగడ్డి అధికంగా పెరుగుతూ ఉండడం వల్ల ఈ పట్టణానికి **'జంబులమడుగు'** అనే పేరు ఏర్పడి, కాల క్రమంలో **'జమ్మలమడుగు'**గా మారినట్లు కథనం.

## స్థలపురాణం

జమ్మలమడుగులోని ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారు కొలువుదీరడానికి సంబంధించిన, స్వామివారికి శ్రీ నారా పుర వేంకటేశ్వరస్వామి అనే పేరు రావడానికి వెనుక ఆసక్తి కరమైన స్థలపురాణగాథ ప్రచారంలో ఉంది.

జమ్మలమడుగులోని ఆలయానికి ఉత్తరదిశలో పూర్వం ఒక గ్రామం ఉండేది. ఆ గ్రామం పేరు నారాయణపురం. ఆ గ్రామం అగ్రహారంగా పేరు పొందింది. ఆ గ్రామంలో ఒక వేంకటేశ్వర ఆలయం, దాని పక్కనే కోనేరు ఉండేది. గ్రామంలోని ప్రజలు స్వామిని సేవిస్తూ, దైవభక్తిపరాయణులై జీవనం సాగిస్తూ ఉండేవారు. అయితే గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకున్నాయి. విపరీతంగా వీస్తూ ఉండే గాలుల ఫలితంగా ఆ గ్రామమంతా ఇసుక మేటలు వేయడం ప్రారంభ మైంది. రాను రానూ ఇసుక గ్రామంలో మేటలు వేసి నివాసా లకు ఉపయోగం లేకుండా ఆ గ్రామం తయారైంది. దీనితో ప్రజలు గ్రామం వదిలి వెళ్ళిపోయారు. నారాయణపురంలోనే శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం కూడా ఇసుక తిన్నెల్లో మునిగి పోయి క్రమంగా శిథిలమైపోయింది. నారాయణపురం ఖాళీ చేసి జమ్మలమడుగులో నివాసం ఏర్పాటు చేసుకున్న నారా పురయ్య దైవభక్తి పరాయణుడు. నిత్యం దైవచింతనతో కాలం గడుపుతూ ఉండేవాడు. అటువంటి నారాపురయ్యకు ఒకనాడు రాత్రి స్వప్నంలో శ్రీవేంకటేశ్వరస్వామి సాక్షాత్కరించి- ***"నేను నారాయణపురంలో ఇసుక తిన్నెలలో పూడిపోయి ఉన్నాను. నన్ను బయటకి తీసి ఈ ప్రాంతంలో ఆలయం నిర్మించి నన్ను తెచ్చి ప్రతిష్ఠించు. నీకు మంచి జరుగుతుంది"*** అని పలికాడు.

మరునాడు నారాపురయ్య తన స్వప్నవృత్తాంతాన్ని చుట్టుపక్కల వారికి వివరించి నారాయణపురం చేరుకొని, ఇసుక తొలగించి అందులో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారిని తీసుకుని వచ్చి ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించి స్వామివారిని ప్రతిష్ఠించినట్లు స్థలపురాణం వెల్లడిస్తూ ఉంది.

నారాయణపురం నుంచి తెచ్చిన వేంకటేశ్వరుడు కావడం వల్లా, అలాగే నారాపురయ్య ప్రతిష్ఠించిన దేవుడు కావడం వల్ల స్వామివారికి **నారాపురవేంకటేశ్వరస్వామి** అనే పేరు ఏర్పడినట్లు ఐతిహ్యం.

## చరిత్ర

చారిత్రకంగా పరిశీలిస్తే విజయనగర సామ్రాజ్యాని కంటే ముందే నిర్మించబడినట్లు తెలుస్తోంది. అయితే విజయ నగరచక్రవర్తుల పాలనలోనే ఆలయ అభివృద్ధి జరిగింది. విజయనగర చక్రవర్తుల సామంతులు గండికోటను రాజధానిగా



చేసుకొని పరిపాలించిన పెమ్మసాని వంశస్థులు ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేసినట్లు ఆధారాలు వెల్లడిస్తున్నాయి. అయితే కాలక్రమంలో ఆలయం శిథిలావస్థకు చేరుకోగా 1918లో ఆలయంలో జీర్ణోద్ధరణ చేసి పూర్వవైభవాన్ని పునరుద్ధరించారు. ప్రస్తుతం ఆలయం **2008 నుండి తిరుమల తిరుపతి దేవస్థానం** వారి ఆధ్వర్యంలో నడుస్తోంది.

## ఆలయ విశేషాలు

జమ్మలమడుగు పట్టణంలో శ్రీనారాపురవేంకటేశ్వర స్వామివారి ఆలయం విశాలమైన ప్రాంగణంలో ఉంది. ఉత్తరాభి ముఖంగా ఉండే ఈ ఆలయ ప్రధానప్రవేశద్వారంపై మూడు అంతస్తుల గాలిగోపురం నిర్మించబడి ఉంది. ఈ గోపురద్వారం ద్వారా ఆలయప్రాంగణంలోనికి ప్రవేశిస్తూనే విశాలమైన ప్రాంగణంలో ప్రధాన ఆలయం దర్శనమిస్తుంది. ప్రధాన ఆలయానికి ముందు బలిపీఠం, ధ్వజస్తంభం, గరుడమండపం ఉన్నాయి. ధ్వజస్తంభానికి ఇరువైపులా **శ్రీగరుత్మంతుడు, శ్రీఆంజనేయస్వామి** వార్ల భారీ విగ్రహాలు నమస్కార భంగిమలో



కొలువుదీరి దర్శనమిస్తాయి. ఇక ప్రధానాలయం– రంగ మండపం, ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగివుంది. ప్రధాన గర్భాలయంలో **శ్రీనారాపురవేంకటేశ్వర స్వామి** కొలువుదీరి ఉన్నారు. స్వామివారు రూపురేఖా విలాసాలలో తిరుమల స్వామివారిని పోలి **శంఖు, చక్ర, వరద, కటి హస్తాలతో** విశేషమైన అలంకారాలతో దర్శనమిస్తారు. ఆలయ ముఖమండపంలో ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉన్న రెండు గర్భాలయంలో స్వామివారి దేవేరులు **శ్రీమహాలక్ష్మి, శ్రీఆండాళ్** అమ్మవారలు కొలువుదీరి ఉన్నారు. శ్రీమహాలక్ష్మీదేవి ఆసీనురాలై, చతుర్భుజాలతో రెండుచేతులలో పద్మాలు ధరించి, మరో రెండు చేతులలో అభయవరదముద్రలను ధరించి కొలువుదీరి దర్శన మిస్తారు. శ్రీఆండాళ్ అమ్మవారు ద్విభుజాలను కలిగి ఒక చేతిలో పద్మాన్ని ధరించి, మరోచేతిని కిందికి వదిలి మనోహరరూపంతో దర్శనమిస్తారు. ఇంకా ఆలయప్రాంగణంలో **శ్రీఆంజనేయ స్వామి, ఆళ్వారులు, కల్యాణమండపం, శ్రీవేంకటేశ్వర కోటిలేఖన మండపం** వంటి వాటిని భక్తులు దర్శించుకోవచ్చు.

## పూజలు, ఉత్సవాలు

ప్రతిరోజూ పూజలు జరిగే జమ్మలమడుగు శ్రీనారాపుర వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం **వైశాఖ శుద్ధ ఏకాదశి మొదలుకొని వైశాఖబహుళ షష్ఠివరకు** జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో వివిధవాహనసేవలు, స్వామివారి కల్యాణం, రథోత్సవం అంగరంగవైభవంగా జరుగుతాయి. ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశి, వివిధ పర్వదినాల సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయి.

## రవాణా, వసతి సౌకర్యాలు

జమ్మలమడుగులోని భక్తులకు వసతి సౌకర్యం లభిస్తుంది. కడప నుంచి 75, ప్రొద్దుటూరు నుంచి 21 కి.మీ. దూరంలో ఉన్న జమ్మలమడుగుకు కడప, ప్రొద్దుటూరు, అనంతపురం, హైదరాబాద్, కర్నూలు, నంద్యాల, తిరుపతి, విజయవాడ, చెన్నై, బెంగళూరుల నుంచి సరాసరి బస్సు సౌకర్యాలు ఉన్నాయి. యర్రగుంట్ల– నంద్యాల రైలు మార్గంలో ఉన్న జమ్మలమడుగులో అన్ని రైళ్ళు ఆగుతాయి.

మహిమాన్విత దేవుడుగా పేరు పొందిన **జమ్మలమడుగు శ్రీనారాపురవేంకటేశ్వరస్వామి** వారిని దర్శించి భక్తులు తరించవచ్చు.

*గత సంచిక తరువాయి భాగం....*

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్

తెలుగు- శ్రీదేవీ మురళీధర్

ఉడయవరుల మఠం సమీపానికి ఊరేగింపు వస్తున్నదనగా ఆచార్య సార్వభౌములు తమ ప్రియశిష్యుడు అక్కడ లేకపోవటం చూసి 'వడుగా, ఎక్కడ ఉన్నావు? శ్రీరంగప్రభువు మఠం దగ్గరకు వేంచేయనున్నారు. తక్షణమే వచ్చి దర్శించుకొమ్మ'ని కేక వేశారు. తక్షణమే లోపల నుండి ఇలా సమాధానం వచ్చింది- 'శ్రీరంగరాజన్ వస్తున్నారని నాకూ తెలుసు. మీ భగవానుని చూడటానికి నేను వస్తే ఇక్కడ నా భగవానునికి పాలు కాగబెట్టి, చల్లార్చి, సిద్ధం చేసేదెవరు?'

ఆహా, ఎటువంటి ఆచార్యనిష్ఠ ! వడుగనంబి వంటి వందనీయుడైన ఉత్తమ శిష్యునికి, అతడు పుట్టిన పుణ్యభూమి మేల్నాడుకు శతసహస్ర వందనాలు.

రామానుజాచార్యులు వడుగనంబి అకళంక వ్యక్తిత్వం, భక్తిశ్రద్ధలు, గురుభక్తిని, ఆచార్యాభిమానాన్ని ఒక గొప్ప ఉదాహరణగా ప్రపంచానికి పరిచయం చేయదలచి వేలమంది ఆస్తికజనులు కూర్చున్న ఒకానొక గోష్ఠిలో వడుగనంబిని చేర బిలిచి ఉచ్చస్వరంలో అందరికీ వినబడేటట్లు 'గొప్ప శిష్యుడికి ఉండవలసిన లక్షణాలేమిటి?' అని ప్రశ్నించారు.

సమాధానంగా వడుగనంబి వెంటనే శ్రీ తిరుమంగై ఆళ్వారుల ద్రావిడ ప్రబంధం 'పెరియ తిరువాయ్‌మొళి'లోని (11.8.7) పాశురాన్ని కంఠోపాఠంగా ఉదాహరించారు: *(వెంబిన్ పుళ్..)* దీని భావం – వేపచెట్టును ఆశ్రయించిన గొంగళిపురుగు ఏ విధంగానైతే వేపకాయలను మాత్రమే భుజిస్తుందో, నాకును నీ చరణాల మ్రోల శరణము తప్ప వేరేమీ వద్దు'.

వడుగనంబిని 'యతిరాజు రామానుజాచార్యుల మధురకవి'గా సమ్మానిస్తారు. యతిరాజు శరీరత్యాగం చేసినప్పుడు వడుగనంబి వారి సమీపాన నిలిచియున్నాడు. తరువాత సాలిగ్రామానికి తిరిగి వచ్చి 92 ఏళ్ల వయస్సు దాకా జీవించి ఆచార్య పదసన్నిధికి చేరుకున్న ధన్యుడు.

శ్రీకరస్వామి వడుగనంబి పుణ్యచరిత్ర శిష్యులకు వివరించిన తరువాత యాదగిరి భట్టర్ అందుకుని 'రండి, శ్రీరామానుజుల శ్రీపాదాలను దర్శించి, శ్రీపాదతీర్థం సేవించుకుందురుగాని' అని పిలిచాడు. అక్కడి నుండి బయటకు రాగానే రెండు చిన్న సన్నిధులు కనబడతాయి. అవి వడుగనంబి, ముదలియాణ్డాన్- ఈ ఇద్దరి స్మృతిలో వెలసినవి. వారిద్దరూ తమ ఆచార్యులను అనన్యరీతిలో సేవించిన శిష్యరత్నాలు. సన్నిధి తాళం వేసుకుని భట్టర్ నిష్క్రమించాక, నారదుడు గంధర్వులను తీసుకుని సన్నిధులలో ఏకాంతసేవ నిర్వర్తించాడు. గంధర్వులు అక్కడ విన్న స్థలపురాణం, శ్రీకరస్వామి వివరించిన వడుగనంబి చరిత్ర విని ఎంతో ఆనందాన్ని పొందారు. వడుగనంబి వంశస్థులే నేటికీ అక్కడ సన్నిధిలో సంరక్షణ, సేవలు నిర్వర్తిస్తున్నారని చెబుతారు.

*(ఇంకా ఉంది)*

భారతీయ గణితము

# సంఖ్యాపద్ధతి మరియు సంకేతములు

- ఆచార్య వి. రమేష్ బాబు, 94912 71729

భారతీయజ్ఞానపరంపరయందు గణితశాస్త్రముయొక్క ఔన్నత్యము విస్తృతమైనది. ప్రాచీనకాలములో గణితశాస్త్రము జ్యోతిషశాస్త్రాంతర్గతమైయున్నదే కాని ఒక ప్రత్యేక శాస్త్రముగ రూపుదిద్దుకోలేదు. ఆ కాలములో గణితము అనగా జ్యోతిష శాస్త్ర సంబంధమగు గణితములను గ్రహములను సాధించుట కొరకే. కాలక్రమములో సమాజమునందు లౌకికమైన వ్యవహారములనుసరించి 'గణితశాస్త్రము' వేరుగ ఏర్పడింది. ఈ గణితశాస్త్రంలో 'సంఖ్య' ముఖ్యం. సంఖ్యయొక్క ప్రాధాన్యత వర్ణనాతీతము. ఎందుకనగా సంఖ్యలేనిదే గణితశాస్త్రముయొక్క ప్రవృత్తియే కనబడదు. వ్యవహారములో సంఖ్యాక్రమము అపరిమితము, కాబట్టి ఈ సంఖ్యలనుండియే సంఖ్యాక్రమము ఏర్పడింది. ప్రస్తుత లోకవ్యవహారములో ఈ సంఖ్యాక్రమము ఒకటిగ మొదలుకొని ఏడు శూన్యముల (సున్న) వరకు అనగా **'కోటి'** వరకే ఉన్నవి. పాశ్చాత్యక్రమంలో ఒకటి నుండి పన్నెండు సున్నల వరకు అనగా **'ట్రిలియన్'** వరకు సంఖ్యాక్రమం ఉంది. ఈ రెండు విధములలోకూడ కోటివరకుగాని, ట్రిలియన్‌వరకు గాని మధ్యగల సంఖ్యలకు వేరుగ సంజ్ఞను కల్పించలేదు. మన భారతీయ ప్రాచీనగణితశాస్త్రజ్ఞులు ఈ సంఖ్యాక్రమమును ఒకటి మొదలు 17 శూన్యముల (సున్నా) వరకు అనగా **'పరార్ధము'** వరకు ప్రత్యేకస్థానమునకు సంజ్ఞలను చెప్పియున్నారు. ఆ సంజ్ఞలనే **భాస్కరాచార్యులు** తన **'లీలావతి'** గ్రంథముయందు ఈ విధముగ వివరించియున్నారు.

**ఏక-దశ-శత-సహస్రాయుత-లక్ష-ప్రయుత-కోటయః క్రమశః।**
**అర్బుదమబ్జం ఖర్వనిఖర్వమహాపద్మశంకవస్తస్మాత్॥**
**జలధిశ్చాంత్యం మధ్యం పరార్ధమితి దశగుణోత్తరాస్సంజ్ఞాః।**
**సంఖ్యాయాః స్థానానాం వ్యవహారార్థం కృతాః పూర్వైః॥**

ప్రాచీనులచే సంఖ్యాలేఖనము, సంఖ్యాపఠనము మొదలైన వాటి కొరకు **ఏక, దశ, శత, సహస్ర, అయుత, లక్ష, ప్రయుత, కోటి, అర్బుద, అబ్జ, ఖర్వ, నిఖర్వ, మహాపద్మ, శంకు, జలధి, అంత్య, మధ్య, పరార్ధ** అని సంఖ్యానీకముయొక్క ఏకాదిస్థానములకు దశగుణోత్తరము (ఒకదానికంటె మరియొక సంఖ్య పదిచే గుణింపబడినది) అగు సంజ్ఞలు చేయబడినవి.

1=ఏక=ఒకటి=తదితరపదార్థ సంబంధములేనిది

10=దశ=పది=పదిచే గుణింపబడిన ఒకటి

100=శత=నూరు (లేక వంద)=పదిచే గుణింపబడిన పది

1000=సహస్ర=వేయి=పదిచే గుణించబడిన నూరు

10000=అయుత=పదివేలు=దశగుణిత సహస్రము
(పదిచే గుణింపబడ్డ వేయి)

100000=లక్ష=దశగుణితమగు అయుతము.
(పదిచే గుణించబడిన పదివేలు)

ఇదే విధంగా-

1000000=ప్రయుత=దశగుణితమగు లక్ష=పదిలక్షలు
(పదిచే గుణింపబడ్డ లక్ష)

10000000=కోటి=దశగుణిత ప్రయుతము
(పదిచే గుణింపబడిన పదిలక్షలు)

### వైకుంఠపాళి
### :: 104 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వి | శ్వా | 2 మి | త్ర | | 3 జాం | 4 బ | వం | 5 త |
| చా | | న్న | | 6 సం | | కం | | ల |
| 7 ర | శ్మి | | 8 మ | ద | ము | | 9 రి | పు |
| ము | | 10 కం | | కం | | 11 వి | | లు |
| | 12 సే | తు | వు | | 13 సు | ర | స | |
| 14 శి | | డు | | 15 స | | సం | | 16 త |
| 17 వ | ల | | 18 అ | మి | షం | | 19 హా | రం |
| చా | | 20 బా | | ధ | | 21 కా | | గ |
| 22 పం | చ | వ | టం | | 23 త | రం | త | ము |



ప్రాచీనకాలంలో గణితశాస్త్రం జ్యోతిషశాస్త్ర అంతర్గతమైనది

100000000=అర్బుదము=దశగుణిత కోటి

(పదిచే గుణింపబడ్డ కోటి)

1000000000=అబ్జము=దశగుణితార్బుదము

(పదిచే గుణించబడిన పదికోట్లు)

ఇట్లు క్రమముగా దశగుణోత్తరములగు సంఖ్యలకు ఖర్వ, నిఖర్వ, మహాపద్మ, శంకు, జలధి, అంత్య, మధ్య, పరార్థ అను పదునెనిమిది స్థానసంకేతములు చేయబడినవి. ఇవి ఒక పంక్తియందు కుడివైపు నుండి ఎడమవైపునకు, ఒకటి మొదలు పదునెనిమిది వరకు వ్రాయబడిన అంకెలయొక్క స్థానములకు సంజ్ఞలగుచున్నవి. వీటివలన ఎంతటి సంఖ్యలనైనను సులభముగ వ్రాయుటయు (సంఖ్యాలేఖనము), చదువుటయు (సంఖ్యాపఠనము)ను చేయవచ్చును. ఎట్లంటే ఉదాహరణకు 2497– ఇక్కడ కుడివైపునుండి క్రమముగా ఒకటవ సంఖ్య మొదటస్థానాన్ని, రెండవసంఖ్య పదవస్థానాన్ని, మూడవసంఖ్య వందల, నాల్గవసంఖ్య వేలస్థానాన్ని తెలియజేయుచున్నవి. కావున పై స్థానక బోధకసంజ్ఞలను కంఠస్థము చేయాలి. దీన్ని చదివేటప్పుడు 2 సహస్రముల, 4 నూర్ల, 9 పదుల ఏడు (రెండువేల నాలుగు వందల తొంబది ఏడు) అని చదవవచ్చు. ఇట్లు సంఖ్యానీకమును చదువుట, స్థానసంజ్ఞలను కంఠస్థము చేయుటచే సులభమగుచున్నది.

ఉదా: 7054302 ఈ సంఖ్యను ఇలా చదవవచ్చు.

ఒకటవ స్థానమునుండి ఎడమవైపున ఏస్థానమున ఏ అంకె గలదో గుర్తించాలి.

ఇక్కడ ఒకటవ స్థానమున రెండుగలదు

ఇక్కడ పదవ స్థానమున శూన్యము(సున్న)

ఇక్కడ నూరవ స్థానమున మూడు

ఇక్కడ వేల స్థానమున నాలుగు

ఇక్కడ అయుత(పదివేల)స్థానమున ఐదు

ఇక్కడ లక్ష స్థానమున శూన్యము (సున్న)

ఇక్కడ ప్రయుత (పదిలక్షల) స్థానమున ఏడు

కావున 7054302 ఈ సంఖ్యను ఏడు ప్రయుతముల ఐదు అయుతముల నాలుగు సహస్రముల మూడు శతకముల రెండు.

ఇట్లా కూడా చదవవచ్చు–డెబ్బది లక్షల ఏబది నాలుగువేల మూడువందల రెండు.

## మంచిమిత్రుని లక్షణం

**పాపాన్నివారయతి యోజయతే హితాయ**
**గుహ్యం నిగూహతి గుణాన్ ప్రకటీకరోతి।**
**ఆపద్గతం చ న జహాతి దదాతి కాలే**
**సన్మిత్రలక్షణమిదం ప్రవదన్తి సన్తః॥**



'మిత్రుడనేవాడు తన స్నేహితుని పాపపు పనుల నుండి మరలిస్తాడు, అతడి హితవు కోరి చేస్తాడు. అతడి రహస్యాలు బయటకు తెలుపడు. అతడికి ఉన్న మంచి గుణాన్ని ఎత్తి చూపి ప్రోత్సహిస్తాడు. అతణ్ణి ఆపదలో వదలిపెట్టిపోడు. అతడు కష్టాలలో ఉన్నప్పుడు సహాయం చేస్తాడు' అని మంచి మిత్రుని లక్షణంగా చెప్పవచ్చు.

ఈ విధంగా సంఖ్యానీకమును వ్రాసేటప్పుడు ఏయే స్థానములందు ఏయే అంకెల(సంఖ్య)గలవో ఆయా స్థానములందు ఆయా అంకెలను, అంకెలులేని స్థానములందు శూన్యములను (సున్న) వ్రాయవలయును. ఉదా: ఎనిమిది లక్షల మూడువందల ఆరు దీనిని వ్రాయుము.

లక్ష ఆరవస్థానమందలిది. కావున ఈ సంఖ్యానీకము నందు ఆరు అంకములు(సంఖ్యలు) మొదట గుర్తించుకోవాలి. ఆ స్థానమున 8 అంకె గలదు. అయుత సహస్రస్థానములందు అంకములు చెప్పబడలేదు. శతస్థానమున 3 అంకె గలదు. దశ స్థానమున అంకె చెప్పబడలేదు. ఏక స్థానమున 6 అంకె చెప్పబడెను. కావున ఎడమవైపునుండి అంకెలుగల స్థానములలో అంకెలను, అంకెలు లేని స్థానములలో శూన్యములను నింపుము. ఇట్లుజేయగా 800306 ఇట్లు వ్రాయబడును. ఇట్లు శీఘ్రముగ చదువుటయు వ్రాయుటయు "ఏకదశశత..." ఇత్యాది శ్లోకద్వయము కంఠస్థం చేస్తే ఏ స్థానమున ఏ అంకె గలదో బుద్ధికి స్ఫురించుటచే తన ఇష్టప్రకారము సులభముగ చెప్పవచ్చును.

సెప్టెంబరు *20* ***ఉండ్రాళ్ల తదియ*** సందర్భంగా...

# అభీష్టసిద్ధి ప్రదాయకం

– శ్రీమతి సుధా మాధురీ కార్తిక్

ఉండ్రాళ్లు అనగానే విఘ్నేశ్వర దండకం మన మదిలో మెదులుతుంది. ***'నీకు టెంకాయ, పొన్నంటి పండ్లున్, మరి న్మంచివౌ నిక్షు ఖండంబులు, ....... బెల్లమున్, తేనె, జున్ను, బాలాజ్యమున్ నాను బియ్యంబు'*** అంటూ నైవేద్య నీరాజనాలందిస్తాం. మంగళహారతుల వేళ ***'ఓ బొజ్జ గణపయ్య! నీ బంటు నేనయ్య'*** అని కొనసాగిస్తాం. ఈ సందర్భంలో మనమందరం నిర్వర్తించే ఉండ్రాళ్ల తద్ది గురించి మరింత వివరం తెలుసుకోవాల్సి ఉంది.



పండుగలు, పూజలు, నోములు మన ధర్మ, సంప్రదాయాలకు నిదర్శనాలు. ***'ఉండ్రాళ్లు/ మోదకాలు/ కుడుములు/ లడ్డూరూపాలు...'*** ఇలా అన్నింటినీ సరిసమాన అర్థాలతో పరిగణిస్తుంటాం. గుండ్రని రూపులోని వాటిని 'ఉండె'గా భావించడం సర్వసాధారణం.

***'దండాలయ్యా ఉండ్రాలయ్యా'*** అంటూ స్వామి అండ దండలుండాలని, దయుంచి ఆయన దోవ చూపించాలని, పిండి వంటలు ఆరగించి, తొండమెత్తి దీవించాలనీ ప్రతీ ఒక్కరం ప్రార్థిస్తాం. ***'ఉండ్రాళ్ల తదియ'***నే ***'మోదక తృతీయ'*** అనడం పరిపాటి. పక్షం రోజుల్లో మూడోతిథి తదియే కాబట్టి. అధిదేవతగా గౌరీదేవిని భావిస్తారు. అభిమతాలను నెరవేర్చే ఆ తల్లిని వనితలు కోరేది మనసుకు తగిన మనువును ప్రసాదించాలని. ***'సర్వ మంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే/ శరణ్యే త్రయంబకే గౌరీ నారాయణి నమోస్తు తే'*** అని కదా మహాగౌరీమంత్ర సారాంశం.

ఇంటిని, మామిడి ఆకుల తోరణాలతో, ముగ్గులతో అలంకరించి, పూలూ, పత్రాలతో దైవపీఠాన్ని తీర్చి దిద్ది, ధూపదీప నైవేద్యాల సమర్పణతో పూజించడంలోనే ధార్మికత గుబాళిస్తుంది. గౌరీ సమర్చన అయ్యాక, ***'ఉండ్రాళ్ల తద్దె'*** కథన పఠనం అమంద ఆనందం కలిగిస్తుంది. పళ్లెంలో పచ్చి ఉండ్రాళ్లు తదితరాలను ఉంచి నైవేద్యమివ్వడంతో ఆశీస్సుల ప్రసరణ అనుభూతి ఏర్పడుతుంది. ఉండ్రాళ్ల తద్దికి, అటు తర్వాత నిర్వహించుకునే అట్ల తద్దెకి ఎంతైనా అవినాభావ సంబంధముంది. ఈ రెండింటి అంతరార్థం ఒకటే.

'ఉండ్రాళ్లతద్ది' ప్రధానంగా రెండు రోజుల పర్వ దినోత్సవం. ఉపవాసం తదుపరి, సాయంవేళ పూజకు అంతా సిద్ధపరచుకుంటారు అతివలు. ఉండ్రాళ్లు, చలిమిడి సహా తీపి పదార్థాలనేకం తయారుచేసుకుంటారు. పసుపుతో రూపుదిద్దిన వినాయక స్వామిని, గౌరమ్మను అర్చించుకుంటారు. పూజాదికాలు అయ్యాక, పసుపు- కుంకుమలతో పాటు ఉండ్రాళ్లను సైతం వాయనరూపంగా అర్పిస్తారు. విద్యాధినేత గణపతిని, సర్వసౌభాగ్యప్రదాత గౌరీదేవిని ఎంతగానో వేడుకుంటారు. ఉండ్రాళ్ల తద్దిని ఆరోగ్యచద్దిగానూ భావించవచ్చు. పలు విధాల అనారోగ్యాలను దూరంచేసే వైద్య విషయాలు అనేకం కనిపిస్తాయి ఈ పర్వదినోత్సవంలో!



అత్యంత విశేషం ఏమిటంటే, ఈ రోజున వాయనస్వీకారం సాక్షాత్తు పార్వతీమాత చేతులమీదుగా జరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆమెను, ఆ అనేక రూపాలను **సౌందర్యలహరి** సహా **లలితా సహస్రనామ; శ్రీదేవీ ఖడ్గమాలా** స్తోత్రాలు శ్లాఘిస్తున్నాయి. **చండీ సప్తశతి, అన్నపూర్ణ అష్టకం** కూడా కొనియాడుతున్నాయి. ***'ఓం శ్రీమాతా శ్రీ మహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ/ చిదగ్నికుండ సంభూతా దేవకార్య సముద్యతా'*** అని కీర్తిస్తోంది స్తోత్రపాఠం. పార్వతి తనయా పరుగున రావా! అనీ ప్రార్థిస్తుంది భక్తహృదయం.

**'సర్వేషాం వినాయకానుగ్రహ ప్రాప్తిరస్తు'** అనుకున్నపుడు ప్రతీ మనోమందిరాన వీణలు మధురాతి మధురంగా మోగుతాయి. *గౌరీపుత్రా, మోదకహస్తా గజాననా, శక్తి సుపుత్రా, లోకపూజితా, భక్తవత్సలా, మంగళదాయకా...* ఇలా అనేకానేక స్తుతుల పరంపరలు. ***'మోదకోజ్జ్వల బాహు మూషికోత్తమ'*** అంటూ నమోవాకాలు సమర్పిస్తుంది భక్తకోటి. పాలనశక్తి, ధీయుక్తి, సమున్నతి, బలోద్ధృతి నిండిన గణపతి దేవుణ్ణి తలచినదే తడవుగా మహదానందం ఉప్పొంగుతుంది.

శ్రీశంభు తనయుడు, సిద్ధి గణనాథుడు, వాసిగల దేవతావంద్యుడు, విద్యాబుద్ధులకు ఆదిగురువుగా విఘ్నేశునికి నిఖిల లోకమూ ప్రణామాలందిస్తుంది. ఉండ్రాళ్ల తదియ తరుణాన అన్నింటా అంతటా మంత్రశక్తిఘనత అనుభవమవుతుంటుంది. అక్షరీకృత మంత్రమన్నది అన్ని శక్తి కేంద్రాలనూ ప్రభావితం చేయగలిగినది. అంతర్గత పటిమను త్రిగుణీకృతం చేసి ముందుకు నడిపించి తీరుతుంది. గౌరీసప్తస్తుతి ప్రక్రియ విశదీకరించినట్లు – ***'గజారణ్యే పుణ్యే శ్రితజన శరణ్యే భగవతీ జపావర్ణాపర్ణా తరళతర కర్ణాంత నయనా'*** అంటుంది **సప్త శ్లోకీ**లలో ఒకటి. స్వామిసేవాఫలంగా సర్వాభీష్టసిద్ధి సుసాధ్యమని చెప్తుంది నోముకథనం. వీటన్నింటితో ఆధ్యాత్మిక, ఆనందం, కుటుంబశ్రేయం సిద్ధిస్తాయని అనుభవాలు విపులీకరిస్తున్నాయి. వ్రతకథ చదువుకుని అక్షింతలు వినియోగించుకోవడం ప్రధానం.

ఉండ్రాళ్ల తద్దె విశిష్టతను **పరమేశుడే పార్వతీదేవికి** వివరించాడని పురాణ కథాంశం. **విఘ్ననాథుడిని పూజించి కుడుముల నైవేద్యం** సమర్పించడం, అనంతర క్రియలో భాగంగా **దుర్గాదేవికి పదహారు ఉండ్రాళ్లను** నివేదించడం కీలక అంశాలు. అందుకే ఈ వ్రతాన్ని **పదహారు కుడుముల పండుగగా** సంభావిస్తారు. **షోడశఉమావ్రతంగానూ** పిలుస్తుంటారు. వినాయక స్వామివారిది బాల మనస్తత్వం. **కుడుములు/ ఉండ్రాళ్లు, అటుకులవంటి** పదార్థాల సమర్పణకే సంతోషించే కరుణా కటాక్ష వీక్షణాలు ఆయనవి. షోడశ అనడంతో సంస్కారాలు తలపులోకి వస్తాయి. అవన్నీ ఆగమ సంబంధాలు. వాటిల్లో వివాహం ఒక భాగం. ఆ రీత్యా గౌరీ వ్రత/ నోము విధానాలు ప్రత్యేకత సంతరించుకున్నాయి. పరిపూర్ణ భాగస్వామి కోసమే వాటి సమాచరణం. దివ్యశక్తి, మాతృదేవత అయిన పార్వతిమంత్రపఠనం అందు గురించే. ***'కాంచీ కంకణ హారకుండల ..... కోటి కోటి సదనా'*** అంటూ నమస్కృతులర్పిద్దాం. **'ఉండ్రాళ్ల పండుగ'** విలక్షణతను ప్రస్ఫుటపరచే స్తోత్రనిధి పఠనాలూ, శ్రవణాలతో జీవితాలను చరితార్థం చేసుకుందాం. అదేవిధంగా– **'సర్వవిఘ్నహరం దేవం సర్వసిద్ధిప్రదాతారం వందేఽహం గణనాయకం'** అని స్వామిని పూజించి పునీతులవుదాం.

***శుభం భవతు.***

శ్రీవేంకటేశ్వరలీలలు



# శ్రీవారి కృపావిశేషం

- శ్రీమతి రూపనగుడి అనూరాధ, 97011 24844

శ్రీవారి కృపావిశేషాన్ని తెలియజేసే నా చిన్ననాటి సంఘటన. మా నాన్నగారు కాకినాడలో జ్యుడిషియల్ ఆఫీసర్ గా పని చేస్తూ ఉండేవారు. వారి పేరు శ్రీమంథా శ్రీనివాసరావు. వారికి న్యాయమూర్తిగా మంచి పేరు, ప్రతిష్ఠలు ఉండేవి. అంతే కాదు న్యాయశాస్త్రానికి సంబంధించిన అనేక పుస్తకాలు వ్రాసేవారు. వారు వ్రాసిన పుస్తకాలు ముద్రించిన వెంటనే తిరుమల శ్రీవారిసన్నిధిలో పూజ చేయించిన తర్వాతనే విక్ర యించేవారు. ఆ పుస్తకవిక్రయరూపేణా వచ్చిన ధనం మాకు అనేక శుభకార్యాలకు ఉపయోగపడేవి. అలా ఆ రోజుల్లో ఒక న్యాయపుస్తకం మా నాన్నగారు వ్రాశారు, ముద్రించారు. ఆ సందర్భంలో శ్రీవారి దర్శనం చేసుకోవాలని అనుకున్నారు. ఆ సమయంలో మా నాన్నగారి స్నేహితుల కుటుంబాలు కొన్ని బస్సు ఏర్పాటు చేసుకొని తిరుమల వెళ్లాలని సంకల్పించు కున్నారు. మేము కూడా వెళ్లడానికి నిర్ణయించుకున్నాం.

కుటుంబం అంతా వెళ్లాలంటే డబ్బు అవసరం. ఆనాడు పెద్ద కుటుంబాలు. ఖర్చులు అధికం. బంధువుల రాకపోకలు కూడా ఉండేవి. డబ్బుల కొరకు అప్పులు చేయడం, ఆ అప్పులు తీర్చడానికి మా ఇంట్లో ఎంతోకాలంగా పూజ కోసం ఉపయోగి స్తున్న వెండి కంచం ఒకటి అమ్మేశారు. అలా వెండి కంచంతో మాకు ఋణం తీరిపోయింది.

సమయం కలిసి రాకపోవడంతో మా ప్రయాణం రద్దయింది. మాకు ఆ వెంకన్న అనుగ్రహం కలుగలేదని నిరాశ కలిగింది. చిన్న వయసు, ఆపై ఆశ నిరాశ కావటం, స్వామిపై కొంచెం అలక కలిగింది.

'కమలాకుచ చూచుక కుంకుమతో.......... విజయీ భవ వేంకట శైలపతే' ఇలా మనోహరమైన ఆ స్వామి స్తోత్రాలు వినగలమని, ఆ తిరుమలవాసుని దర్శనం కల్యాణప్రదం అని ఆశించిన మా నాన్నగారు నిరాశ చెందారు. అయినా ఏదో ఒక చిన్ని ఆశ. ఒక సంవత్సర కాలం గడిచింది. నాన్నగారు రాసిన పుస్తకం అమ్ముడవడం, రావలసిన పైకం రావడం జరిగింది. ఆ భక్తవంతుని లీలలు ఆశ్చర్యకరం.

ఆరోజు శనివారం అని గుర్తు. కాకినాడ తరువాత విజయవాడలో మా నాన్నగారు న్యాయమూర్తిగా పనిచేసేవారు. మా క్వార్టర్స్ ముత్యాలంపాడు ప్రాంతంలో ఉండేది. ఆ ఉదయం తొమ్మిది గంటలకు మా కుటుంబ సన్నిహితులు ఇద్దరు పెద్దలు మా ఇంటికి వచ్చారు. వారు మాట్లాడుతూ "తమ బంధువులు, తాము కొన్ని కుటుంబాలు బస్సు వేసుకొని తిరుమలకు వెళ్తున్నాము" అని అంటూ, "కేవలం రెండు సీట్లు ఖాళీ ఉన్నాయి. మీరు డబ్బు కూడా ఇవ్వవద్దు. మీరు వస్తే బాగుంటుంది" అని ఎంతో అభిమానంగా పిలిచారు. మాకందరికీ ఆనందం. అదే శ్రీవారి అనుగ్రహ విశేషం.

మా తల్లిదండ్రులు తిరుమలవాసుని దర్శనం చేసు కున్నారు. ఆహా! అమోఘమైన తిరుపతి లడ్డు తింటూ ఉంటే మాకు కళ్ళల్లో నీళ్లు కలిగింది. అందుకే "వినా వేంకటేశం న నాథో న నాథః సదా వేంకటేశం స్మరామి స్మరామి" ఈ విధంగా మా తండ్రి గారికి కలిగిన అనుభూతి.

ఆ తరువాత మా నాన్నగారు కర్నూలులో జిల్లా జడ్జిగా ఉద్యోగం చేసేవారు. నేను శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో "తెలుగు వాఙ్మయంలో నృసింహావతారము" అన్న అంశంపై పరిశోధన చేశాను. ఆ సిద్ధాంత వ్యాసాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆధ్యాత్మిక పుస్తకంగా భావించి, ముద్రించ టానికి ఆర్థికసహాయం అందజేశారు. నేను మా నాన్న, అన్నగార్ల సహాయసహకారంతో ముద్రించాను. ఇలా స్వామివారి కృపా విశేషం అనేకసార్లు మాపై వర్షించింది. భక్తులకు కొంగు బంగారం అయిన కలియుగదైవం శ్రీ శ్రీనివాసునికి కైమోడ్పులు.

వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి॥

ఓం నమో వేంకటేశాయ

వేదవైభవం

# వేదశైలం

- డా॥ ఈ.ఎ. శింగరాచార్యులు,
98850 03420

**"వేదాలు పర్వతాల వంటివి"** అనే ఉపమానాన్ని పురస్కరించుకుని వేదవైభవాన్ని తెలిసికొందాం. ఇందుకోసం **కాఠకం, మార్కండేయపురాణం, అధికారసంగ్రహం, నిక్షేపరక్ష** మొదలైన గ్రంథాలనుండి కొన్నిప్రమాణాలను పురస్కరించుకొని, ఈ ఉపమానంలోని అందాన్ని, చమత్కారాన్ని గమనిద్దాం.

వేదాన్ని ఒకపర్వతంగా కాఠకం వర్ణిస్తున్నది. **"వేద శైలం"** అని మార్కండేయపురాణం అంటున్నది. **"ఆగమసాను మాన్"** అని యాదవాభ్యుదయంలో చెప్పబడింది. **"వేదవెఱ్పు"** అనేది అధికార సంగ్రహసూక్తి. **"నిగమగిరి"** అని నిక్షేపరక్షలోని సూక్తి. ఈ విధంగా ఒకేవిధమైన ఉపమానానికి పలుసూక్తులు గోచరిస్తున్నాయి.

వేదం ఏ ఏ రీతులలో పర్వతంతో పోలి ఉన్నది? అనే ప్రశ్నకు ఆయాచోట్ల సమాధానాలు కూడా కనిపిస్తున్నాయి. వాటిలో మొదటికారణం ఏమంటే, అది అడవిలో పెద్దదిగా ఉన్నది, ఉన్నతంగా ఉన్నది? అని. ఈ విషయం భరద్వాజ మహర్షికథ ద్వారా వేదమే మనకు తెలుపుతున్నది.

"భరద్వాజోహవైత్రిభిరాయుర్భిర్బ్రహ్మచర్యమువాస" అని ఈ కథ కాఠకంలో ఆరంభం అవుతున్నది. భరద్వాజమహర్షికి వేదాలను అభ్యసించడంలో అమితమైన ఆసక్తి ఉండేది. మూడువందలసంవత్సరాల ఆయుష్కాలాన్ని పొందిన ఆ మహర్షి తన ఆయుష్కాలమంతా వేదాధ్యయనంతోనే గడిపాడు. అతని ఆయుస్సు పూర్తి అయ్యే సమయానికి అతని శరీరం శిథిలమై, శక్తి తగ్గిపోయింది. అధ్యయనంచేసే సామర్థ్యం అతనికి లేకుండాపోయింది. అప్పుడు ఆ మహర్షి దగ్గరకు ఇంద్రుడు వచ్చి, "భరద్వాజమహర్షీ! మీకు ఇంకొక వందసంవత్సరాలు కాలం ఇచ్చినట్లయితే మీరు ఏమిచేస్తారు?" అని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా ఆ మహర్షి **"బ్రహ్మచర్యమేవైతే న చరేయమితి హోవాచ"** అని అంటూ నాలుగవ ఆయుష్కాలంతో కూడా నేను వేదాధ్యయనాన్నే చేస్తాను" అని అన్నాడు. అప్పుడు ఇంద్రుడు ఎదురుగా మూడుపర్వతాలను సృష్టించి వాటిని ఆ మహర్షికి చూపించి, ఆ మూడు పర్వతాలలో ఒక్కొక్క పర్వతం నుండి ఒక్కొక్క పిడికిలి ఇసుకను తీసుకొని, ఆ ఇసుకను చూపిస్తూ, ఈవిధంగా అన్నాడు. "భరద్వాజమహర్షీ! మీకు ఎదురుగా కనిపించే మూడుపర్వతాలే మూడువేదాలు. నేను చేతిలో గ్రహించిన ఇసుక ఉన్నది కదా! అంత పరిమితిలోనే మీరు ఒక్కొక్క వేదంనుండి అధ్యయనం చేయగలిగారు. ఇక, మీరు అధ్యయనం చేయవలసిన పరిమితిలోని వేదభాగం, ఇదిగో!, ఈ పర్వతాల పరిమితిలో ఉన్నది. ఇంతటి పెద్దపెద్దవి అయిన వేదాలను ఏ ఒక్కరు, తమ ఆయుష్కాలంలో పూర్తిగా అధ్యయనం చేయడం అనేది సాధ్యంకానిపని. "అనంతా వై వేదాః"- వేదాలు అనంతాలు. ఎల్లలేనిది. అందుచేత ఈ వ్యర్థప్రయత్నాన్ని మీరు విరమించండి. వేదాలకు సారాలైన కొన్నిమంత్రాలను ఉపదేశిస్తాను, గ్రహించండి" అని అన్నాడు. ఇంద్రుని మాటకు భరద్వాజమహర్షి అంగీకరించి, ఆవిధంగానే అతని దగ్గరనుండి వేదసారరూపాలైన మంత్రాలను గ్రహించాడు? అని ఈకథలోని విషయం.

ఈ కథ నుండి మనం గమనించవలసిన విషయం ఏమంటే? ఎంత గొప్పవిద్య అభ్యసించిన వాడైనా, అతడు నేర్చిన విద్యచాలా అల్పభాగమని, నేర్వవలసిన మిగిలిన భాగం చాలా అధికమని దీనివల్ల స్పష్టమవుతున్నది. వేదాలు ఎందువల్ల పర్వతాలవలె గొప్పవి? ఉన్నతమైనవి? అధికమైనవి? అని మొదలైన ప్రశ్నలకు ఈకథ సమాధానాలను తెలుపుతున్నది.

వేదాలు పర్వతాలవంటివి? అనే విషయాన్ని వేదమే తెలియజేసిందికదా! మరి, ఈకథను చూసి, తరువాత కాలంలో మహర్షులు, కవులు ఇంతగొప్ప ఉన్నతమైన, అనంతమైన వేదాన్ని విడిచిపెట్టారా? వదిలిపెట్టలేదు. తరువాత కూడా రకరకాలుగా భావనలను చేసి వర్ణించి, దీని వైభవాన్నితెలియజేశారు.

మార్కండేయపురాణంలోని ఒకశ్లోకం వేదాలు పర్వతాలవంటివి అని మనకు తెలుపుతున్నది. వేదాలుపర్వతాల

వంటివి అయితే, ఆ పర్వతాల నుండి ఏ ఏ ప్రవాహాలు ప్రవహిస్తున్నాయి? అనే ప్రశ్నకు సమాధానంగా ఈశ్లోకం అవతరించింది. "వ్యాసవాక్యజలౌఘేన కుధర్మతరు హారిణా, వేదశీలావతీర్ణేన, నీరజస్కామహీకృతా" వ్యాసుల సూక్తులే ఆ వేదాలు అనే పర్వతాల నుండి ప్రవహించే ప్రవాహాలు. హిమాలయపర్వతం నుండి గంగానది ప్రవహిస్తున్నదని వింధ్య పర్వతం నుండి నర్మదానది ప్రవహిస్తున్నదని, సహ్యాపర్వతం నుండి కావేరీనది ప్రవహిస్తున్నదని ప్రసిద్ధం. ఆవిధంగానే, వేదపర్వతం నుండి ఏనది ప్రవహిస్తున్నది? అని అంటే, వ్యాసులు వేదాలను ఆధారంగా చేసుకుని అనుగ్రహించిన పురాణాలే ఆ నదులు. వేదపర్వతాల నుండి ఈ పురాణాలు అనే నదులు భూమిపై ప్రవహించేటప్పుడు భూమిలో ఉండే రజస్సు లేకుండా పోతున్నదట. ఇక్కడ నదుల విషయంలో రజస్సు అంటే? దుమ్ము, ధూళి. నీటి ప్రవాహం ప్రవహించినప్పుడు భూమిపై ఉండే దుమ్ము, ధూళి అంతా కొట్టుకుపోతుంది అనే విషయం మనకు తెలిసినదే. పురాణనదులు భూమిపై ప్రవహించినప్పుడు, భూమిపై ఉండే రజోగుణం తొలగిపోతుంది? అని ఇక్కడ చమత్కారంగా ధ్వనించే అర్థం.



పర్వతాలనుండి భూమిపై నదులు ప్రవహించేటప్పుడు, నీటిప్రవాహం అధికం అవుతుంది. ప్రవహించేదారిలో అడ్డుగా ఉండేచెట్లు, రాళ్లు మొదలైన వానిని అన్నిటిని ఆ నీటిప్రవాహాలు కొట్టుకొని పోతూ ప్రవహిస్తాయి. నీటిప్రవాహానికి ఉండే బలం అది. దీనిని మనం లోకంలో ప్రత్యక్షంగా చూస్తున్నాము. వేదపర్వతాల నుండి పురాణనదీప్రవాహాలు ప్రవహించేటప్పుడు ఏవృక్షాలను అవి కొట్టుకొని ప్రవహిస్తున్నాయి? అని అంటే, "కుధర్మతరుహారిణా" అని అంటూ ఈశ్లోకం సమాధానం పలుకుతున్నది. అంటే, అనీతి, అధర్మాలే ఆ వృక్షాలు. అవి ఈ పురాణనదుల చేత పెళ్ళగింపబడిపోతాయి. వాటిని లేకుండా చేస్తూ ఈ పురాణనదులు ప్రవహిస్తాయి అని ఈసూక్తి మనకు తెలుపుతున్నది. ఇప్పుడు, ఇక్కడ భాసించే ఒక రూపక పరంపరను గమనిద్దాం. వేదం అనే పర్వతం, పురాణం అనే నది, *రజోగుణం అనే ధూళి, దుమ్ము, అనీతి, అధర్మం అనే అడ్డుగా ఉండే వృక్షాలు?* అనే ఒక అందమైన రూపక పరంపర ఇక్కడ భాసిస్తున్నది.

ఇంత వరకు వేదాలు పర్వతాలవలె ఉన్నతమైనవి, గొప్పవి, అనేకమైనవి అని, పర్వతాలు నదులకు జన్మస్థానాలు అయినట్లు, వేదం అనే పర్వతం పురాణాలు అనే నదులకు జన్మస్థానమైనది అనే రెండు విశేషాలను గమనించాం.

ఇక, మూడవ విశేషం ఏమంటే, వేదం పర్వతం వలె చాలా గమనికతో సంచరించవలసిన చోటుఅనేది. పర్వతాలను ఎక్కేటప్పుడు శ్రమ కలుగుతుంది. మనం చాలా జాగ్రత్తగా గమనికతో పర్వతాలను ఎక్కాలి, వాటిలో సంచరించాలి. ఆవిధంగానే, వేదం విషయంలో కూడా. వేదాలను అధ్యయనం చేసేటప్పుడు మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఈ విషయాన్ని "సమాహి తధియాసేవ్యమ్" అనే ఒక యాదవ అభ్యుదయ సూక్తి తెలుపుతున్నది. ఏ విధంగా పర్వతాలలో మనం చాలా జాగరూకతతో సంచరించాలో, ఆ విధంగానే వేదాలు అనే పర్వతాలలో కూడా చాలా జాగరూకతతో సంచరించాలి అని ఈ సూక్తి మనకు తెలియజేస్తున్నది. జాగ్రత్తగా అనే అర్థాన్ని చెప్పడానికి సంస్కృతంలో "అప్రమాదతః" అనే ఒకపదం ఉన్నది. ఈ పదాన్ని ప్రయోగిస్తూ వ్యాసమహర్షి మనకు మహాభారతంలో ఈ విషయాన్ని తెలియ జేస్తున్నారు, "అప్రమాదశ్చ వః కార్యః బ్రహ్మ హి ప్రచురచ్ఛలమ్"

అని అంటూ, వేదవిద్యాభ్యాసాన్ని చేసే బ్రహ్మచారులను ఉద్దేశించి వేదవ్యాసమహర్షి ఈ విధంగా తెలియజేస్తున్నారు. “మీరు వేదాన్ని అధ్యయనంచేసే విషయంలో ఎంతమాత్రం అజాగ్రత్తగా ఉండకూడదు. ఎందుకంటే, వేదంలో ప్రమాదపడే సందర్భాలు చాలా ఉన్నాయి. ఏవిధంగా అంటే, వేదసూక్తులను అనుసంధానం చేసేటప్పుడు, కొన్ని కొన్ని సందర్భాలలో దీనికి తర్వాత దీనిని చెప్పాలా? దానిని చెప్పాలా? అనే సందేహం కలిగే సందర్భాలు అనేకం ఉన్నాయి. అజాగ్రత్తగా ఉన్నట్లయితే వేరొక సందర్భంలోకి మనం పోయే ప్రమాదం ఉన్నది. ఈ విధంగా వేదం మనకు ప్రమాదాన్ని కలిగించవచ్చు, భ్రమను కలిగించవచ్చు” అనే సందేశాన్ని వ్యాసులు ఇక్కడ “ప్రచురచ్ఛలమ్” అనే ప్రయోగం ద్వారా సూచిస్తున్నారు. “మీరు చాలా జాగ్రత్తగా ఉండండి” అని తన శిష్యులకు వేద వ్యాసమహర్షి సూచిస్తున్నారు. ఈ విధంగా, ఇంతవరకు వేదాలకు పర్వతాలకు మధ్య ఉండే మూడు విధాలైన సామ్యాలను గమనించాము. అవి, వేదాలు పర్వతాల వలె గొప్పవి, వేదాలు పర్వతాల వలె నదులకు ఎన్నోస్థానమైనవి, వేదాలు పర్వతాల వలె చాలా జాగ్రత్తగా వ్యవహరించ వలసినవి అనేవి.

ఇక, నాలుగవ సామ్యం ఏమంటే, **అధికారసంగ్రహం** అనేగ్రంథంలో వేదాంతదేశికులు “వేంగడవెఱ్పెనవిళంగుమ్వేద వఱ్పే” అనే ఒక సూక్తిని అనుగ్రహించారు. వేంకటాచలపర్వతం అనేది వేదమే. వేదమే ఈపర్వతంగా రూపొందింది అని వారు ఇక్కడ అంటున్నారు. వేదంగా ఉండేసమయంలోనూ ఇది భగవంతుని ధరిస్తూ ఉన్నది, పర్వతరూపంలో ఉండేటప్పుడు కూడా వేంకటేశ్వర భగవంతుని ధరిస్తూ ఉన్నది అని ఇక్కడ భావం.

ఇంతవరకు మనం వేదం పర్వతంవంటిది అని వివరించడం ప్రారంభించి, వేదం పర్వతరూపాన్ని పొందినది అని తెలుసుకున్నాం. ఇక, చివరగా, **నిక్షేపరక్ష** అనే గ్రంథంలో ఉండే ఒక అద్భుతమైన వేదాలకు, పర్వతాలకు మధ్య ఉండేసామ్యాన్ని గమనిద్దాం. **నిక్షేపరక్ష** అనే ఈగ్రంథం శరణాగతిశాస్త్రం. నిధివలె రక్షించదగినది అనే విషయాన్ని తెలుపడం కోసం అవతరించింది. ఇతరులు శరణాగతిని గురించిచేసే ఆక్షేపాలను అన్నిటిని పరిహరించి, ఆ ధర్మాన్ని సుస్థాపించడం కోసం దీనిని



వేదాంతదేశికులు అనుగ్రహించారు. ఆ గ్రంథంలో “నిగమగిరి నిగూడం న్యాస విద్యానిధానమ్” అనే ఒకసూక్తి ఉన్నది. వేద మనే గిరి ఉన్నది కదా! ఆ పర్వతంలో రహస్యంగా గుప్తంగా ఉండే నిధియే “శరణాగతివిద్య”– అని దీని భావం. పూర్వకాలంలో కొందరు ధనికులు తమవద్ద ఉండే ధనాన్ని, అమూల్యమైన వస్తువులను తమ ఇంటిలో దాచుకునే సౌకర్యం లేనప్పుడు, వాటిని దగ్గరలో ఉండే పర్వతాలపై రహస్యంగా తమకు మాత్రమే తెలిసిన ఒకచోట దాచి ఉంచి, ఆవశ్యక మైనప్పుడు అక్కడకు వెళ్లి, వాటిని ఇతరులకు తెలియకుండా తెచ్చుకొని ఉపయోగించుకొని ఆనందించేవారు. ఈవిధంగా చూసినప్పుడు, వేదం అనే పర్వతంలో ఏ నిధి ఉన్నది? అని అంటే, వేదం అనే పర్వతంలో రహస్యంగా యోగ్యులకు మాత్రమే ఉపయోగపడే విధంగా దాచిపెట్టబడిన నిధియే **“శరణాగతి”**. దీని వల్ల మనకు ఏమి తెలుస్తున్నదంటే, నిధివలె మనలను రక్షించగలిగిన శరణాగతి అనే విషయాన్ని తెలియజేయడంతో పాటు, వేదాన్ని ఒక పర్వతంతో పోల్చడం ద్వారా వేదమహిమను కూడా దేశికులు ఇక్కడ మనకు తెలియజేశారు.

*ఓం నమో వేంకటేశాయ*

గృహలక్ష్మి

# శ్రీతులసి

- శ్రీ జె.చంద్రశేఖరశర్మ

**నమస్తులసి కల్యాణి నమో విష్ణుప్రియే శుభే।**
**నమో మోక్షప్రదే దేవి నమః సంపత్ప్రదాయికే॥**

'తులసి' నీకు ప్రణామములు. ఓ ముక్తిని ప్రసాదించే దేవతా! సంపదలను ప్రసాదించే దేవతా! నీకు నా ప్రణామాలు.

శ్రీతులసి సాక్షాత్తూ **'శ్రీలక్ష్మి'** స్వరూపిణి. శ్రీవిష్ణు భగవానునికి తులసి అంటే చాలా ప్రీతి. తులసి దళములు దైవారాధనకు మిక్కిలి శ్రేష్ఠమైనవి. హిందువుల ప్రతి ఇంటి (గృహము) యందు "గృహదేవత"గా తులసిమొక్క ఆరాధింప బడుచున్నది. తులసిమహిమ అపారమైనది. సకల సంపదలు ఆ ఇంటిలో కల్గుతాయని పురాణవాక్కు.

కళ కళ లాడే మహాలక్ష్మికి ప్రియమైన స్నేహితురాలు తులసీ, పాపాలను పటాపంచలు చేయగల శక్తివంతురాలు. పరిమళాలు వెదజల్లగల ధీమంతురాలు. మహాభక్తులలో ప్రముఖుడైన నారదుని సైతము కీర్తింపబడిన సుగుణములు గలది. శ్రీమన్నారాయణుని మనస్సునకు ఎంతో ఇష్టమైన ఈ 'తులసీ'- పవిత్రతకూ, పుణ్యమునకూ మారుపేరు అని పెద్దలు చెపుతారు.

'తులసి' గురించి పవిత్ర గ్రంథాలైన పద్మ, స్కాంద, బ్రహ్మవైవర్త పురాణాలతోపాటు దేవీభాగవతము, గణేశ ఖండనము, హరిభక్త విలాసము, ప్రహ్లాద, అగస్త్యసంహిత గ్రంథాలలోనూ, విష్ణుధర్మోత్తరము, ఇంకా శ్రీమహాభారతము మొదలగు అనేక పురాణగ్రంథములలో కీర్తింపబడింది.

అపారమహిమ గల శ్రీతులసి దర్శన మాత్రముననే సర్వపాపములు నశించును. తులసి దళములచే పూజా కార్య క్రమములు నిర్వహించిన అనంతపుణ్యముతోపాటు సర్వాభీష్ట ములు నెరవేరుతాయి. అందుకే శ్రీతులసిని **"భూలోకపు కల్పతరువు"**గా పేర్కొంటారు పెద్దలు.

తులసి మొక్క ముందు భాగమున సర్వతీర్థములు, మధ్య భాగమున సర్వదేవతలు, చివరిభాగమున సకలవేదముల స్వరూపంగా భావిస్తారు. తులసీపత్రము నందలి అగ్రభాగమున బ్రహ్మ, మధ్యమున శ్రీమహావిష్ణువు, కాండము నందు మహేశ్వరుడు, శాఖలలో అష్టదిక్పాలకులు ఉంటారని గాయత్రి, లక్ష్మి, సరస్వతి, శచీదేవులు, వీరి నివాసరూపం "తులసీ పత్రం"గా భావించి ఆయా శుభాకార్యములకు, పూజాది కార్యక్రమములకు, పూజా అర్చనలలో తప్పనిసరిగా తులసీ పత్రాలను వినియోగం, తులసీతీర్థాన్ని సేవించటం ఆన వాయితీగా వస్తున్న సదాచారం.

తులసీ పత్రమేగాక కాండంనందు గంధము, మూలము నందలి మట్టిలో కూడా సత్త్వగుణము కలిగి ఉంటుందని తులసిని నాటిన, తాకిన, వాసన గ్రహించిన మానవునిలోని తమోగుణము వెడలి "సాత్త్వికగుణం" పెంపొందుతుందని, అందుకే మన పెద్దలు "తులసీకాననం చైవ గృహేయ స్యావర్ధితే" అన్నారు.



**అనన్య దర్శనాః ప్రాతః మే పశ్యంతి తపోధన ।**
**జగత్త్రితయ తీర్థాని తైర్దృష్టాని న సంశయః॥**

ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు ప్రప్రథమంగా తులసిని దర్శించిన ముల్లోకములందలి సకలతీర్థస్థలములను దర్శించిన పుణ్యఫలితము లభించును. తులసిని దర్శిస్తే శ్రీలక్ష్మీనారాయణులను దర్శించిన భాగ్యం లభిస్తుందని, అందుకే హిందువుల ఇండ్లల్లో తప్పనిసరిగా "తులసీ" మొక్క నాటాలనే ఆచారం అనాదిగా మనకు వస్తున్న సంప్రదాయం. శ్రీ తులసి మొక్క దగ్గర సంధ్యాసమయమందు జ్యోతిని వెలిగించినా, నిత్యం భక్తితో ప్రదక్షిణంచేసి నమస్కరించినా, అశుభములు తొలగి సర్వపాపప్రక్షాళన జరిగి వైకుంఠప్రాప్తి కల్గుతుందని, అందుకే ప్రతి ఇంటా "కార్తికమాసంలో" సాయంకాల వేళ "శ్రీతులసీ" కోటయందు సంధ్యాదీపం వెలిగించటం అనాదిగా వస్తున్న ఆచారం.

తులసీదళములు సర్వదేవతలకూ ప్రీతికరమైన పూజా ద్రవ్యం. పూజా-అర్చనల నిమిత్తం తులసీపత్రాలను కోయువారు తప్పనిసరిగా స్నానమాచరించి, శుచియైన తరువాతనే కోయ వలెను. కోసిన తులసీదళములు పదిరోజులవరకు పూజా కార్య క్రమాలకు ఉపయోగించవచ్చునని పురాణాలు చెపుతున్నాయి. ప్రాతః కాలమున మాత్రమే కుడి చేతితోనే తులసీ పత్రములను కోయవచ్చునని పేర్కొంటారు పెద్దలు. ద్వాదశి, శ్రవణా నక్షత్రము నందునూ, అమావాస్య, పూర్ణిమా తిథుల యందును, శుక్ర, మంగళవారాలలోనూ, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రివేళలలోనూ, గ్రహణ సమయాలలోనూ, సంక్రమణ సమయములయందు 'తులసీ పత్రముల'ను కోయరాదు.

పారమార్థికతకు శ్రీతులసీ చాలా ముఖ్యమనుటకు "అవసానదశ"యందు తులసీతీర్థమును, తులసీదళములను నోటిలో పోయటం మోక్షప్రాప్తికి నిదర్శనంగా పేర్కొంటారు పెద్దలు. తులసిలో నాలుగురకాల మొక్కలు కలవు. కృష్ణ, రామ, లక్ష్మీ, నిమ్మతులసీలు. ఇందులో అత్యంత యోగ్యమైంది 'కృష్ణ తులసి' అని తెలుస్తుంది.

**బృందా బృందావని విశ్వపూజితా విశ్వపావనీ।**
**పుష్పసారా నందినీ చ తులసీ కృష్ణజీవనీ॥**
**ఏతన్నామాష్టకం చైవ స్తోత్రం నామార్థసంయుతం।**
**యః పఠేత్ తాం చ సంపూజ్య సోఽశ్వమేధ ఫలం లభేత్॥**

**చివరిపుట వివరణ**

## శ్రీగోవిందరాజస్వామివారి పవిత్రోత్సవాలు

**ఆలయపవిత్రతకు ఏలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు తెలిసీ తెలియక భక్తులూ, ఆలయ సిబ్బంది చేసిన దోషాల పరిహరణార్థం ఆగమశాస్త్రప్రకారం నిర్వహించే కార్యక్రమమే "పవిత్రోత్సవం".**



**ఈ పవిత్రోత్సవాలు కేవలం దేవాలయశుద్ధి, పుణ్యాహ వాచనంలాంటి కార్యక్రమాలు మాత్రం కావు. వీటికంటే భిన్నమైన పవిత్రోత్సవం ప్రత్యేక క్రియకలాపంతో కూడినట్టి కార్యక్రమం. ప్రతి సంవత్సరం భాద్రపదమాసంలో జరిగే తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి పవిత్రోత్సవాలు ఈ సంవత్సరం సెప్టెంబర్ 14 నుండి 16 వరకు మూడురోజులపాటు జరుగు తుంది. భక్తులందరూ ఈ విశేషకార్యక్రమంలో పాల్గొని శ్రీగోవింద రాజస్వామి వారి దీవెనలు అందుకోండి.**

బృంద, బృందావనీ, విశ్వపూజిత, విశ్వపావని, పుష్పసార, నందినీ, తులసి, కృష్ణజీవని అను ఈ తులసీ నామాష్టకమును భక్తిప్రపత్తులతో పఠించిన అశ్వమేధయాగము చేసిన ఫలం కల్గుతుంది. తులసీనామాష్టకమును స్మరించినంత మాత్రముననే సంతానము లేని వారికి సంతానమును, భార్యలేని వారికి భార్యయు, బంధుహీనునకు పెక్కు బంధువులు లభింతురు. రోగపీడితులకు రోగవిముక్తియు, భయభీతులు నిర్భయులుగాను, సకలపాపవిముక్తి పొందుదురు. అందుకే-

**యన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వదేవతాః।**
**యదగ్రే సర్వవేదాశ్చ 'తులసి'త్వాం నమామ్యహమ్॥**

దీని వ్రేళ్ళలో అన్ని పుణ్యతీర్థాలు, మధ్య అందరు దేవతలు, పై భాగంన అన్ని వేదాలు ఉంటాయో ఆ **'తులసి'**కి నేను నమస్కరిస్తున్నాను.

ఆధ్యాత్మికంగా, వైద్యపరంగా, జనుల 'కల్పవృక్షంగా' పేరు గాంచిన గృహదేవత 'శ్రీతులసీ'ని ప్రార్థించి, సేవించి ధన్యులం అవుదాం.

తులసిదేవ్యై నమః.

బాలనీతి

# చిరంజీవులు

– ఉషశ్రీ

*(అరణ్యపర్వంలో మార్కండేయుడు చెప్పిన కథ ఇది)*

పాండవులు అరణ్యవాసం చేస్తున్న రోజులలో వారికి మార్కండేయముని దర్శనభాగ్యం లభించింది. ఆయనకు అర్ఘ్య పాద్యాలిచ్చి పూజించారు. కుశల ప్రశ్నలు సాగినవి. పాండవుల వంటి ధర్మపరులకు కలిగిన క్లేశాలకు విచారించి, ఇంతకంటే దుఃఖాలపాలయిన సీతారాములకథ, నలదమయంతులకథ చెప్పి ఓదార్పు కలిగించాడు. అలా వారికి ఏవేవో పురాతన రాజవంశాల గాథలూ, మహర్షుల విశేషాలూ చెపుతున్నాడు.

ఒకనాడు ధర్మరాజు వినయంగా, చేతులు జోడించి 'మహర్షి! నాకొక ప్రశ్న వచ్చింది. 'మాకు తెలిసినంత వరకూ మీరే చిరంజీవులు. మీరు కాక మరెవరయినా చిరంజీవులున్నారా?' అని అడిగాడు. మార్కండేయముని చిరునవ్వుతో, 'ధర్మనందనా! మంచి ప్రశ్న అడిగావు. తప్పకుండా తెలుసుకోదగ్గది. సావధానంగా విను.'

ప్రాచీనకాలంలో ఇంద్రద్యుమ్నుడనే పేరుగల మహారాజు ఉండేవాడు. ఆయన ఎన్నెన్నో దానాలు చేశాడు. రాజర్షిగా పేరుపొంది, ప్రజలందరి మన్ననలూ పొందిన ఆ పుణ్య పురుషుడు కాలం చెల్లగానే స్వర్గం చేరాడు. అక్కడ కొన్ని సంవత్స రాలు గడిచాక, ఆ మహారాజు సాధించుకున్న పుణ్యకర్మలఫలం పూర్తిగా అయిపోయిందని క్రిందికి పంపేశారు.



భూలోకానికి వస్తుండగా నేను కనిపించాను. కనిపించ గానే నన్ను చూచి 'మహర్షీ! మీరు నన్ను ఎరుగుదురా?' అని అడిగాడు. అప్పటికి నేను చిరకాలంగా తీర్థయాత్రలతో, పుణ్య కర్మలతో, ఉపవాసవ్రతంతో కృశించి ఉన్నాను. అందుచేత 'నాకు గుర్తులేదయ్యా' అన్నాను.

'స్వామీ! మీకంటె ముందు పుట్టిన ప్రాణి ఏదయినా జీవించి ఉన్నదా?' అని అడిగాడు. 'హిమాలయ పర్వతప్రాంతంలో ప్రావారకర్ణం అనే పేరు గల గుడ్లగూబ ఉంది అది నా కంటే పెద్దది. కొంచెం శ్రమపడితే దానిని చూడగలవు,' అన్నాను.

ఇంద్రద్యుమ్నుడు నన్ను వెంటబెట్టుకుని హిమాల యానికి వచ్చి ఆ గుడ్లగూబను చేరి 'నువ్వు నన్ను ఎరుగు దువా!' అన్నాడు. తెలియదని తల ఊపింది, ఆ పక్షి. 'అయితే నీకంటే ముందు పుట్టిన వారిని ఎవరినైనా ఎరుగుదువా?' అని అడిగాడు. 'అయ్యా! ఇక్కడకు యోజనాల దూరంలో ఒక సరోవరం ఉంది. దానిని ఇంద్రద్యుమ్న సరోవరం అని పిలు స్తారు. ఆ కొలనులో నాడీజంఘమనే పేరు గల కొంగ ఉంటుంది. అది నా కంటే పెద్దది,' అంది.

ముగ్గురూ కలిసి ఆ చెరువు దగ్గరకు చేరారు. ఆ మహారాజు మామూలు ప్రశ్న అడిగాడు. అప్పుడా కొంగ 'ఈ కొలనులోనే అకూపారం అనే పేరు గల తాబేలు ఉంది, అది నాకంటె ముందు పుట్టింది', అని జవాబిచ్చింది.

అకూపారాన్ని పిలిచి ఇదే ప్రశ్న వేయగా, అది కన్నీరు విడుస్తూ, 'అయ్యా! ఆయన వెయ్యి మారులు యజ్ఞం చేసి వెయ్యి యూపస్తంభాలు వేయించాడు. ఆయన దానం చేసిన గోవుల రాకపోకలతో భూమి దిగబడి ఇంత సరోవరం అయింది. ఇది ఆయన చలవ' అంది.

ఆ క్షణంలో దేవతలు ఆయనను స్వర్గం తీసుకు వెళ్ళారు. అంటే మన కీర్తి భూలోకంలో ఉన్నంత కాలం మనం స్వర్గంలో ఉంటాం.

**నీతి: యశస్సు భూలోకంలో ఉన్నతకాలం మనం స్వర్గంలో ఉంటాం.**

ఆయుర్వేదం

# గోధుమలతో ఆరోగ్య పరిరక్షణ

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

గోధుమలు నవగ్రహాల్లో సూర్యునికి ప్రీతిపాత్రమైనవిగా మన వేదవాఙ్మయం చెబుతోంది. మనకు అత్యంత ప్రధానమైన ఆహారాల్లో గోధుమల పాత్ర ఎనలేనిది. ఆంగ్లంలో **'వీట్'** గాను, హిందీలో **'గేహు'**గాను పిలువబడే ఈ గోధుమల్లో స్థూలపోషకాలు, వివిధరకాలైన సూక్ష్మపోషకాలు సమృద్ధిగా ఉంటాయి. దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే వివిధ అనారోగ్య సమస్యల నుంచి బయట పడేందుకు గోధుమలను ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం...

**విరిగిన ఎముకలు త్వరగా అతుక్కునేందుకు:** తగినన్ని గోధుమలను మట్టి మూకుడు లేదా ఇనుప బాండీలో నల్లగా మాడ్చి, చల్లార్చి, జల్లించి రోజూ ఉదయం, సాయంత్రం పూటకి 2-3 గ్రాముల ఔషధాన్ని తగినంత తేనెతో సేవిస్తూంటే త్వరగా ఫలితం కలుగుతుంది. ఇదే మసిలో సమంగా పటిక బెల్లం చూర్ణం కలిపి రెండు పూటల పూటకి అర టీ స్పూను పొడిని 50 మి.లీ.ల నీటిలో కలిపి సేవిస్తూంటే స్త్రీలలో అధిక ఋతుస్రావం తగ్గుతుంది.

**ఉబ్బస వ్యాధికి :** ఒక మట్టి మూకుడు లేదా ఇనుప బాండీలో 50 గ్రాముల చొప్పున గోధుమలు, పసుపు కొమ్ములు తీసుకొని సన్న మంటపై దోరగా వేయించి పొడి చేసి రోజు ఉదయం, సాయంత్రం పూటకు 2-3 గ్రాముల పొడిని చప్పరించి గోరువెచ్చని నీరు సేవిస్తూంటే ఉబ్బసవ్యాధి నియంత్రణలో ఉంటుంది.

**బరువు పెరిగేందుకు:** గోధుమలు, బాదంపప్పు, నల్లతుమ్మ బంక, పటికబెల్లం చూర్ణాలు సమానంగా తీసుకొని కలిపి రోజూ రెండు పూటల పూటకి 5-10 గ్రాముల చూర్ణాన్ని 100 మి.లీ. పాలలో కలిపి సేవిస్తూంటే సహజ సిద్ధమైన కండపుష్టి, ఎముక పుష్టితో కూడిన బరువు పెరుగుతారు. (తుమ్మబంకని కొద్దిగా నేతితో వేయించి పొడి చేసుకోవాలి)

**స్థూలకాయం:** పాత గోధుమలు, బియ్యం, జొన్నలు, పెసలు, ఉలువలు, బార్లీగింజలు ఒక్కొక్కటి పావు కిలో చొప్పున తీసుకొని రాత్రంతా నీటిలో నానించి, మరుసటి రోజు ఎండలో బాగా ఎండించి, వేయించి పొడి చేసుకొని రోజు రాత్రి ఒకట్రెండు రొట్టెలు చేసుకొని, అందులో కేవలం నీటిలో ఉడికించిన కూరలను మాత్రమే ఆ రొట్టెలతో పాటు సేవిస్తూంటే దేహంలో అధికంగా సంచితమైన కొవ్వు కరిగి నాజుగ్గా తయారవుతారు. మరీ అవసరమైతే కూరలను దించిన పిదప ఆ కూరల్లో కాస్త ఉప్పు లేదా సైంధవ లవణం పొడి చల్లుకోవచ్చు.

**విరేచనం సాఫీగా అయ్యేందుకు:** 250 గ్రాముల గోధుమ పిండిలో 1-3 టీ స్పూన్ల వంట ఆముదం కలిపి, తగినంత నీరు కలిపి చేసిన ముద్దతో ఒకట్రెండు రొట్టెలు చేసి కాస్త నెయ్యి పెనంపై వేసి కాల్చి, కాస్త పంచదార కలిపి రోజు ఒకసారి తింటుంటే కాలవిరేచనం అవుతుంది. మలబద్ధక సమస్య తొలగిపోతుంది.

**శక్తివర్ధక జావ:** గోధుమలు, బార్లీ సమంగా తీసుకొని విడివిడిగా నేతితో వేయించి, రెంటిని కలిపి పొడి చేసి నిల్వ ఉంచుకొని రోజు ఒకట్రెండు సార్లు తగినంత పొడిని 100 మి.లీ.ల పాలలో వేసి తగినంత పంచదార వేసి, జావలా సేవిస్తుంటే పిల్లల నుంచి పెద్దల వరకు శక్తివర్ధక ఆహారంగా ఉపయోగపడుతుంది.

**అవాంఛిత రోమాలు:** గోధుమపిండి, ఉమ్మెత గింజలపొడి కలిపి తగినంత నీరు చేర్చి మెత్తగా నూరి రోజు ఆయాభాగాల్లో రుద్దుతుంటే అవాంఛిత రోమాలు తొలగిపోతాయి.

**మెడచుట్టు, చర్మంపై ముడతలున్న చోట ఏర్పడే నలుపు తగ్గేందుకు :** గోధుమలను ఒకట్రెండు గంటలు నీటిలో నానించి, మిక్సీలో వేసి పేస్టు చేసి తగినంత తేనె కలిపి పట్టించి గంటసేపు ఆగి కడుగుతుంటే చక్కటి ఫలితం కలుగుతుంది.

**నడుము నొప్పి తగ్గేందుకు:** రోజూరాత్రి 60గ్రాముల గోధుమలను తగినంత నీటిలో నానించి ఉదయం ఒక టీ స్పూను ధనియాల పొడి, అర టీస్పూను గసగసాలు అందులో కలిపి మెత్తగా నూరి 200 మి.లీ.ల పాలలో కలిపి మరిగించి, దించి గోరువెచ్చగా ఉన్నప్పుడు సేవిస్తుంటే నడుము నొప్పి సమస్యకు చక్కటి పరిష్కారం లభిస్తుంది.



పాఠం-34

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ

### अस्मद् शब्दः (నేను) (अहम्)

| | ए | ब |
|---|---|---|
| प्र | अहम् | - वयम् |
| द्वि | माम् | - अस्मान् |
| तृ | मया | - अस्माभिः |
| च | मह्यम् | - अस्मभ्यम् |
| पं | मत् | - अस्मत् |
| ष | मम | - अस्माकम् |
| स | मयि | - अस्मासु |

### युष्मद् शब्दः (నీవు) (त्वम्)

| | ए | ब |
|---|---|---|
| प्र | त्वम् | - यूयम् |
| द्वि | त्वाम् | - युष्मान् |
| तृ | त्वया | - युष्माभिः |
| च | तुभ्यम् | - युष्मभ्यम् |
| पं | त्वत् | - युष्मत् |
| ष | तव | - युष्माकम् |
| स | त्वयि | - युष्मासु |

### 'सर्व' शब्दः (సమస్తము) (समस्तम्)

| | ए | ब |
|---|---|---|
| प्र | सर्वः | - सर्वे |
| द्वि | सर्वम् | - सर्वान् |
| तृ | सर्वेण | - सर्वैः |
| च | सर्वस्मै | - सर्वेभ्यः |
| पं | सर्वस्मात् | - सर्वेभ्यः |
| ष | सर्वस्य | - सर्वेषाम् |
| स | सर्वस्मिन् | - सर्वेषु |

### 'एक' शब्दः (द्विवचन, बहु वचनानि न सन्ति)

| | |
|---|---|
| प्र | एकः |
| द्वि | एकम् |
| तृ | एकेन |
| च | एकस्मै |
| पं | एकस्मात् |
| ष | एकस्य |
| स | एकस्मिन् |

### 'कति' शब्दः (एकवचन द्विवचनानि न सन्ति)

| | |
|---|---|
| प्र | कति |
| द्वि | कति |
| तृ | कतिभिः |
| च | कतिभ्यः |
| पं | कतिभ्यः |
| ष | कतीनाम् |
| स | कतिषु |

### 'अनेक' शब्दः (एकवचन द्विवचनानि न सन्ति)

| | |
|---|---|
| प्र | अनेके |
| द्वि | अनेकान् |
| तृ | अनेकैः |
| च | अनेकेभ्यः |
| पं | अनेकेभ्यः |
| ष | अनेकेषाम् |
| स | अनेकेषु |

### 'तत्' शब्दः (सः) (వాడు)

| | ए | ब |
|---|---|---|
| प्र | सः | ते |
| द्वि | तम् | तान् |
| तृ | तेन | तैः |
| च | तस्मै | तेभ्यः |
| पं | तस्मात् | तेभ्यः |
| ष | तस्य | तेषाम् |
| स | तस्मिन् | तेषु |

| | ए | ब |
|---|---|---|
| प्र | त्वम् | - यूयम् |
| द्वि | त्वाम् | - युष्मान् |
| तृ | त्वया | - युष्माभिः |
| च | तुभ्यम् | - युष्मभ्यम् |
| पं | त्वत् | - युष्मत् |
| ष | तव | - युष्माकम् |
| स | त्वयि | - युष्मासु |

('एषः' इति शब्दः सः शब्दः वत्; यः, कः इति शब्दाः सर्वशब्दः वत् वक्तव्यः। प्रायशः सर्वनामशब्दाः सर्वे 'सर्व' शब्द इव भवन्ति।)

సెప్టెంబరు, 2024

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం–**రవి సంచారం మాసద్వితీయార్ధంలో అత్యంత అనుకూలం. శరీరఆరోగ్యం బాగుంటుంది. గృహమున ఆనందోత్సవాలు తలబెట్టిన పనులు సత్వరమే పూర్తి చేస్తారు. సమాజంలో కీర్తివృద్ధి, గౌరవమర్యాదలు పెరుగుతాయి. వ్యాపారంలో వృద్ధి ఆశించిన ఫలితాలుంటాయి.

**వృషభం–** ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించవలసి ఉంటుంది. పలుకుబడి, గౌరవం, ధనాదాయం పెరుగుతుంది. కొత్త విషయాలపై అవగాహన పెరుగుతుంది. విద్యార్థులు కొత్త కోర్సులలో బాగా రాణిస్తారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతారు.

**మిథునం–** మానసిక ఒత్తిళ్లు మరియు ఆందోళనలను అధిగమిస్తారు. మీ బంధువులు మరియు స్నేహితులు మీ విలువను గుర్తించి మీకు గౌరవం ఇస్తారు. ఈ మాసంలో మానసిక ప్రశాంతత కలిగి ఉంటారు.

**కర్కాటకం–** మీ ఆదాయానికి మించి ప్రోత్సాహం కల్గుతుంది. మీ తోబుట్టువుల నుండి కూడా కొన్ని లాభాలు కల్గుతాయి. పిల్లల విషయంలో వృద్ధి. సంతోషకరమైన శుభవార్తను వింటారు. సమాజంలో మీ హోదా మరియు గౌరవం పెరుగుతాయి.

**సింహం–** శుభవార్తలు వింటారు. ఆరోగ్యము మరియు ఆదాయ అవకాశాలు లభిస్తాయి. స్నేహితుల నుండి మద్దతు పొందుతారు. రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు ఇది సరైన సమయం. వివాహ అవకాశాలు, వినోదం మరియు వ్యాపారంలో వృద్ధి కల్గుతుంది.

**కన్య–** సంపద, ఆనందం, విద్యలో విజయం, వివాహ అవకాశాలు, వినోదం మరియు వ్యాపారంలో వృద్ధిని పెంచుతుంది. ఇతరులను శాసించాలనే దృక్పథం వీడితే సీనియర్లతో మరిన్ని సమస్యలను తగ్గించుకోవచ్చు.

**తుల–** మీ ప్రాముఖ్యత అవసరాన్ని అందరూ గుర్తిస్తారు. రాజకీయంగా ఎదుగుదలకు మంచి సమయం. స్థానిక సమస్యలకు న్యాయస్థానమును ఆశ్రయిస్తారు. వస్తువులు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం–** ఆశయ సిద్ధి, అప్పుల నుండి ఉపశమనము, ఆర్థిక స్థిరత్వము, అందరికీ ప్రయోజనకారిగా ఆదర్శంగా ఉంటారు. వస్తువస్త్ర ఆభరణములను కొంటారు. వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలి.

**ధనుస్సు–**మీరు పదిమందికి అండదండగా ఉంటూ కార్యజయం పొందుతారు. భార్య, తల్లిదండ్రుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం. కుజ సంచారం దోష నివారణకు సుబ్రహ్మణ్య ఆరాధన, అభిషేకం, ప్రదక్షిణలు చేయాలి.

**మకరం–** ఉన్నతమైన ఆశయములే మిమ్ములను ముందుకు నడిపిస్తాయి. ఒక ఆహ్లాదకరమైన జీవనశైలికి అలవాటు పడతారు. బంధుమిత్రుల ప్రశంసలు, పరిచయం అట్లే మంచిమిత్రుల అండ మీకుంటుంది.

**కుంభం–** చెడు సహవాసాలకు దూరంగా ఉండటం మంచిది. సహోద్యోగులతో వివాదాల నుండి తెలివిగా తప్పించుకుంటారు. విద్యార్థులు ప్రయత్నాలు తీవ్రతరం చేస్తారు. కృషి మరియు శ్రద్ధ అవసరాన్ని గుర్తిస్తారు.

**మీనం–** ప్రయత్నాలన్నీ విజయవంతమవుతాయి. వ్యాజ్యాల విషయాల్లో ఉపశమనం కనిపిస్తుంది. సంపాదన మెరుగుపడుతుంది. వాహనం, సంపద మరియు విలాసవంతమైన సౌకర్యాలతో జీవనశైలి సంపన్నంగా ఉంటుంది.

చిత్ర కథ

# శ్రీవారి సాక్ష్యం

కథ– డా॥ మన్నవ గంగాధరప్రసాద్
చిత్రాలు– శ్రీ కె.ద్వారకనాథ్






**నీతి-** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి తన భక్తులను తానే రక్షించుకుంటాడనటానికి ఇదే ఒక సాక్ష్యం.

# బాలవినోదం

## సంఖ్యలను కలిపి రంగులు వేయండి



## చిత్రాన్ని చూడండి

రంగులు వేయండి





అ) వినాయకుడు

ఆ) బలరాముడు

ఇ) వామనుడు

పైన చెప్పిన దేవుళ్లకు సంబంధించి తగినట్లుగా వృత్తంలో సంఖ్యలను వ్రాయండి.

ప్రతి దేవునికి సంబంధించిన చిత్రాలను కనుగొనండి.

జవాబు:
అ) 3, 5, 8, 11
ఆ) 1, 4, 6, 9
ఇ) 2, 7, 10, 12

ఇక్కడ ఉన్న దైవాలను, క్రింద ఉన్న వన్యప్రాణులు చేరే మార్గం కనుగొనండి!



అ, ఆ, ఇ అక్షరాలను 1, 2, 3, సంఖ్యలతో కలపండి

జవాబులు: అ-1, ఆ-3, ఇ-2

## నీతివాక్యం

క్రింది పదాలను సరిచేసి వాక్యాలుగా అమర్చండి...



జవాబు:
తన కోపమె తన శత్రువు'
తన శాంతమె తనకు రక్ష

చక్రంలో అదే రంగులో ఉన్న ప్రశ్నకు తగిన సమాధానం వ్రాయండి!!

| ప్రశ్న |
|---|
| వినాయకచవితి వచ్చే తెలుగు నెల? |
| గణపతి సహోదరుడి పేరు? |
| ప్రథమపూజలు అందుకునే వారు? |
| గణపతి రాసిన ఇతిహాసం పేరు? |
| గణపతి వాహనం? |
| గణపతికి ఇష్టమైన పిండివంటలు? |
| వినాయక చవితి రోజున దీనిని చూడకూడదు? |
| గణపతిని దీనితో పూజిస్తారు. |

జవాబులు:
భాద్రపదం, సుబ్రహ్మణ్యం, గణపతి, మహాభారతం, మూషికం, కుడుములు ఉండ్రాళ్లు, చంద్రుడు, గరిక

## చిత్రాలను చూసి పేరు కనుక్కోండి







జవాబులు
బల+రాముడు = బలరాముడు,
శేష+అద్రి = శేషాద్రి

## నీతిని తెలుసుకుందాం!

క్రింది బొమ్మలలోని కథను వరుసగా చేర్చి నీతివాక్యాన్ని తెలుసుకోండి!




జవాబులు - 2, 4, 3, 1

నీతి - ఆపదలో సహాయం చేయనివాడు మిత్రుడు కాడు

## విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# మూర్ఖుడికి తెలియజెప్పలేము

ఎడ్డె దెలుపవచ్చు నేడాది కైనను;
మౌని దెలుపవచ్చు మార్గమునను;
మొప్పె దెలుపరాదు ముప్పదేండ్లకు నైన;
విశ్వదాభిరామ! వినుర వేమ!!

**అర్థాలు:** ఎడ్డె= ఏమీ తెలియనివాడు; ఏడాది= సంవత్సరం; మౌని= మౌనంగా ఉండేవాడు.

**భావం:** ఒక్క సంవత్సరమైనా ప్రయత్నించి అవివేకికి తెలివి కలిగేటట్లు చేయవచ్చు. ఏదైనా ఒక మార్గంలో మౌనికి తెలియజేయవచ్చు. కాని ముప్పయి సంవత్సరాలు ప్రయత్నించినా మూర్ఖునికి తెలియజెప్పలేము.

**వివరణ:** ఎడ్డె అంటే అవివేకి. వివేకం అంటే తెలివి. అది లేనివాడు అవివేకి. ప్రయత్నిస్తే అవివేకికి క్రమంగా వివేకం అబ్బేటట్టు చేయవచ్చు. కొందరు మౌనాన్ని వ్రతంగా అవలంబిస్తూ ఉంటారు. మౌనులు మాట్లాడకపోవడమే కాదు. సైగలద్వారా కాని, వ్రాసికాని తమభావాలు తెలియజేయకూడదు. ఏభావం లేకుండా, మనసు మౌనంగా ఉండాలి. అయినా ఏదో ఒకపద్ధతిలో వాళ్లకు కూడా విషయాన్ని తెలియజేయవచ్చు.

మొప్పె అంటే మూర్ఖుడు. తనకు తెలియదు, ఇతరులు తెలియజెప్పబోతే వినడు. అటువంటి మూర్ఖుడికి ఎంతకాలం ప్రయత్నించినా తెలియజెప్పలేం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## భాస్కరశతకం

# దాతకు ఇవ్వగలిగే శక్తి లేకున్నా ప్రయత్నంతో ఇవ్వగలడు

దానము సేయఁగోరిన వదాన్యున కీయఁగ శక్తి లేనిచో
నైనఁ బరోపకారమునకై యొక దిక్కునఁ దెచ్చి యైన నీఁ
బూనును మేఘుఁ డంబుధికిఁ బోయి జలంబులఁ దెచ్చి యీయఁడే
వాన సమస్తజీవులకు వాంఛిత మింపెసలార భాస్కరా !



**తాత్పర్యం**

భాస్కరా! దానం చేయదల్చుకొన్న దాతకు ఇచ్చే సామర్థ్యం లేకున్నా, పరోపకారార్థం వేరో చోటునుంచి తెచ్చి ఇచ్చే ప్రయత్నం చేస్తాడు. ఇది ప్రకృతి సిద్ధం. అంతస్సారం లేనివాడైనా, సముద్రానికి పోయి అప్పు (నీళ్ళు) తెచ్చి మేఘుడు సకలప్రాణులు హర్షించే విధంగా వర్షిస్తాడు గదా!

– వ్యాఖ్యాత: డా॥తిరుమల శ్రీనివాసాచార్య

## జూలై నెల క్విజ్-24 సమాధానాలు

01) శంఖచూడుడు
02) భగవద్గీత
03) ఈశ్వరమునివర్యులు
04) సిద్ధేంద్రయోగి
05) జగన్నాథుడు
06) సుబ్రహ్మణ్యస్వామి
07) విష్ణుచిత్తుడు
08) నీలమేఘశ్యామవర్ణం
09) తిరుమలనంబి
10) కోరికలు
11) ఆంజనేయుడు
12) మరణం
13) వందసంవత్సరాలు
14) పుణ్యక్షేత్ర సందర్శనం
15) ఆదిశేషుడు
16) నారాయణమంత్రం
17) శ్రీవేంకటేశ్వరస్వామి
18) మేధోతిథి
19) శయనఏకాదశి
20) గురువులు

సరైన సమాధానాలు ఎవ్వరూ వ్రాయలేదు

# క్విజ్ 26

01) ఆదిదంపతుల ప్రథమపుత్రుడిగా ఎవరిని కొలుస్తాం? జ)..........
02) ఎవరిని దర్శిస్తే మనకందరికీ శుభ, జ్ఞాన, మోక్షప్రదం? జ)..........
03) జయ, విజయులు ఏ మహర్షుల శాపానికి గురైయ్యారు? జ)..........
04) భాద్రపదశుక్లపక్షవిదియరోజు ఏర్పడే జయంతి? జ)..........
05) హిరణ్యాక్షుణ్ణి సంహరించింది ఎవరు? జ)..........
06) తిరుమల శ్రీవేంకటేశ్వరాలయానికి ప్రక్కన గల పుష్కరిణికి వాయవ్యమూలలో ఉన్న ఆలయం? జ)..........
07) చక్రరాజభటులు ఎవరి సైన్యాన్ని ఓడించారు? జ)..........
08) వేదం సరస్వతిని ఏమని నుతించింది? జ)..........
09) విశ్వరచన చేసే విశ్వేశ్వరుని విజ్ఞానమంతా ఒక రూపుకడితే ఆమె.. జ)..........
10) గదావిద్యలో ఆరితేరిన వాడెవడు? జ)..........
11) ఎవరికి ప్రకృతితో అవినాభవ సంబంధముంది? జ)..........
12) శేషనాగ అవతారం ఎవరిది? జ)..........
13) శత్రువులను సంహరించేవాడు? జ)..........
14) భాద్రపదశుక్లపక్ష ద్వాదశి రోజు ఏర్పడే జయంతి? జ)..........
15) అదితి, కశ్యప మహర్షుల కుమారుడిగా జన్మించిన విష్ణుని పేరు? జ)..........
16) వినాయకచవితికి మరుసటిరోజు ఏర్పడే పంచమి పేరు? జ)..........
17) సప్తర్షుల సమగ్ర అక్షరదర్శనం ఏ ఉపనిషత్తుల్లో ఉంది? జ)..........
18) విశ్వామిత్రుని ధర్మపత్నిపేరు? జ)..........
19) భాద్రపదశుద్ధ చతుర్దశినాడు ఏర్పడే వ్రతం? జ)..........
20) 'అమ్బలమ్' అంటే...... జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-09-2024.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........
పాఠశాల: .......... తరగతి: ..........
పేరు: ..........
చిరునామా: ..........
..........
..........
.......... పిన్‌కోడ్: ..........
ఫోన్ సంఖ్య: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**
ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)



## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

2. కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

3. సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

4. విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

5. చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

6. చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
........................................ తేది : ..................

ప్రదేశం :
తేది :
చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2264360, 2264543, 2264359.

# వైకుంఠపాళి 104



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)రామలక్ష్మణుల్ని యాగరక్షణార్థం తీసుకెళ్లిన మహర్షి(4); 3)జాంబవతి తండ్రి(4); 7)సూర్యకిరణము(2); 8)వరాలు పొందిన రాక్షసులు ఇది కల్గి యుంటారు(3); 9)శత్రువు(2); 12)సముద్రంపై రాముడు నిర్మించినది(3); 13)మారుతి సముద్రాన్ని దాటుచుండగా అడ్డు వచ్చిన స్త్రీ(3); 17)చేపలు పట్టేందుకు ఇది వేస్తారు(2); 18)రాక్షసుల ఆహారం(3); 19)'విహారం'లో దండ(2); 22)బ్రాహ్మణుని మెడలో ఇది తప్పక ఉంటుంది(4) 23) సముద్రము(4)

### నిలువు

1)అనుకున్న పని పూర్తికాకపోతే మానవుడు ఇది పొందుతాడు(4); 2)కులముకన్న గుణము .....(2); 4)కొంగ(2); 5)"తలలు" పదంలో ఒక అక్షరం చేరిస్తే కోరికలు(4); 6)విష్ణుమూర్తి ఖడ్గం(3) 10)మన్మథుడు(3); 11)సరసానికి వ్యతిరేకం(3); 14)రాముడు ఎక్కుపెట్టిన విల్లు(4); 15)యజ్ఞములు చేయునపుడు అగ్నిలో వేయునది(3); 16)అలలు(4); 20)అక్కమొగుడు(2); 21)'వికారం'లో మంట(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



16-07-2024న తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగిన 'ఆణివరఆస్థానం'లో
తిరుమల పెద్దజీయర్ స్వామీజీ, చిన్నజీయర్‌స్వామిజీ,
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
సంయుక్తకార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,లు పాల్గొన్న దృశ్యం.



22-07-2024న అప్పలాయగుంట
శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారికి
జరిగిన 'పుష్పయాగ' మహోత్సవ దృశ్యం



29-07-2024న 'ఆడికృత్తిక' సందర్భంగా తిరుత్తణి శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి
తి.తి.దే. తరపున పట్టువస్త్రాలను సమర్పిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., దంపతులు .



23-07-2024న తిరుమల 'కల్యాణకట్ట' లో భక్తులతో మాట్లాడుతున్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్. వీరితో తి.తి.దే.
సంయుక్తకార్యనిర్వహణాధికారిణి(విద్య & ఆరోగ్యం) శ్రీమతి ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్.,
చీఫ్ పి.ఆర్.ఓ. డా॥ టి.రవి మరియు ఇతర అధికారులు పాల్గొన్న దృశ్యం



27-07-2024న తిరుమల శ్రీవారి ఆలయంలో తి.తి.దే. నూతన అదనపు
కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి,
ఐ.ఆర్.ఎస్., దంపతులకు తిరుపతి సంయుక్తకార్యనిర్వహణాధికారి
శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,గారలు శ్రీవారిప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం.



07-08-2024న తిరుమల శ్రీవారి ఆలయంలో
తి.తి.దే. నూతన ముఖ్యనిఘా మరియు భద్రతాధికారిగా
శ్రీ ఎస్.శ్రీధర్, ఐ.పి.ఎస్., పదవీబాధ్యతలు స్వీకరించి,
కుటుంబసమేతంగా శ్రీవారిని దర్శించుకున్న దృశ్యం.

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams Printing on 25-08-2024 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.

